fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 28 | విజయవాడ, సోమవారం 29 జనవరి 2018 | 12 + 12 పేజీలు వేల : 4.00

సామాజిక సమస్యలే అజెండా

జాతీయ స్థాయిలో రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక



- ప్రజాశక్తితో బివి రాఘవులు
- బిజెపిని ఓడించాల్సిందే
- కాంగ్రెస్‌తో సర్దుబాట్లు, అవగాహన, పొత్తులు ఉండవు
- చంద్రబాబుది ఈవెంట్ మేనేజ్‌మెంట్
- పవన్ పర్యటనలో స్పష్టత ఏదీ?
- త్రిపురలో ఉగ్రవాదులతో చేతులు కలుపుతున్న బిజెపి

3

సామాన్యులకు 'పద్మ'లు

మన్‌కి బాత్‌లో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : ఈ ఏడాది పద్మ అవార్డులను సామాన్యుల చెంతకు తీసుకువచ్చామని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. ఇప్పటి వరకు పెద్ద పెద్ద నగరాలలో వారికే అవార్డులు వచ్చాయని, ఈ సారి ఆ పద్ధతి మార్చామని చెప్పారు. కొత్త సంవత్సరం లో తొలి మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో ఆదివారం ఆయన మాట్లాడారు. పద్మ అవార్డుల ఎంపిక ప్రక్రియ ఈ విడత చాలా పారదర్శకంగా జరిగిందన్నారు. పద్మ అవార్డులకోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను సమాజంలో వారికున్న గుర్తింపు కన్నా వారు మిగతా 9లో



మళ్ళీ తలాక్!

నేటి నుండి పార్లమెంట్ సమావేశాలు

- బిసి కమిషన్, ఎఫ్ఆర్‌డిఐలతో పాటు మరో 35 బిల్లులు
- 'మహిళా రిజర్వేషన్' ఊసెత్తని కేంద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మరికొన్ని గంటల్లో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండగా వివాదాస్పద తలాక్‌బిల్లు మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ బిల్లును ఎటువంటి పరిస్థితుల్లోనూ తాజా సమావేశాల్లో ఆమోదింపచేసుకోవాలన్న పట్టుదలను ప్రభుత్వ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశాల్లోనూ ఈ అంశం చర్చకు వచ్చింది. సమావేశానంతరం విలేకరులతో మాట్లాడిన పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ తాజా సమావేశాల్లో తలాక్ బిల్లుకు ఆమోదముద్ర పడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 'జిఎస్‌టి తరహాలోనే తలాక్ బిల్లునూ ఏకగ్రీవంగా ఆమోదించాలని అన్ని రాజకీయపక్షాలను కోరాం' అని ఆయన చెప్పారు. ప్రస్తుత సమావేశాల తొలిదశలోనే ఈ బిల్లును ఆమోదింపచేసుకోవాలన్న పట్టుదలతో నరేంద్రమోడీ ప్రభుత్వం ఉంది. దీనిలో భాగంగానే ఎన్‌డిఎ మిత్రపక్షాలతో కూడా కేంద్ర మంత్రులు చర్చలు ప్రారంభించినట్టు సమాచారం. అఖిలపక్ష సమావేశం ముగిసిన తరువాత కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. దీనిపై విలేకరులు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిని వివరణ కోరగా ' సహచరులతో మాట్లాడుతున్నాం. రాజకీయ పార్టీలను ఒప్పించేందుకు ఏ చిన్న అవకాశం వచ్చినా దానిని వదులుకోం' అని చెప్పారు. శీతాకాల సమావేశాల్లో లోక్‌సభలో ఆమోదం పొందిన ట్రిపుల్ తలాక్ బిల్లు రాజ్యసభలో ఆమోదానికి నోచుకోలేదు. బిల్లులో కొన్ని అంశాలను ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. బిల్లును సెలెక్టు కమిటీకి పంపించాలని డిమాండ్ చేశాయి. దీంతో రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందకుండానే శీతాకాల సమావేశాలు ముగిశాయి. తలాక్ బిల్లును సెలెక్టు కమిటీకి పంపించాలంటూ రాజ్యసభలో కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బడ్జెట్ సమావేశాల మొదటిరోజే పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉందని సమాచారం. బిల్లుపై ఏకాభిప్రాయ సాధనకు యత్నిస్తామని, అత్యవసర ఆదేశాన్ని తీసుకురాకపోవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు బిసి కమిషన్‌కు రాజ్యాంగ హోద కల్పించే బిల్లును కూడా ఈ సమావేశాల్లోనే ఆమోదించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మిగతా 9లో

అమరావతిలో మౌలిక సదుపాయాలకు

రూ.40 వేల కోట్లు

రూ.33,368 కోట్ల పనులకు టెండర్లు

ఏప్రిల్‌లో సంతోష నగరాల సదస్సు

ముఖ్యమంత్రి చంద్రబాబు



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వార్త 2లో

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతిలో మౌలిక సదుపాయాల కోసం రూ.40 వేల కోట్లతో ప్రణాళికల్ని సిద్ధం చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇప్పటికే రూ.33,368 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. సీఆర్డీఏ ఉన్నతాధికారులతో ఆదివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) ఆధ్వర్యంలో లక్ష చదరపు అడుగుల భవన సముదాయాలు, 330 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు, 1,300 కిలోమీటర్ల ఎల్‌పిఎస్ రోడ్లు నిర్మిస్తామన్నారు. అలాగే వచ్చే మూడేళ్ళలో 5,040 ఇళ్లను నిర్మిస్తామన్నారు. ఈ ఏడాది ఏప్రెల్‌లో అమరావతిలో సంతోష నగరాల సదస్సును నిర్వహిస్తామన్నారు. ప్రతి మిగతా 9లో

ప్రభుత్వాలలో వ్యక్తి పూజ తగదు



మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి చలమేశ్వర్

- రవీంద్రరావు తృతీయ స్మారకోపన్యాసంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్

ప్రజాశక్తి - మొగల్రాజపురం (విజయవాడ)

70 సంవత్సరాల నుంచి రాజ్యాంగబద్ధంగా నడుస్తున్న ప్రభుత్వాలలో వ్యక్తి పూజకు విపరీతమైన ప్రాధాన్యత ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ అన్నారు. పిబి.సిద్ధార్థ ఆడిటోరియంలో కంతమనేని రవీంద్రరావు మెమోరియల్ ఫౌండేషన్ అధ్వర్యంలో ఆదివారం జరిగిన రవీంద్రరావు తృతీయ స్మారకోపన్యాసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రవీంద్రరావు మంచి వ్యక్తిత్వం, నిబద్ధత కలిగినవారని కొనియాడారు. భిన్నమైన అభిప్రాయాలను స్వాగతించి చర్చించే పట్టణం విజయవాడ అన్నారు. దేశం, సంఘం జీవన విధానాన్ని రాజ్యాంగం తెలియజేస్తుందని తెలిపారు. ప్రస్తుతం దేశంలో అసమానత్వం ఎక్కువగా ఉందని, దీనికి మతం, కులం, ప్రాంతం, ఆర్థిక పరిస్థితులే కారణమన్నారు. వారసత్వ పరిపాలనా ప్రజాసామ్యానికి తూట్లు పొడుస్తోందని పేర్కొన్నారు. గతంలో తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం ఉందో అందరికీ తెలుసని, జడ్జిని అయిన మరునాడే ఆ పార్టీతో అనుబంధాన్ని వదులుకున్నానని గుర్తు చేశారు. తాను జడ్జి పదవిలోకి మిగతా 9లో

ఏజెన్సీలో ఫీడర్ అంబులెన్సులు

- పైలట్ ప్రాజెక్టుగా 122 వాహనాలు

12



రీలింగు యూనిట్

'రీలింగు'పై రోకటి పోటు

- పట్టుదారం ఉత్పత్తిపైనా పన్ను
- ఆందోళన బాటలో యూనిట్ యజమానులు

2

మూడున్నర నెలల్లో...

ఖర్చు రూ.580 కోట్లే!

నత్తనడకన పోలవరం పనులు

మొత్తం ఖర్చు 13వేల కోట్లే

2019కీ కష్టమేనంటున్న అధికారులు




ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టుకు చేస్తున్న ఖర్చును పరిశీలిస్తే ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది. గత మూడున్నర నెలల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం కేవలం రూ.580 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు స్వయంగా అధికారులే వెల్లడించడం విశేషం. అలాగే ఇప్పటివరకు మొత్తం ప్రాజెక్టు నిర్మాణంలో రూ.13 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈ వ్యయ పరిణామాల్ని గమనిస్తే ముఖ్యమంత్రి చెబుతున్నట్లుగా వచ్చే ఏడాదికి ప్రాజెక్టు నిర్మాణం సాధ్యం కాదని అటు ఆర్థికశాఖ, ఇటు నీటిపారుదల శాఖల అధికారులు అంగీకరిస్తున్నారు. పోలవరాన్ని మిగతా 9లో

పన్ను విధానాలలో అనిశ్చితి తొలగించండి

అరుణ్‌జైట్లీకి కార్పొరేట్ అమెరికా వినతి



వాషింగ్టన్: బహుళజాతి కంపెనీలు, సంస్థాగత పెట్టుబడిదారుల విషయంలో పన్ను విధానాలలో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితులను తొలగించాలని అమెరికన్ కార్పొరేట్ సంస్థలు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి విజ్ఞప్తి చేశాయి. ఈ చర్య ద్వారా భారత్ మరింత ఎక్కువగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించేందుకు అవకాశం ఏర్పడుతుందని అమెరికా-భారత్ వాణిజ్య మండలి అధ్యక్షురాలు నిషాదేశాయ్ బిస్వాల్ ఆర్థిక మంత్రికి సమర్పించిన వినతిపత్రంలో సూచించారు. పన్ను విధానాలలో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితులను తొలగిస్తే భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న బహుళజాతి కంపెనీలు, సంస్థాగత పెట్టుబడిదారులకు పెట్టుబడులకు మరింత సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆమె ఈ వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో పెట్టుబడులు లాభార్జనవైపే ఆకర్షితమవుతున్నాయని, ప్రపంచ స్థాయి వాణిజ్య సంస్థలు తమ పెట్టుబడులను పన్ను అనంతరలాభాలు ఎక్కువగా వుండే దిశలోనే మళ్లిస్తున్నాయని ఆమె వివరించారు. పన్ను విధానాలలో అనిశ్చితి ముఖ్యంగా పరాయిదేశంలో కొనసాగుతున్న పరిస్థితుల్లో పెట్టుబడిదారులు తమ పెట్టుబడుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తారన్నారు. ప్రపంచ పెట్టుబడుల గమ్యంగా భారత్‌ను ప్రోత్సహించేందుకు భారత ఆర్థిక వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు ప్రధాని నరేంద్రమోడీ చేపట్టిన ప్రణాళికలను తాము స్వాగతిస్తున్నామని, ఈ విధానాలతో అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించటంలో భారత్ విజయం సాధిస్తుందని భావిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఇందుకు స్థిరమైన ఆర్థిక పరిస్థితులు, గతంలోని తేదీల నుండి వర్తింప చేస్తున్న పన్నుల విధానాలు, చట్టపరమైన కేసుల పరిష్కారం వంటివి అందుబాటులోకి రావాల్సిన అవసరం వుందన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న రిటైర్డ్ జడ్జి, టిటిడి ఉద్యోగుల పరిరక్షణ వేదిక అధ్యక్షులు పి.గురప్ప

టిటిడిలో 'మతోన్మాదం'

- హైందవేతర ఉద్యోగులంటూ రాద్ధాంతం
- 45 మందికి టెర్మినేషన్ నోటీసులు
- సంఘ్ పరివారం ఒత్తిడికి అధికారుల దాసోహం
- భగ్గుమంటున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు
- రిటైర్డ్ జడ్జి అధ్యక్షతన ఉద్యోగుల పరిరక్షణ వేదిక ఏర్పాటు

9

సామాజిక సమస్యలే అజెండా

జాతీయ స్థాయిలో రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక

సామాజిక సమస్యలే అజెండాగా జాతీయ స్థాయిలో రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక నిర్మించడానికి ప్రయత్నిస్తామని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివిరాఘవులు అన్నారు. హైదరాబాద్‌లో అదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఏప్రిల్‌లో జరిగే అఖిల భారత 22వ మహాసభల్లో చర్చించే అంశాలు, ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక నిర్మాణం, జాతీయ రాజకీయాలు, త్రిపుర ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న టిడిపి, టిఆర్‌ఎస్ వైఖరి, ఏపిలో ప్రతిపక్ష వైసిపి వైఖరి, పవన్ కల్యాణ్ పర్యటనపై ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌తో ఎలాంటి అవగాహన, పొత్తులు, సర్దుబాట్లు లేకుండానే బిజెపిని ఓడించడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తామని చెప్పారు. పవన్ కల్యాణ్ వైఖరిలో స్పష్టత లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గతం నుంచి సిఎం చంద్రబాబు ఇంకా పాఠాలు నేర్చుకోలేదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ మోడల్ అంటూ అమరావతి అభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడుతున్నారని విమర్శించారు.
ఇంటర్వ్యూ వివరాలు...



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'సామాజిక సమస్యల్ని పరిష్కరించడం సమాజ బాధ్యత. ఉమ్మడి రాష్ట్రంలో సామాజి క సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు సిపిఎం చేసింది. ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ ఆ కృషి మరింత ఉధృతంగా సాగుతోంది. బూర్జువా పార్టీలన్నీ కులాల్ని ఓట్లుగా చూస్తున్నాయి. వామపక్షాలుగా మేము మాత్రం వారిని ఓట్లుగా చూడడం లేదు. అణిచివేయబడిన కులాల్ని సమీకరిస్తున్నాం. వారి ప్రయోజనాల కోసం సబ్‌ప్లాన్ తేవాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కావాలని పోరాటం చేస్తున్నాం. సామాజిక అంతరాల్ని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాం. అయితే మేము చేస్తున్న ప్రయత్నాలను ఆ పార్టీలు కుల సమస్యగా చిత్రీకరిస్తున్నాయి. దేశంలో అంటరానితనం, వివక్ష ఉంటే సోషలిజాన్ని ఎలా స్థాపిస్తాం? కుల వ్యవస్థను నాశనం చేస్తేనే వర్గ పోరాటం సాధ్యం. తెలంగాణలో ఏ పార్టీకో మేలు చేయాలని మేము బిఎల్‌ఎఫ్ ఏర్పాటు ఏయలేదు. ప్రజల కోసం ఏర్పాటు చేశాం. మేము సూచిస్తున్న ప్రత్యామ్నాయ విధానాలపై ఎవరు కలిసి వచ్చినా స్వాగతిస్తాం. మద్దతిస్తాం, సామాజిక అంశాలను రాజకీయ అజెండాగా మారుస్తాం. జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ వేదికను నిర్మించడానికి ప్రయత్నిస్తాం.

పాలక పార్టీలన్నిటిదీ ఒకే విధానం

దేశంలోని పాలక పార్టీలన్నీ ఒకే రకమైన విధానాన్ని అనుసరిస్తున్నాయి. అధికారం కోసం రాజకీయాలు చేస్తున్నాయి. జాతీయ స్థాయిలో సామాజిక శక్తులు ఒక్కటి కావాలి. ప్రత్యామ్నాయ విధానంతో ముందుకు రావాలి. దేశంలో కాంగ్రెస్, బిజెపి తీవ్రంగా ఘర్షణ పడుతున్నట్టుగా చిత్రీకరించుకుంటున్నాయి. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ బిల్లు, జిఎస్‌టిపై ఏం జరిగిందో చూశాం. ముందో మాట.. ఆ తరువాతో మాట కాంగ్రెస్ మాట్లాడింది. చివరకు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దగ్గరుండి బిల్లును ఆమోదింపజేశారు. ఈ రెండు పార్టీల సరళీకృత ఆర్థిక విధానాలు ఒక్కటే. ఇందులో వైసిపి నేత జగన్‌కు కూడా తేడా లేదు. ప్రత్యేక హోదా ఇస్తే.. బిజెపి మంచిదే అన్నట్టుగా మాట్లాడుతున్నారు. ప్రస్తుతం బిజెపి పాలనలో లౌకికవాదం ప్రమాదంలో పడింది. మతోన్మాదం ప్రబలింది. అందుకే బిజెపిని ఓడించాలని చెబుతున్నాం. అదే రకమైన ఆర్థిక విధానాలను అమలుచేసే కాంగ్రెస్‌తో ఎటువంటి పొత్తు, అవగాహన లేకుండా దేశ ప్రజల దీర్ఘకాలిక భవిష్యత్ కోసం ప్రత్యామ్నాయ రాజకీయాల్ని నిర్మిస్తాం. ప్రత్యామ్నాయ నిర్మాణం ఏర్పాటు కాగానే పాలక పార్టీల్ని ఓడించే శక్తి సామర్థ్యాలు వామపక్షాలకు వెంటనే రావు. కానీ పాలక పార్టీలతో విసిగి వేసారిన పార్టీలన్నీ ఒకే వేదికపైకి వస్తాయి. ప్రత్యామ్నాయ శక్తిగా అవతరిస్తాయి. ఇందులో భాగంగానే తెలంగాణలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పడింది. దేశవ్యాప్తంగా అన్ని సామాజిక శక్తుల్నీ ఒకే వేదికపైకి తెస్తాం. ప్రత్యామ్నాయ రాజకీయ విధానాల్ని నిర్మిస్తాం.

అఖిల భారత మహాసభల ప్రాధాన్యత

బిజెపిని ఓడించడంలో భాగంగా ఆ పార్టీ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఎలా సమీకరించాలన్న అంశంపై ఏప్రిల్‌లో జరిగే 22వ అఖిల భారత మహాసభల్లో చర్చిస్తాం. విశాఖలో జరిగిన 21వ మహాసభల్లో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షిస్తాం. వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల్ని కూడగట్టి, ప్రత్యామ్నాయ విధానాలపై చర్చిస్తాం. తెలంగాణలో ఏర్పాటు చేసిన బిఎల్‌ఎఫ్, తమిళనాడులో గతంలో ఏర్పాటు చేసిన 'పీపుల్స్ వెల్ఫేర్ ఫ్రంట్'పై కూడా చర్చిస్తాం. ఎన్నికల తర్వాత గత మహాసభలు జరిగాయి. బిజెపి నియంతృత్వాన్ని గుర్తించి, కేరళలో ప్రాణాలు బలిదానం చేసి, తెగించి పోరాడి వారిని అడ్డుకున్నాం. కాంగ్రెస్ దుష్పరిపాలన కారణంగానే బిజెపికి బలం చేకూరింది. బిజెపి దుర్మార్గ మతోన్మాదంపై కాంగ్రెస్ మెతకగా వ్యవహరిస్తోంది. రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించాలి. మతోన్మాదానికి వ్యతిరేకంగా విశాలమైన ఐక్యతతో వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలు సహా, లోక్‌సభ, న్నికల్లోనూ బిజెపిని ఎలా ఓడించాలి, ఆ పార్టీ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఎలా సమీకరించాలి అన్న అంశాలపై మహాసభల్లో చర్చిస్తాం.

బెయిల్ ఇన్ క్లాజ్ సంగతేంటీ

ఎఫ్ఆర్‌డిఎ బిల్లు డిపాజిట్లకు భద్రత లేదు. నష్టం లేదంటున్నారు కానీ, బెయిల్ ఇన్ క్లాజ్ ఎందుకు తీసివేయడం లేదు. ఈ క్లాజ్ ప్రమాదకరమైంది. ప్రయివేటు రంగంలో రక్షణ లేదన్న కారణంగానే ప్రజలు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో డిపాజిట్లు చేసుకున్నారు. ఇప్పుడీ క్లాజ్ కారణంగా డిపాజిట్లకు భద్రత లేకుండా పోతోంది. ఈ బిల్లులో ప్రయివేటీకరణ అంశం అంతర్లీనంగా ఉంది.

తెలంగాణలో బిఎల్‌ఎఫ్

రెండు రాష్ట్రాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులకు కాంగ్రెస్సే కారణం. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకొస్తే మళ్లీ అవే విధానాలు అమలు చేస్తుందనడంలో సందేహం లేదు. ముందస్తుగా సిపిఎం నేతృత్వంలో టీ మాస్ ఏర్పాటయ్యింది. ఆ తరువాత పజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణలో సిపిఎం నేతృత్వంలో సామాజిక శక్తులన్నీ ఒక్కచోటికి చేరి బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్‌ఎఫ్)ను ఏర్పాటు చేసుకున్నాయి. వివిధ సంఘాలు కలిసి వస్తున్నాయి. బిఎల్‌ఎఫ్ మరింత బలోపేతమయ్యే అవకాశాలున్నాయి. ఇక్కడ కోదండరాం పార్టీ పెడుతున్నారు. జనసేన పార్టీ రాజకీయ పర్యటనలు చేస్తోంది. రానున్న రోజుల్లో ఏపిలో కూడా ఇదే విధంగా రాజకీయ వేదిక ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణలో సిపిఐ కలిసి రాకున్నా. ఏపిలో మాత్రం కలిసి వస్తోంది. అయితే ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక నిర్మాణంలో ఏపిలో జరగాల్సిఉంది.

మోసం చేస్తున్న చంద్రబాబు

విభజన చట్టంపై అన్ని అంశాల్ని చేరుస్తూ రాజ్యాంగంలో కాంగ్రెస్ మార్పు తేలేదు. అధికారంలోకొచ్చిన బిజెపి ద్రోహం చేసింది. కేంద్ర మంత్రివర్గంలో భాగస్వామిగా ఉన్న టిడిపి విభజన హామీల అమలుపై ఒత్తిడి తేవడం లేదు. ప్రజల్ని మోసం చేయడానికి ప్రత్యేకహోదా కంటే ప్యాకేజీ మేలని చంద్రబాబు అన్నారు. ఇప్పుడేమో కోర్టుకు వెళ్తానంటూ ప్రసహనంగా నాటకాలాడుతున్నారు. మోసం చేస్తున్నారు. అయితే బిజెపితో ఎలాంటి పొత్తు లేకున్నా. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రం పోరాటం చేయడం లేదు. కేంద్రం తీసుకునే అన్ని నిర్ణయాలకూ ఆయన మద్దతు తెలుపుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులు సహా విభజన హామీలపై మాట వరుసకే అడుగుతున్నారు. కానీ ఒత్తిడి చేయడం లేదు. బిజెపి హిందూ మతోన్మాద మతతత్వవాదంపై కెసిఆర్, చంద్రబాబు మెతకవైఖరి అవలంబిస్తున్నారు. ఈ మతతత్వవాదం వల్ల లబ్ధి కలుగుతోందని అనుకుంటున్నారు. కేంద్రంతో తగాదాకు దిగితే.. తమ లొసుగులు ఎక్కడ బయటపెడతారో అన్న భయం వీరిద్దరిలోనూ ఉంది. ప్రతిపక్షాల్ని బెదిరించడంలో బిజెపికి నైపుణ్యముంది. ప్రతిపక్ష నేతలపై కోర్టుల్ని, పోలీసుల్ని ఉపయోగించుకుంటోంది. తమ రాజకీయ అవసరాల కోసం రాష్ట్రాల ప్రయోజనాల్ని ఇద్దరు సిఎంలూ తాకట్టు పెడుతున్నారు. విభజన జరిగితే ఆశించినట్టుగా రెండు రాష్ట్రాల ప్రజలకు లబ్ధి జరగలేదు. తెలంగాణకు లబ్ధి కలుగుతుందని అనుకున్నారు. కానీ కొంతమంది కుటుంబసభ్యులకు, మరికొందరికి బంధువులకు మాత్రమే లబ్ధి కలిగింది.. ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగేళ్లుగా అమరావతి పేరు చుట్టూనే తిప్పుతున్నారు. ఏమీ చేయలేదు. ఆయన వ్యవహారమంతా పెద్ద ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ తీరుగా ఉందే తప్ప రాజకీయ వ్యవస్థ మాదిరిగా లేదు. పుష్కరాలు, సింగపూర్ అంటూ నడిపించారు. ఆయన చేస్తున్న ఈ కంపెనీ వ్యవహారం కొద్దిరోజులు నడుస్తుంది. వాస్తవమేంటో ప్రజలకు తెలిసి వస్తుంది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు సంగతి అందరికీ తెలిసిపోయింది. వీరి వ్యవహారంపై రెండు రాష్ట్రాల ప్రజలు ఆలోచించాలి. ఈ పాలకుల వల్ల ఏమీ కాదు. అందుకే ప్రత్యామ్నాయ శక్తులు రావాల్సి ఉంది.

త్రిపురలో కష్టమైనా...గెలుస్తాం

త్రిపుర ఎన్నికలు క్లిష్టమైనవి, కష్టమైనవి. అయినా గెలుస్తాం... త్రిపురలో గతంలో కాంగ్రెస్ పోషించిన పాత్ర ఇప్పుడు బిజెపి పోషిస్తోంది. ఒకరకంగా చెప్పాలంటే కాంగ్రెస్ నేతలందరూ బిజెపిలో చేరిపోయారు. దీంతో కాంగ్రెస్ కాస్తా ఇప్పుడు బిజెపిగా మారిపోయింది. సిపిఎంను ఓడించడానికి ఉగ్రవాదుల్ని బిజెపి రెచ్చగొడుతోంది. మతోన్మాద ఎజెండాతో సంఘ్ పరివార్ శక్తుల్ని మోహరిస్తోంది. గిరిజనులు, బెంగాలీల మధ్య వైషమ్యాల్ని పెంచుతోంది. బిజెపి ఎంత చేసినా.. వామపక్షాల వెంటే ప్రజలున్నారు.

పవన్ ప్రజల కోసమేనా..?

పవన్ రాజకీయాల్లోకి రావడం సంతోషమే కానీ, వచ్చింది ప్రజల కోసమా..? పదవుల కోసమా..? స్పష్టం చేయాలి. సినిమాలు ఆడక కెరియర్ లేక.. రాజకీయాల్లో కెరియర్ కోసం వస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయన ప్రజల కోసమే రాజకీయాల్లోకి వస్తున్నట్టయితే విధానపరంగా ముందుకు రావాలి. అయితే జనసేనకు రాజకీయ విధానమే లేదు. పవన్ వైఖరిలో అస్పష్టత కన్పిస్తోంది. కెసిఆర్, చంద్రబాబు అవలంబిస్తున్న ప్రమాదకర ఆర్థిక విధానాలు, లౌకికవాదం, ఎఫ్ఆర్‌డిఎ, రైల్వేబడ్జెట్ విలీనం, అమెరికాతో మోడీ మైత్రి అంశాలపై స్పష్టమైన వైఖరి లేదు. సినిమా గ్లామర్ ఉంది కదా.? అని తెలంగాణ, ఏపి రాష్ట్ర ప్రభుత్వాల్ని రక్షించడానికే పవన్ కల్యాణ్ యాత్ర చేస్తున్నట్టు విమర్శలొస్తున్నాయి. ప్రభుత్వాలపై ప్రజల్లో అసంతృప్తి ఉంటే పవన్ ఎన్ని పర్యటనలు చేసినా ప్రయోజనం ఉండదు.

దావోస్ అంతర్జాతీయ సంత

దావోస్ అనేది అంతర్జాతీయ సంత. గ్రామాల్లోని సంతల కంటే పెద్ద సంత. దావోస్‌లో జరుగుతున్న 'ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు' కారణంగా పెట్టుబడులు వచ్చే ప్రసక్తే లేదు. ఈసారి సమావేశాలకు వారసులుగా ప్రచారంలో ఉన్న లోకేశ్, కెటిఆర్ వెళ్లారు. వీళ్లందరూ సంచులతో పెట్టుబడులు తెస్తామని చెబుతున్నారు. ఈ సమావేశాల్లో పాల్గొనాలంటే టికెట్లు తీసుకొని వెళ్లాల్సిందే. వెళ్లిన వారందరూ సేల్స్‌మెన్‌గా తమ తమ దేశాల్లోని పెట్టుబడులకు ఉన్న అవకాశాల్ని వివరిస్తారు. వారు చెబుతున్న సంస్కరణలు అమలు చేయకుండా వీరు ఎంతమొత్తుకున్నాపెట్టుబడులు రావు. ప్రయివేటు మార్కెట్ ఉన్న చోటనే లాభం ఉంటుందని, అప్పుడే పెట్టుబడులు పెడతామని కంపెనీలు చెబుతాయి. ప్రయివేటీకరణ జరిగితే ప్రజలు బలిపశువులవుతారు.

పురోగమిస్తున్న స్మార్ట్ కంప్యూటింగ్

చివరిరోజు సదస్సులో ప్రొఫెసర్ డాక్టర్ రాజ్‌కుమార్

ప్రజాశక్తి - పెనమలూరు (విజయవాడ)

స్మార్ట్ కంప్యూటింగ్ త్వరితగతిన పురోగమిస్తుందని, ప్రతి రంగంలోనూ దీని అప్లికేషన్లు ఉన్నాయని విఐటి వెల్లూరు కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డా.రాజ్‌కుమార్ తెలిపారు. పివి సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సిఎస్‌ఇ, ఐటి విభాగాల ఆధ్వర్యంలో "స్మార్ట్ కంప్యూటింగ్ అండ్ ఇన్‌ఫర్మాటిక్స్" రెండురోజుల అంతర్జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. చివరిరోజు సదస్సులో ఆయన ప్రసంగిస్తూ ప్రతి ప్రశ్నకు ఎన్నో సమాధానాలు దొరుకుతాయని, అయితే ఆ సమాధానాలన్నింటిలో తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో, తక్కువ శ్రమతో, త్వరగా అందరికీ అర్థమయ్యేలా ఉన్న సమాధానాలు వెలికి తీయడమే ఈ సదస్సు ఆవశ్యకత అని తెలిపారు. సదస్సులో మూడు సెషన్స్ జరగ్గా దేశ విదేశాల నుండి వచ్చిన పత్రాలలో 138 పేపర్స్ సెలెక్ట్ చేయబడ్డాయని, పార్టిసిపెంట్స్ పేపర్ ప్రెజంటేషన్ ఇచ్చారని సిఎస్‌ఇ విభాగాధిపతి డా.సురేష్ చంద్ర శతపతి, ఐటి విభాగాధిపతి డా బివి సుబ్బారావు తెలిపారు. ఈ రెండురోజుల సదస్సులో జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుండి పేరుగడించిన మేధావులు, కళాశాల కన్వీనర్ బోయపాటి శ్రీరాములు, ప్రిన్సిపల్ కె.శివాజి బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజయవాడలో మాట్లాడుతున్న విఐటి వెల్లూరు కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డా.రాజ్ కుమార్

చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

బైక్-లారీ ఢీకొని ముగ్గురు మృతి

ప్రజాశక్తి-గుడిపల్లి(చిత్తూరు)

బైక్, లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు, ఈ సంఘటన చిత్తూరు జిల్లా గుడిపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన చంద్రప్ప, నారాయణమ్మల కుమారుడు రాజ్‌కుమార్ పెళ్లిచూపుల నిమిత్తం తనతో పాటు తల్లి నారాయణమ్మ(40), సోదరి మమత(25) ఆమె కూతురు రెండేళ్ల చిన్నారి యశ్వంతి శాంతిపురం మండలం నడింపల్లికి బైక్‌పై వెళ్తున్నారు. సి.బండపల్లి గ్రామ సమీపానికి రాగానే రత్నమిల్లర్ క్వారీకి చెందిన లారీ వేగంగా వచ్చి బైక్‌ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. వాహనాన్ని నడుపుతున్న రాజ్‌కుమార్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదానికి రత్నామిల్లర్స్ వారే కారణమని తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు క్వారీపై దాడి చేశారు. షెడ్డుకు నిప్పంటించారు. విషయం తెలుసుకున్న శాంతిపురం, గుడిపల్లి పోలీసులు అప్రమత్తమై అగ్నిమాపక శాఖ సిబ్బంది సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులకు గ్రామస్తులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. బాధితులకు న్యాయం చేసేవరకూ మృతదేహాలను రోడ్డుపై నుండి తియ్యబోమని బైఠాయించారు. కుప్పం సిఐ రాజశేఖర్, గుడిపల్లి మండల ఎస్ఐ నెల్లిభాస్కర్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో అక్కడి నుండి మృతదేహాలను 108లో కుప్పం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మృతుల బంధువులు, గ్రామస్తులు క్వారీ పనులు వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబానికి రూ.35 లక్షల ఆర్థికసాయం అందిస్తామని క్వారీ యాజమాన్యం చెప్పడంతో గ్రామస్తులు, బంధువులు ఆందోళనను విరమించారు. అనంతరం మృతదేహాలను తమ స్వగ్రామానికి తీసుకెళ్లారు. శాంతిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేకం

మాండలీకాలను రక్షించాలి..

ప్రమాణభాషను రూపొందించాలి..

తెలుగు సాహిత్య మహోత్సవాల్లో వక్తలు

ప్రజాశక్తి-తెనాలిటౌన్ (గుంటూరు జిల్లా)

పదాలు, సమాసాలు, వాక్యనిర్మాణం మాండలీకాల అస్థిత్వాన్ని సూచిస్తాయని ప్రముఖ రచయిత, ఎస్‌వి యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ కొలకలూరి ఇనాక్ చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం బొల్లిముంత శివరామకృష్ణ ప్రాంగణంలో 26వ తేదీ నుండి నిర్వహిస్తున్న తెలుగు సాహిత్య మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు 'భాషా వికాసం-మాండలీకాలు' అంశంపై జరిగిన సభకు అధ్యక్షత వహించిన ఇనాక్ మాట్లాడుతూ ప్రాంతాల వారీగా వాడుక భాష, భాషలో యాస, భావాలు అనేక రకాలుగా ఉన్నాయని చెప్పారు. మనుషుల జీవన ప్రమాణాలు, వారి స్థితిగతుల ఆధారంగా వారి మధ్య పరస్పర చర్చల్లో ఉపయోగించే భాషా ప్రయోగమే మాండలీకాలన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న మాట్లాడుతూ వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో 800 ఏళ్లు ప్రాచీన భాష, 200 ఏళ్లు ఆధునిక భాషా సాహిత్యం ఉందన్నారు. భాష ఆధునీకరణ కోసం ఉపయోగించే పద ప్రయోగ మే మాండలీకమన్నారు. అవధాని ఆముదాల మురళి మాట్లాడుతూ పామరుడు అంగికరించేదే ప్రామాణిక భాషగా పేర్కొంటూ తెలుగు భాషలో ఆంగ్లం అధికశాతం మిళితమై తెలుగే మరుగునపడే ప్రమాదం ఉందన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన రచయిత్రి సమ్మెట ఉమాదేవి మాట్లాడుతూ మాండలీకాలు భాష కాదని, ఒక ధోరణని చెప్పారు. తెలుగు భాషపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు చిత్తశుద్ధి లేదన్నారు. అనంతరం 'భాషా వికాసం-ప్రసార మాధ్యమాలు' 'సమాజ వికాసం-పౌరబాధ్యత' 'భాషాభివృద్ధిలో ప్రభుత్వం పాత్ర' అంశాలపై సభలు నిర్వహించారు. భాషా వికాసం-ప్రసార మాధ్యమాలు సభకు రచయిత తన్నీరు కల్యాణ్‌కుమార్ సభా పరిచయం చేశారు. ఆకాశవాణి జాబులు-జవాబులు ఫేమ్ ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించారు. సభలో ఎన్టీవీ ఎడిటర్ ఇన్‌పుట్ నేమాని భాస్కర్ మాట్లాడారు.



అతిథులకు జ్ఞాపికలు అందిస్తున్న ఎమ్మెల్యే ఆలపాటి

ప్రపంచానికే దిక్సూచి లూయి బ్రెయిలీ : కూన రవి

శ్రీకాకుళం సిటీ (శ్రీకాకుళం జిల్లా): లూయి బ్రెయిలీ ప్రపంచానికే దిక్సూచి అని ప్రభుత్వ విప్ కూన రవికుమార్ అన్నారు. శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో విజువల్ ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లూయి బ్రెయిలీ 209వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రపంచానికి బ్రెయిలీ లిపిని అందించిన మహానుభావుడు లూయి అని అన్నారు. తద్వారా ఎంతో మంది అంధులు చదువుకునే అవకాశం పొందారన్నారు. అంధుల క్రికెట్లో పాకిస్తాన్‌పై భారత జట్టు విజయాన్ని సాధించిందన్నారు. అందులో ఇద్దరు క్రీడాకారులు జిల్లాకు చెందిన వారు ఉండడం జిల్లాకే గర్వకారణమన్నారు.

గూడ్స్‌రైలు బోగిలో పొగలు

తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

ఒడిశా రాష్ట్రం కటక్ నుంచి చెన్నై వెళుతున్న గూడ్స్ రైల్లో ఆదివారం రాత్రి కృష్ణా కెనాల్ జంక్షన్(తాడేపల్లి) సమీపంలో వెనుక నుంచి ఏడో బోగిలో పొగలు వచ్చాయి. దీన్ని కృష్ణా కెనాల్ జంక్షన్‌లోని స్టేషన్ మాస్టర్ గమనించారు. అప్పటికే గూడ్స్ రైలు స్టేషన్ దాటి వెళ్లిపోయింది. వెంటనే స్టేషన్ అధికారి పెదవడ్లపూడిలోని స్టేషన్‌మాస్టర్ రాజకుమార్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే గూడ్స్ రైలును లూప్‌లైన్‌లో నిలిపి మంగళగిరి అగ్నిమాపక శాఖ అధికారు లకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్క డకు చేరుకుని పొగలను అదుపులోకి తెచ్చారు. ఈ సంద ర్భంగా చెన్నై, విజయవాడ మధ్య రైళ్లు రెండు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. రైల్వే పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

సూర్యారాధన



విజయవాడలో జరిగిన సూర్యారాధన కార్యక్రమంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు తదితరులు

ఎపి బ్రాండ్ అంబాసిడర్ సూర్యుడు

సూర్యారాధన సభలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి – విజయవాడ సిటీ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్ సూర్యుడని, జస్టిస్ చక్రవర్తిలాగా ధనికులకు, సామాన్యులకు సూర్యరశ్మిని సమానంగా అందిస్తాడని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. ఆదివారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సూర్యారాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చరిత్రలో మొదటిసారి ప్రభుత్వం తరపున ప్రకృతిని ఆరాధించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. సూర్యారాధన ఒక మతం కాదని, ఒక సైన్స్ అని, కులమతాలకతీతంగా సూర్యారాధనను కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న విధంగానే సూర్యారాధనను రాష్ట్రస్థాయి ఉత్సవంగా చేసేలా ప్రజలను భాగస్వామ్యులను చేస్తున్నామన్నారు. దేశంలో ఏపి ఈస్ట్ కోస్ట్ మధ్యలో ఉందని, సూర్యుడు మొదటిసారిగా ఎపిలో ఉదయిస్తాడని తర్వాతే ఇతర రాష్ట్రాలకు సూర్యోదయం అవుతుందన్నారు. సూర్యరశ్మితో బ్రెస్ట్ క్యాన్సర్ బ్యాక్టీరియాలు నశించిపోతాయని శాస్త్రజ్ఞులు నిరూపించారన్నారు. సూర్యకిరణాల ద్వారా కొలెస్ట్రాల్ తగ్గడం, బిపి కంట్రోల్‌లో ఉంచడం, డి విటమిన్ లభిస్తుందన్నారు. రోజూ ఉదయం అరగంట పాటు సూర్యరశ్మి పడేలా ఉంటే రోగాలబారిన పడకుండా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపి కేశినేని నాని, శాసన మండలి విప్ బుద్దా వెంకన్న, ఎమ్మెల్సీ రామకృష్ణ, ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, బోడే ప్రసాద్, గద్దె రామమోహనరావు, కలెక్టర్ లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.



కోస్తాలో పొగమంచు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

కోస్తాలోని కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల్లో అక్కడక్కడా ఆదివారం పొగమంచు కురిసిందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంపైకి తూర్పు, ఈశాన్య దిశ నుంచి గాలులు వీస్తున్నాయని తెలిపింది. దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో భూమధ్య రేఖా ప్రాంతానికి ఆనుకుని అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు మలయ్ ద్వీపంపై అండమాన్‌కు దగ్గర 1.5 నుంచి 3.1 కి.మీ ఎత్తులో ఆవర్తనం నెలకొందని తెలిపింది. కోస్తా, సీమల్లో మూడు రోజులు సాధారణ వాతావరణ పరిస్థితులు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.

ప్రజ్ఞ

1. ప్రపంచ ఆర్థిక సమాఖ్య నివేదికలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ స్థానం?
2. నడిచే చేపలను పరిశోధకులు ఎక్కడ గుర్తించారు?
3. 2018లో భారత ఆర్థిక వృద్ధి ఎంతగా వుంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది?
4. భారత బ్యాంకుల సమాఖ్యకు చైర్మన్‌గా ఎన్నికైన తొలి మహిళ?
5. ఆస్ట్రేలియా ఓపెన్ 2018 మహిళ సింగిల్స్ విజేత?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.com
కు పంపవచ్చు.

డబ్బుకోసం రాజకీయాల్లోకి రాలేదు

- అనంత కరువుపై పోరాటం
- అడపడుచులకు అండగా ఉంటా
- రెండవ రోజు పర్యటనలో పవన్‌కళ్యాణ్
- చర్చనీయాంశమైన పరిటాల సునీతతో భేటీ



సాగునీటి సమస్యలపై మంత్రి సునీత నివాసంలో చర్చస్తున్న పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి – అనంతపురం ప్రతినిధి/నల్లమాడ

డబ్బు కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని, ప్రజల సమస్యల పరిష్కారం కోసమే తాను ఈ దారిని ఎంచుకున్నానని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో రెండవ రోజు పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన కదిరి, పుట్టపర్తి మండలాల్లో పర్యటించారు. ఉదయం అనంతపురంలో మంత్రి పరిటాల సునీతను ఆమె నివాసంలో ప్రత్యేకంగా కలిశారు. జిల్లాలో సాగునీటి సమస్యలు వాటి పరిష్కారాలపై చర్చించారు. అనంతరం అక్కడి నుంచి కదిరికి బయల్దేరారు.

మహిళా రైతులతో ఇష్టాగోష్టి

కదిరి పట్టణంలోని తాయిగ్రాండ్‌లో మహిళా రైతులతో ఇష్టాగోష్టిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ మహిళలంటే తనకు ప్రత్యేక అభిమానం అన్నారు. వారికి అండగా ఉంటానని చెప్పారు. అనంతపురం జిల్లాలో నిరక్షరాశ్యత ఉందని, అందుకే మహిళల రవాణా అధికంగా ఉందన్నారు. రాష్ట్రంలో అనంతపురం, శ్రీకాకుళం జిల్లాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయంలో దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతుకు గిట్టుబాటు ధర అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతను కరువు నుంచి కాపాడేందుకు ఆర్డీటీ, సత్యసాయి వంటి సంస్థలు ఎంతో కృషి చేశాయన్నారు.

మంత్రి పరిటాల సునీత ఇంటికి పవన్

కదిరి పర్యటనకు బయల్దేరే ముందుగా పవన్ కళ్యాణ్ రాష్ట్ర స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లాలో సాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రితో పాటు ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వం చేపట్టిన, చేపట్టబోతున్న సాగునీటి ప్రాజెక్టు పనుల వివరాలను పవన్‌కు వివరించారు. కాగ కొంత కాలంగా పరిటాల కుటుంబంపై విమర్శలు చేసిన పవన్ కళ్యాణ్ వారి ఇంటికి వెళ్లడంపై అటు టిడిపి, ఇటు జనసేన పార్టీ నాయకుల్లో చర్చనీంశంగా మారింది.

కాన్వాయ్ తగిలి యువకునికి గాయాలు

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పర్యటనలో అపశృతి చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం అనంతపురం జిల్లా కదిరి నుంచి నల్లమాడ మీదుగా పుట్టపర్తికి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. నల్లమాడ మండల కేంద్రంలో భారీగా జనాలు రావడంతో స్వల్ప తొక్కిసలాట జరిగింది. ఈ సమయంలో బుక్కపట్నంకు చెందిన మహేష్ అనే యువకుడు కింద పడ్డాడు. పవన్ కాన్వాయ్ ఆ యువకుని కాలుమీద వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని పవన్ వాహనంలో పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఫిరాయింపు దారులను క్షమించం

- పేద విద్యార్థుల చదువు కోసం అన్నీ విధాలుగా సహకరిస్తా :జగన్
- చంద్రబాబు అవినీతి పాలన సాగిస్తున్నారు



గూడూరులో మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి- గూడూరు

పదవుల కోసం పార్టీలు మారేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించేదిలేదని వైసిపి అధినేత, ప్రతిపక్ష నాయకుడు జగన్ అన్నారు. జగన్ పాదయాత్ర ఆదివారం శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా గూడూరుకు చేరుకుంది. గూడూరు మండలం తిమ్మసముద్రం క్రాస్‌రోడ్డు నుంచి ఉదయం 8.45 గంటలకు పాదయాత్ర ప్రారంభమైంది. కొండాగుంట మీదుగా పాలిచెర్ల చేరుకున్నారు. అక్కడ వైసిపి పతాకాన్ని ఆవిష్కరించారు. అక్కడి నుంచి గాంధీనగర్ చేరుకుని మధ్యాహ్నం రెండు గంటల వరకు భోజన విరామం తీసుకున్నారు. భోజన విరామం తర్వాత బయలుదేరిన పాదయాత్ర పట్టణంలోని ఇందిరానగర్, మాళవ్యనగర్ మీదుగా కోర్టు సెంటరుకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన సభలో జగన్ మాట్లాడారు. వైఎస్ హయాంలో గూడూరు పట్టణానికి తాగునీటి ఎద్దడి నివారణకు కండలేరు నుంచి పైప్‌లైన్ వేశారని తెలిపారు. అది మరమ్మతులకు గురైతే పట్టించుకునే తీరిక ఈ ప్రభుత్వానికి లేకుండా పోయిందని విమర్శించారు. నిమ్మరైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తాను సిఎం అయితే పేద విద్యార్థుల చదువు కోసం అన్నీ విధాలుగా సహకరిస్తామన్నారు. వారు ఎంత వరకు చదివినా ఖర్చంతా ప్రభుత్వమే భరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మెస్ చార్జీల కింద ఏటా రూ.20వేలు చెల్లిస్తామని తెలిపారు. ప్రతి బిడ్డకు ఏటా రూ.15వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. అవినీతి పాలన సాగిస్తున్నారన్నారు. ఎంఎల్ఎలను కొనుగోలు చేస్తున్నారన్నారు. పార్టీ ఫిరాయించిన ఎంఎల్ఎలకు మంత్రి పదవులు ఇవ్వడం ఎంతవరకు సమంజ సమన్నారు. ఆడియో, వీడియోల్లో దొరికినా ఏమాత్రమూ లెక్క చేయడం లేదని విమర్శించారు. వచ్చేది వైసిపి ప్రభుత్వమేనన్నారు. భవిష్యత్తులో మౌలిక వసతుల కల్పన, ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తామని చెప్పారు. అనంతరం జగన్ కోర్టు సెంటరు నుంచి నిమ్మకాయల మార్కెట్ సెంటరులో రాత్రి బస చేశారు. కార్యక్రమంలో ఎంపిలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, నాయకులు నల్లపురెడ్డి వినోద్‌రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, బత్తిన విజయకుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాసిన నాగులు, మేరిగ మురళీ, వైసిపి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైసిపిలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేరిక

ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. సుమారు 150 వాహనాల్లో తన అనుచరులతో కలిసి వచ్చి కాంగ్ర వద్ద జగన్‌ను కలిసి పార్టీలో చేరినట్లు ప్రకటించారు. ఆయన గతంలో వైసిపిలోనే ఉన్నారు. తర్వాత కొంతకాలం పార్టీకి దూరంగా ఉంటూ తెలుగుదేశంతో సఖ్యతగా ఉంటూ వచ్చారు. ఒకవిధంగా తటస్థంగా ఉంటూ తాజాగా మళ్లీ వైసిపిలోనే చేరారు. కాంగ్ర నుంచి పాదయాత్రలో జగన్‌తో కలిసి నడిచారు. మాళవ్య నగర్‌లో మాజీ చైర్‌పర్సన్ కోడూరు కల్పలత, మీరారెడ్డి, చేగువేరా ఫౌండేషన్ నిర్వాహకులు సురేష్ వైసిపిలో చేరారు.

విజయవాడలో భూకుంభకోణం

- ఎమ్మెల్యే బోండా సతీమణి సుజాతపై కేసు
- స్వాతంత్ర్య సమరయోధుని భూమి కబ్జా
- సిఐడి కేసు నమోదు

ప్రజాశక్తి – విజయవాడ సిటీ ప్రతినిధి

అధికార తెలుగదేశం పార్టీ నాయకుల మరో అక్రమపర్వం వెలుగులోకొచ్చింది. విజయవాడలో భారీ భూకుంభకోణానికి సంబంధించి టిడిపి ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సతీమణి బోండా సుజాతపై కేసు నమోదైంది. నగరంలోని బుడమేరు వాగుకు సమీపంలో స్వాతంత్ర్య సమరయోధుడు సూర్యనారాయణకు ఐదెకరాల భూమిని ప్రభుత్వం దశాబ్దాల క్రితం కేటాయించింది. ఆ విలువైన భూమిపై సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహే శ్వరరావు అనుచరుల కన్నుపడింది. ఇదే అదనుగా ఎమ్మెల్యే అనుచరులు తప్పుడు రికార్డులు సృష్టించి రామిరెడ్డి కోటేశ్వరరావు నుంచి 8 మంది భూమిని కొనుగోలు చేసినట్లు రికార్డులు సృష్టిం చారు. ఈ విషయం తెలుసుకున్న స్వాతంత్ర్య సమరయోధుని వారసులు కె.సురేష్‌బాబు 23.10.17న సిఐడి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీన్ని విచారించిన సిఐడి అధికారులు ఎఫ్ఐఆర్ నెంబరు 7/2017 కింద విజయవాడ భ్రమరాంబపురానికి చెందిన అబ్దుల్ మస్తాన్, కృష్ణలంక భ్రమరాంబపురానికి చెందిన రామిరెడ్డి కోటేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా కొంగోడు గ్రామానికి చెందిన తిరుమలరాజు వీర వెంకటసత్యనారాయణ వర్మ, హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన గుంటుపల్లి అశ్వర్ధ రామారావు, నున్నకు చెందిన ఏర్వకారెడ్డి సర్దిన్‌రెడ్డి, సత్యనారాయణపురం రామయ్య పంతుల వీధికి చెందిన ఓలేటి సీతా మహలక్ష్మీ, విజయవాడ సాయిరూప ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండి మాగంటి బాబుతో పాటు సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సతీమణి బోండా సుజాతపై కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే బోండా ఉమా ఏమంటున్నారంటే...

అబ్దుల్ మస్తాన్ వద్ద నుండి రవితేజ బయోటెక్ కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న తన భార్య సుజాత పేరు మీద డెవలపర్స్ కింద భూమిని తీసుకున్నామన్నారు. ఏప్రిల్ 12న అగ్రిమెంట్ చేయించుకున్నామని, సురేష్‌కుమార్, మస్తాన్‌ల మధ్య వివాదం నడుస్తున్న సంగతి తెలియగానే 4.12.2017న అగ్రిమెంట్‌ను రద్దు చేసుకుని పత్రాలను సిఐడి డిజికి ఇచ్చామని, ఈ వివాదంతో తనకు ఎటువంటి సంబంధమూ లేదని అన్నారు.

ప్రాణహాని : కోటేశ్వరరావు

తాను గతంలో అప్పు కోసం కార్పొరేటర్ మహేష్ వద్దకు వెళ్లగా తన ఇంటి కాగితాలు తీసుకుని పలు పేపర్లపై సంతకాలు చేయించుకున్నాడని కోటేశ్వరరావు తెలిపారు. తనకు ఎటువంటి భూమీ లేదని, ఇది ఎలా జరిగిందో తనకు తెలియదన్నారు.

పోలియో రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని పోలియో రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి ఏడాదీ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రంలో చిన్నారులకు సిఎం పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల్ని వేయించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని పోలియో రహిత రాష్ట్రంగా చేయడంతో పాటు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా తీసుకెళ్లాలంటే రేపటి భవిష్యత్తుకు ఈ చిన్నారులే దిక్సూచిలా నిలుస్తారన్నారు.

రాజధాని పనుల నాణ్యతలో రాజీపడం

సిఆర్‌డిఎ కమిషనర్ శ్రీధర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో చేపట్టే ప్రభుత్వ అధికారిక నివాస సముదాయాల పనుల నాణ్యతలో రాజీపడే ప్రశక్తేలేదని సిఆర్‌డిఎ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నివాస సముదాయాల పనుల్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. రాయపూడి సమీపంలో ప్యాకేజీ 1లో చేపట్టిన ఎమ్మెల్యేలు, ఆల్ ఇండియా సర్వీసు అధికారులకు 12 ఫ్లోర్లతో 18 టవర్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీటిలో ఎమ్మెల్యేలకు 12 టవర్లలో 288 ఫ్లాట్లు, ఐఎఎస్ అధికారులకు ఆరు టవర్లలో 144 ఫ్లాట్లు చొప్పున మొత్తం 432 ఫ్లాట్లు నిర్మించాలన్నారు. నేలపాడు సమీపంలో నిర్మిస్తున్న ప్యాకేజీ 2లో ఎల్ అండ్ టి చేపట్టిన ఎన్జీవోల నివాస సముదాయాలకు ఒక్కో క్లస్టర్‌లో రెండు టవర్లు చొప్పున 12 ఫ్లోర్లతో 22 టవర్లు, 1968 ఫ్లాట్లు నిరిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత ప్యాకేజీ డిజైన్లను పరిశీలించి ప్రణాళికా బద్ధంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

లౌకిక తత్వానికి తూట్లు

సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంప్రదాయాల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లౌకిక తత్వానికి తూట్లు పొడుస్తున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్, అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. దేవాలయాల్లో, పాఠశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో సూర్య ఆరాధనను ప్రభుత్వమే నిర్వహించడం, వాటిలో కలెక్టర్లు, ప్రభుత్వ అధికారులు పాల్గొనడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. ఇటువంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యల్ని సిఐటియు ఖండిస్తోందన్నారు. మత ఆచారాలు వ్యక్తిగతమని, ప్రభుత్వమే వాటిని నిర్వహిం చడం రాజ్యాంగ ఉల్లంఘనేనన్నారు. పేద, కార్మిక వ్యతిరేక విధానాల్ని బిజెపి, టిడిపి ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. ఒక పద్ధతి ప్రకారమే మూఢనమ్మకాల్ని ప్రజలపై రుద్దుతున్నాయని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాల్ని అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎత్తుగడల్ని కార్మికులు గమనించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాల వల్ల ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసిందని తెలిపారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా ప్రజల్ని పక్కదారి పట్టించే చర్యల్ని మానుకోవాలని వారు హితవు పలికారు.

త్రిపుర సిపిఎం ఎన్నికల ప్రచారానికి మున్సిపల్ కార్మికుల విరాళం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

త్రిపురలో ఫిబ్రవరి 18న జరుగనున్న శాసనసభ ఎన్నికలకు సిపిఎం ఎన్నికల ప్రచార నిర్వహణ ఖర్చుల నిమిత్తం విరాళాలు సేకరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపునకు స్పందిస్తూ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూ. 5,780లు సేకరించినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ రంగంలోని కార్యకర్తల రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతుల్లో పాల్గొన్న ప్రతినిధులు సిపిఎం కమిటీ పిలుపునకు స్పందించి విరాళాలు అందజేశారన్నారు. గిరిజన, కార్మిక, ఇతర పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పాటుపడుతున్న సిపిఎం పార్టీ త్రిపురలో మరోసారి విజయం సాధించాలని మున్సిపల్ కార్మికులు ఆకాంక్షించారన్నారు. సేకరించిన విరాళాల్ని సిపిఎం రాష్ట్ర కమిటీకి అందజేసినట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సామ్రాజ్యం, కె ఉమామహేశ్వరరావు తెలిపారు. విరాళాలు అందజేసిన సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు వారిని అభినందించారు.

ప్రత్యేకం

'రీలింగు'పై రోకటి పోటు

- పట్టుదారం ఉత్పత్తిపైనా పన్ను
- ఆందోళన బాటలో యూనిట్ యజమానులు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

'గోరుచుట్టుపై రోకటిపోటు' అన్న చందాన తయారయింది రీలింగు యూనిట్ల పరిస్థితి. ఓ వైపు అవసరమైన మేరకు పట్టుగూళ్లు లేకపోవడం. మరో వైపు రోజురోజుకు ధరలు పెరుగుతుండగా, ఇటీవల 18 శాతం పన్నుపోటు వేయడంతో సిల్కు రీలింగు యూనిట్లు సంక్షోభంలో కూరుకుపోయే పరిస్థితులు నెలకొన్నాయని యూనిట్ల యజ మాను లు వాపోతు న్నారు. ఇప్పటివరకూ ఈ యూనిట్లు పన్ను పరిధిలో లేవు. పన్నుభారం నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని రీలింగు యూ నిట్ల యజమానులు ఆందోళనబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

మలబారీ సాగుద్వారా వచ్చిన పట్టుగూళ్ల దారాన్ని తయారు చేసే పరిశ్రమలను రీలింగు యూనిట్లు అంటారు. ఈ రీలింగు యూనిట్లు అనంతపురం జిల్లాలో సుమారు 150 వరకు ఉన్నాయి. అందులోనూ హిందూపురం పట్టణం లోనే 90 వరకు ఉన్నాయి. హిందూపురంలోని పట్టుగూళ్ల విక్రయ కేంద్రంలో రైతులు తెచ్చిన పట్టుగూళ్లను వారు కొని రీలింగు చేపడుతారు. ఈ మార్కెట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి రైతులు పట్టుగూళ్లను తెచ్చి అమ్ముతుంటారు. మూడేళ్లుగా వర్షాభావ పరిస్థితుల కారణంగా వీటి ఉత్పత్తి బాగా తగ్గిపోయింది. ఫలితంగా పట్టుగూళ్ల ధరలు ప్రస్తుతం గరిష్ట స్థాయికి కిలో రూ.575 నుంచి రూ.600లకు చేరాయి. దీనికి తోడు అవసరమైన మేరకు పట్టుగూళ్లు మార్కెట్‌కు రావడం లేదు. హిందూపురం మార్కెట్‌కు సాధారణంగా రోజుకు సగటున 10 మెట్రిక్ టన్నులు పట్టుగూళ్లు వస్తే ఇక్కడున్న రీలింగు యూనిట్లన్నింటికీ సరిపోతాయి. ఈ క్రమంలో జనవరిలో రోజుకు సగటున నాలుగు మెట్రిక్ టన్నుల లోపే పట్టుగూళ్లు వస్తున్నాయి. దీంతో రీలింగు యూనిట్‌లో పనిచేసే కార్మికులకు పూర్తి స్థాయి ఉపాధి లభించడం లేదు. ఒకవైపు ధర పెరగడం మరోవైపు అవసరమైన మేరకు పట్టుగూళ్లు లేక రీలింగు యూనిట్లు నష్టాల్లో నడుస్తున్నాయి.

కిలో ఉత్పత్తికి రూ.400 నష్టం...

ఏడు కిలోల నాణ్యమైన పట్టుగూళ్ల ప్రాసె సింగు చేస్తే ఒక కిలో ముడి శిల్కు తయారవు తుంది. దీనికి ఇప్పుడున్న ధరల ప్రకారం చూస్తే ఒక కిలో పట్టుగూళ్లు రూ.600 చొప్పున ఏడు కిలోలకు రూ.4,200 అవుతుంది. దాన్ని ప్రాసెసింగు చేసేందుకు రూ.400 వరకు ఖర్చవుతుంది. అంటే ఒక కిలో ముడి సిల్కు తయారీకి రూ.4,600 వరకు ఖర్చవుతుంది. బహిరంగ మార్కెట్‌లో ముడి సిల్కు ధర కిలో రూ.4 వేల వరకు ఉంది. ఈ సిల్కుపై సెరిఫెడ్ కిలోపై రూ.130 సబ్సిడీ ఇస్తోంది. అంటే ఒక కిలో ముడి సిల్కు ధర సబ్సిడీతో కలిపి రూ.4,130 వరకు వచ్చినా ఇంరా రూ.470 నష్టం వస్తోంది. ఈ నష్టాన్ని తగ్గించేందుకు సబ్సిడీ పెంచా లని రీలర్లు కోరుతున్నారు. రీలర్లు ముడి సిల్కు అమ్మే సమయంలో సెరిఫెడ్ సబ్సిడీ ఇస్తున్నందున రీలర్లు కూడా అమ్మకంపై 0.50 శాతం కమీషన్‌ను ఇప్పటివరకు చెల్లిస్తూ వస్తున్నారు. ఉదాహరణకు ఒక రీలరుకు నెలకు 100 కిలోల ముడి సిల్కును కిలో రూ4,000 చొప్పున అమ్మితే నెలకు రూ.నాలుగు లక్షలు ఖర్చవుతుంది. ఈ మొత్తం విలువపై 0.50 శాతం పన్నును సెరిఫెడ్‌కు చెల్లించాల్సి ఉంటుంది. అంటే రెండు వేల రూపాయలు చెల్లిస్తున్నారు. ఇప్పుడు దీనిపై 18 శాతం అంటే రూ.360 అదనంగా ప్రతి రీలరు చెల్లించాల్సి వస్తుంది.

ఇప్పటికే ఇబ్బందుల్లోనున్నాం...

పెరిగిన పట్టుగూళ్ల ధరలతో ఇప్పటికే ఇబ్బందుల్లోనున్నాం. ఉత్పత్తి లేక ఇప్పటికే తగినన్ని పట్టుగూళ్లు కూడా దొరకడం లేదు. రీలింగు యూనిట్లూ నష్టాల్లో నడుస్తున్నాయి. దీన్ని కాపాడాల్సిందిపోయి ప్రభుత్వం ఇటువంటి అదనపు భారాలు వేయడం మరింత సమస్యగా మారుతోంది. ఇలాగే కొనసాగితే తాము మూసేసుకోవాల్సి వస్తుంది. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్న తమకు ఇటువంటి పన్నులు వేయడం సరైంది కాదు. పన్ను నుంచి మినహాయింపునివ్వాలి.

రజాక్, రీలర్ల సంఘం అధ్యక్షులు హిందూపురం

సంక్షిప్తం

నేడు మార్కెట్లోకి అరకు ఇన్‌స్టంట్ కాఫీ

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

అరకు వ్యాలీ ఇన్‌స్టెంట్ కాఫీని సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్ బాబు సోమవారం సచివాలయంలో విడుదల చేస్తారు. గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ (జిసిసి) ఈ కాఫీని ఉత్పత్తి చేస్తోంది. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అరకు వ్యాలీ కాఫీకి మంచి డిమాండ్ ఉంది. ఇప్పటి వరకు దీనిని 50 గ్రాముల నుంచి 500 గ్రాముల వరకు ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. తాజాగా ఇన్‌స్టెంట్ కాఫీ రూపంలో మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకురానున్నారు.

కస్టమ్స్ సేవా పురస్కారాన్ని అందుకున్న శ్రీనివాస్

విధి నిర్వహణలో ప్రతిభ కనబరచి, కేవలం నాలుగు నెలల కాలంలో 33 స్మగ్లింగ్ కేసుల్ని పట్టుకున్నందుకు గాను కస్టమ్స్ సూపరిండెంట్ నందిపాటి శ్రీనివాస్ కస్టమ్స్ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ ఉప కులపతి ఎ రాజేంద్రప్రసాద్, విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

412 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం(గుంటూరు)

పేదల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. కృష్ణా జిల్లా రెడ్డిగూడెంలో మంత్రి ఉమామహేశ్వరరావు ఆదివారం పర్యటించి 412 మంది పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. రెడ్డిగూడెంలో 18 మందికి, రంగాపురంలో 50, పాతనాగులూరులో 13, ముచ్చెనపల్లిలో 158, అన్నేరావుపేటలో 67, నాగులూరులో 106 మందికి ఇళ్ల పట్టాలను మంత్రి పంపిణీ చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

అక్షరం

4 | విజయవాడ
సోమవారం 29 జనవరి 2018



నేనింత పిడికెడు మట్టే కావొచ్చు..
కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత
పొగరుంది..'
- శేషేంద్ర



అమ్మ పాదాలు

అమ్మ పాదాలు
కదుగుతుంటే నవ్వింది
వాటికి ఎన్ని పగుళ్ళో
మోస్తున్న భారానికి చిహ్నాల్లా
పల్లేరు కాయలు తుమ్మ ముళ్ళు
దారిలో ఇంకా మొనదేలిన రాళ్ళు
ఎన్ని తగిలాయో మరి
ఒక్కనాడూ చెప్పలేదు
ఆ కాళ్ళు తన జీవితాన్ని
ప్రతిబింబిస్తున్నాయి మరి!

తను ససేమిరా అంది
తన పాదసేవ వద్దంది
తనకి మోయటమే తెలుసునంది
తనను దేవత అన్నందుకు
ఏమనుకుందో ఏమో
మళ్ళీ నవ్వింది
తాను ఎప్పటినుండో
క్షమాగుణం చూపిస్తోంది మరి

ఎన్ని తప్పులైనా సహిస్తుంది
కరివేపాకులా తీసేసినా
పరిమళాలు పంచుతుంది
ఎప్పటికీ సువాసనలు
వెదజల్లే పూలవనం అమ్మ మనసు!

తన మమతల పాల చుక్కకి
ఎన్ని నదుల నీళ్ళు సరితూగగలవు
తన ఉమ్మనీటి ముందు
సప్తసముద్రాలు తలవంచుతాయి
ఐనా ఎప్పుడూ ప్రేమ వరదే కాని
జీవితాన్ని ముంచే వాగు ప్రవాహంలా
ఉప్పొంగి ఊపిరులు తీసే సునామీలా
అమ్మ ఎపవిడూ ప్రవర్తించదేఊ

తనకున్న సహనం
పంచభూతాలకు లేదు
విశ్వమంతా ఒకటై
వికటాట్టహాసం చేసినా
నిను చీదరించి పడదోసినా
నిన్ను ఓ ఆపన్న హస్తం
ఆదుకోవటానికి సిద్ధం
అది అమ్మది కాక మరెవరిది?

అదీ అమ్మంటే
పూజలేవీ అవసరం లేని దేవత అమ్మ
దేవుళ్ళకే దేవత అమ్మ!

– జంధ్యాల రఘుబాబు
98497 53298

కవులు పెరుగుతున్నారంటే
మానవత్వం పెరుగుతుందని అర్థం

'జలగీతం' కావ్యకర్త ఎన్.గోపి

సంభాషణ



డాక్టర్ ఎన్.గోపి .. నానికి పర్యాయపదం. అలతి అలతి పదాల్లో నవీన కవితా రీతికి ఆయన మార్గదర్శి. గోపి 'జలగీతం' విశ్వవిఖ్యాతం. అనేక భాషల్లోకి అనువాదితమై ఎందరెందరి ప్రశంసలో పొందిన కావ్యం. ఆయన సాహిత్యరంగంలో అనేక ఎత్తులకు ఎదిగారు. విద్యావేత్తగా అనేక పదవుల్లో రాణించారు. నిత్యం సాహిత్య కార్యకలాపాల్లో నిమగ్నమై ఉంటారు. 'కవిత్వం పెరుగుతోంది. కొత్త గొంతులు అనేకం వినిపిస్తున్నాయి. కవులు పెరుగుతున్నారంటే- మానవత్వం పెరుగుతుందని అర్థం. ఇది ఆనందం కలిగించే పరిణామం.' అంటారాయన. కవి, రచయిత కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ ఆయనతో జరిపిన సంభాషణ ఇది. గోపీ సాహిత్య హృదయాన్ని ఈ ముఖాముఖిలో ఆవిష్కరించారు.

కవిత్వాన్ని 'ఆల్కెమీ'గా చెబుతారు. ఏ విధంగా దానిని అర్థం చేసుకోవాలి?

రసయోగంతో లోహాన్ని బంగారంగా మార్చడమే 'ఆల్కెమీ'. కవిత్వం కూడా రాసే వ్యక్తి సంస్కారం, సామాజిక పరిస్థితులు, అతడు ఆ సమాజాన్ని చూసే దృక్కోణం, వీటి సమగ్రత, ఒక మానవీయ సంవేదనలతో మరీ ముఖ్యంగా కవిత్వం పుట్టే ఆ కాలిక క్షణం – ఇవన్నీ కవిత్వాన్ని 'ఆల్కెమీ'గా చేస్తాయి. ఒకానొక నిష్పత్తి ఆ కవిని అనుగ్రహించాలి.

ఆధునిక కవిత్వంలో ఉండాల్సిన ప్రధాన లక్షణాలు ఏమిటి?

ఏ కవి అయినా తన సమకాలంలోనే జీవిస్తాడు. కాలం– గతం, వర్తమానం, భవిష్యత్తు అని మన సౌకర్యం కోసం పెట్టుకున్నది. ఒక రకంగా చూస్తే అది అఖండమే. కవి కవిత్వంలో 'నోస్టాల్జియా' ఉంటుంది. ప్రతి కవీ దాంట్లోకి వెళ్లివస్తుంటాడు. కానీ అక్కడే నివసించకూడదు. కవిత్వానికి జ్ఞాపకాలు ఎంత ముఖ్యమో ఇవాల్టి భావోద్విగ్న కిరణాలు కూడా అంతే ముఖ్యం. అవి నేటి యువతకి చోదకశక్తిగా ఉంటాయి.

మీరు తొలుత పద్యరచన చేసినా, తరువాత గద్య కవిత్వాన్నే ఎందుకు ఎంచుకున్నారు?

స్కూలు రోజుల్లో విస్తృతంగా పద్యాలు, కవితలు రాశాను. దాశరథి, దువ్వూరి రామిరెడ్డి వంటి కవుల ప్రభావం నా పద్య కవిత్వం మీద ఉండేది. సినారెలా నా కవిత్వం చెక్కేవాడిని. ఒకేరోజులో శశి అనే శతకం రాశాను. హైదరాబాదులో ఒక సందర్భంలో ఆ పద్యాలను విశ్వనాథ సత్యనారాయణ విన్నారు. 'ఇతనికి కవిత్వధార ఉంది' అని మెచ్చుకున్నాడు. వచన కవిత్వాన్ని ఎస్ఎస్ఎల్సి నుంచే సీరియస్ రాయడం ప్రారంభించాను. అప్పుడు 'సృజన' పత్రిక కళాశాల విద్యార్థుల కోసం కవితల పోటీ నిర్వహించింది. ఆ పోటీలో నా 'కత్తి కార్చిన కన్నీరు' కవితకి ప్రత్యేక బహుమతి లభించింది. అప్పుడు (ఫస్ట్ బిఎలో) వరవరరావు స్వయంగా వచ్చి బహుమతి కింద కొన్ని పుస్తకాలు బహుకరించడం ఒక తియ్యని జ్ఞాపకం.

కవి మీద పడే ప్రభావాలు నివార్యమా, అనివార్యమా? వాటిలోని మంచి చెడులు ఏమిటి?

ప్రభావాలు తొలి రోజుల్లో ఎవరి మీదైనా ఉంటాయి. సాహిత్య వ్యక్తిత్వం బలపడుతున్న కొద్దీ ఆ కవికి తొందరలోనే 'సొంత గొంతు' ఏర్పడుతుంది. మనం తినే భోజనాన్ని బట్టి మన ఆరోగ్యం ఉన్నట్టు– మనం చదివే పుస్తకాల వల్ల కూడా సాహిత్య పుష్టి కలుగుతుంది. ప్రభావాల దగ్గరే ఆగిపోతే ఎదుగుదల, గుర్తింపూ ఉండవు. అది కేవలం ఒక స్ఫూర్తి కావాలి. తొలి దీపం కావాలి.

ప్రపంచ సాహిత్యంలో మీరు ఏఏ కవుల రచనలు ఇష్టపడతారు?

చిలీ కవి ఫాబ్లో నెరూడా, ఇంకా షెల్లీ, కీట్స్, బైరన్ ... వీళ్ల మానవుల ఆత్మలను స్పృశించే ప్రయత్నం చేశారు. ఇప్పటికీ ఇంగ్లీషు కవిత్వం పుష్కలంగా చదువుతాను.

'కవిత్వ ఆత్మ' గా దేనిని చెప్పవచ్చు?

ఒక కవిత చదివితే సూర్యుడు ఉదయించినట్లుండాలి. మన అంత రంగా లను అది ఆత్మీయంగా స్పృశించాలి. పాఠకులకి అది నాగురించే అనిపించాలి. నిత్య నైమిత్తిక స్థాయినుంచి మనల్ని పైకి లేపగలగాలి. అంతర్ముఖ – బహిర్ముఖాలకు మధ్య ఎక్కడో ఒక ఉద్రిక్తరేఖ ఉంటుంది. బహుశ: దానిపైనే 'ఆత్మ' పరిభ్రమిస్తుంటుందని నా నమ్మకం. అయితే, ఆత్మని గుర్తించడం పాఠకుని మానసిక స్థితి మీద ఆధారపడి ఉంటుంది.

మంచి కవిత్వాన్ని ఎలా నిర్వచించవచ్చు?

హృదయాన్ని తాకడం తొలి మెట్టు. అదిలోక శ్రేయస్కరంగా ఉండడం మలిమెట్టు. అభివ్యక్తి కూడా కీలకం. నాకు చిన్న చిన్న వాక్యాల్లో కవిత్వం చెప్పడం ఇష్టం. ప్రతి అక్షరంలోనూ కవిత్వం కనిపించాలి. అది అర్థవంతంగా సొగసుగా ఉండాలి. భావపరిమళం వెదజల్లాలి. భాషలో కమనీయత అవసరం. నేను సంస్కృతం చదివాను. కానీ, భాషాడంబరం మీద మోజు లేదు. కష్టమైన మాటల్ని స్పృహతో పరిహరిస్తాను. కవిత్వం మన మనసు, ఆత్మల్లోకి అమృత వాహినిలా ప్రవహిస్తు పరవశింపజేయాలి.

'నానీ'ల సృష్టికర్తగా మీ అనుభవాలు ఏమిటి?

నేనొక సంవేదనాత్మక స్థితిలో నానీలు రాశాను. రాసేటప్పుడు ఇదొక trend setter అవుతుందని నాకు తెలియదు. కొత్త రకమైన కవిత్వం రాస్తున్నానన్న స్పృహ ఉంది. రాస్తున్నప్పుడే ఈ ముక్తకాలకు ఏదో ప్రత్యేక లక్షణం ఉన్నట్లు నాకు అనిపించింది. నానీ నాలుగు పాదాల్లో ఉంటుంది. మొదటి రెండు పాదాలు ఒక యూనిట్. మలి రెండు పాదాలు మరొక యూనిట్. మొదటి యూనిట్లో ఒక స్టేట్మెంట్ ఉంటుంది. రెండో యూనిట్ దానికి కొనసాగింపు/ వ్యాఖ్యానం/ ముక్తాయింపు. 'అబ్బా' అనిపించే ఒక పంచ్లాగా ఉంటుంది. నానీ కవి ప్రజ్ఞ అంతా మలి యూనిట్లోనే ఉంటుంది. అందుకే అంటాను..: 'నానీని నాణ్యంగా రాసి మెప్పించడం అంత సులువు కాదు' అని.

కథాసాహిత్యం మీద మీరు దృష్టి ఎందుకు పెట్టలేదు?

నేను కవిత్వం కంటే కథలే ఎక్కువ చదివేను. 50/ 60 దశకాల్లో నేను చదవని కథా రచయితే లేడు. ఇప్పటికీ చదువుతూనే ఉంటాను. నేను ఎందుకు ఒక కథ రాయకూడదని ప్రయత్నించాను. కానీ, రెండు పేరాలు రాశాక అది వ్యాసంగా మారుతున్నట్టు గమనించాను. 'కథనం' (narration) నా స్వభావంలో లేదనుకుంటాను. తరువాత కథల జోలికి వెళ్లలేదు.

జీవత నేపథ్యానికి, సాహిత్యానికి సంబంధం ఉంటుందా?

తప్పకుండా ఉంటుంది. నేను దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టడం వల్ల నాకు ఆ జీవితమే చక్కటి ఎరువు. రెండు జన్మలకు సరిపడా మానవీయ సంవేదన దాన్లో ఉంది. నా జీవితం నాకు మనుషుల్ని ప్రేమించడం నేర్పింది. ఇప్పుడు సమృద్ధిగా డబ్బులున్నా నా వ్యక్తిత్వం మీద దాని ప్రభావం ఏమీ ఉండదు.

'జలగీతం' కావ్య రచనకు స్ఫూర్తి, ప్రేరణ ఏమిటి?

జలగీతం నా సాహిత్య జీవితంలో గొప్ప మలుపు. నేను నల్గొండ జిల్లాకి చెందినవాడిని. చిన్నప్పటినుంచీ అక్కడి ఫ్లోరైడ్ బాధిత గ్రామాల దుస్థితిని చూస్తున్నవాడిని. మా ఇంట్లో మంచినీళ్ల బావి ఉండేది కాదు. నేను, మా అమ్మ ఎక్కడో దూరంగా నీళ్లను చేదుకుని బిందెల్లో భుజాన మోసుకు వచ్చేవాళ్లం. కాబట్టి, నీటి విలువ నాకు బాగా తెలుసు.

మనిషికి ప్రాణాధారమైన నీటి గురించి నిర్లక్ష్యం చూపుతుంటే– నాలోని కవితాత్మ ఆవేదన చెందింది. మనసంతా జలం మీదనే ఏకీకృతమైంది. ఒకానొక 'ట్రాన్స్' స్థితిలో 'జలగీతం' కావ్యరచన చేశాను. అదలా ఒక ప్రవాహంలా వివిధ గతుల్లో సాగిపోయింది. కొన్ని రచనల్లో కవి ప్రమేయం ఉండదు. భావప్రవాహంలో కవి కొట్టుకుపోతాడు. దానికి తక్షణ అక్షరరూపం కల్పిస్తే ఒక 'జలగీతం' కావ్యం ఆవిర్భవిస్తుంది. భావంతో అక్షరం మమేకమై సమవేగంతో పయనించడం చాలా ముఖ్యం.

అనేక భాషల్లోకి అనువాదమైన 'జలగీతం' మీద ఆయా భాషల వారి స్పందన ఎలా ఉంది?

'జలగీతం' ఇప్పటివరకూ 11 భాషల్లోకి అనువాదమైంది. హిందీ అనువాదం విశాలమైన హిందీ సాహిత్య ప్రపంచంలోకి తీసుకెళ్లింది. అనువాదకురాలు ప్రొఫెసర్ పి.మాణిక్యాంబ గారికి ఢిల్లీ అనువాద సాహిత్య పరిషత్ వారు లక్ష రూపాయలు నగదు పురస్కారం ఇచ్చారు. తెలుగులో నా జలగీతానికి ఎంత పేరుందో గుజరాతీలో అంత ప్రసిద్ధి లభించింది. గుజరాతీ కవి రమణిక్ సోమేశ్వర్కి కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రహ్మాత్ యూసుఫ్జాయ్ ఉర్దూలోకి అనువాదం చేస్తే, దానిని చదివి అజీజ్ ఉద్దీన్ అహ్మద్ ఉస్మానీ– అనే పర్షియన్ కవి, ఢీల్లీ నుంచి ప్రత్యేకంగా నన్ను చూట్టానికి వచ్చాడు. ఆయన దానిని పర్షియన్లోకి అనువదించాడు. ఇంకా మరాఠీ, ఇంగ్లీషు, కన్నడం, మలయాళం, ఒడియా, పంజాబీ, సంస్కృతం, బంజారా భాషల్లో సముచిత గౌరవం పొందింది.

సాహిత్యానికి, కవి జీవితానికి సంబంధం ఉండాలా?

ఉండటం నియమం కాదు. ఉంటే మంచిదే. కవికి వ్యక్తిగతానుభవం ఒక్కటే చాలదు. సామూహిక, భావనాత్మక అనుభవం, అనుభూతి కూడా అవసరం. అన్నింటికంటే కవికి ఎదుటి వారి కష్టసుఖాల్లోకి మానసికంగా చొరబడే తత్వం ఉండాలి. అప్పుడే సామాజిక స్పృహగల కవి కాగలుగుతాడు.

వేమన పరిశోధకుల్లో అగ్రగణ్యులుగా, వేమన గోపిగా ప్రసిద్ధికెక్కారు. మీ పరిశోధనల గురించిన వివరాలు ...?

40 ఏళ్ల క్రితం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వేమన మీద పరిశోధన చేశాను. చేసింది డిగ్రీకోసమే అయినా ఆ వేమనలో లీనమైపోయాను. 1980లో నా సిద్ధాంత వ్యాస గ్రంథం 'ప్రజాకవి వేమన' వెలువడింది. ఆరు పునర్ముద్రణలు పొందింది. అప్పటివరకు ఎవరూ స్పృశించని విషయాలను చర్చించాను. అంతకుముందు 'వేమన వాదం' పేరిట నూటికిపైగా ఎంపిక చేసిన వేమన పద్యాలకు వ్యాఖ్యానం రాశాను. అది కూడా ఎనిమిది ముద్రణలు పొందింది.

వేమన పద్యాలు ప్యారిస్ ప్రతిని ప్యారిస్ నుంచి తెప్పించి సముద్ధరించి, పరిష్కరించి ప్రచురించాను. ఇక్కడ మనకు లభ్యం కాని ఏడు కొత్త పద్యాలను ఆ ప్రతిలో గుర్తించి ప్రచురించాను. వేమన పద్యాలకు వ్యాఖ్యానం రచించి 'సాక్షి'లో మూడేళ్ల పాటు వెలువరించాను.

'నానీ' ప్రక్రియ భవిష్యత్తు ఎలా ఉండొచ్చు?

1997లో నేను ప్రారంభించిన నానీ ప్రక్రియ, అందులోని కవితాశక్తి, నిర్దాణదీప్తిల కారణంగా అందర్నీ ఆకట్టుకుని ఉంటాయి. అందులో నేను ప్రతిపాదించిన వెసులుబాటు, దానిలోని కవిత్వం దెబ్బ తినకుండా కాపాడింది. దానిలోని అక్షర సంఖ్య అతివ్యాప్తి, అవ్యాప్తి లేకుండా ఒక క్రమశిక్షణను ఏర్పరచింది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 300 పైగా నానీ సంపుటాలు వెలువడ్డాయి. వెయ్యిమంది కవులు పత్రికల్లో నానీలు రాస్తూనే ఉన్నారు. ఈ ప్రక్రియ ఇంతమందిని ఆకర్షించడానికి కారణం అదిప్పటి కాలానికి సరిపోవటమే!

నేడు ఆధునిక కవితా ధోరణులు ఎలా ఉంటున్నాయి? కొత్త కవులకు మీ సూచలేమిటి?

నేడు కవులు విస్తృతంగా రాస్తున్నారు. అది చాలా ఆనందించతగ్గ విషయం. కవుల సంఖ్య పెరుగుతోందంటే మానవత్వం గురించి ఆలోచించే సంఖ్య పెరుగుతుందని అర్థం. అయితే ఇప్పటి యువత అధ్యయనం పట్ల చాలా శ్రద్ధ చూపాలి. ఈ కాలం యువత చాలా తెలివైనవారు. చురుకుదనం గలవారు. మన భుజాలపై నిలబడి ఎక్కువ దూరం చూడగలవారు. కొత్తకొత్త భావ చిత్రాలను పొదిగే నైపుణ్యం గలవారు. కానీ, భావావేశం లేకుండా కవిత్వంలోకి దిగేవారు అక్కడక్కడా కన్పిస్తారు. (ఇక్కడ గోపీ ఒక కవిత ఆశువుగా చెప్పారు) 'నేను తయారై ఉన్నానంతే/ వ్యక్తి స్వార్థాల నుంచి విముక్తమై/ కాలిన పెంక (పెనం) లాగా వేడెక్కి ఉన్నాను / దీనిమీద ఆక్రోశాలు చిలకరించినా/ అలజడులు ప్రవహించినా/ అది కవిత్వం కాకతప్పదు' .. ఇలాంటి భావోద్వేగం కవికి అవసరం.

(నేడు హైదరాబాదులో డాక్టర్ ఎన్ గోపికి జలగీతం కావ్యానికి గానూ లక్ష్మీనారాయణ జైనీ జాతీయ పురస్కార ప్రదానం జరుగుతుంది.)

(సంభాషణ కర్త మొబైల్ నెం : 98495 68901)

దేశాన్ని కలిపి కుట్టిన కవి సమ్మేళనం

జ్ఞాపకం

కొన్ని అనుభవాలు ఊహకు అందవు. అనుభవం పొందిన తర్వాత వాటిని వర్ణించడానికి మాటలందవు. ఆకాశవాణి వారు నిర్వహించిన సర్వభాషా కవి సమ్మేళనంలో పాల్గొనడానికి వెళ్తున్నానని తెలిసినప్పుడు సంతోషం వేసింది. బహుముఖీన వైవిధ్యాలతో కూడిన తెలుగు కవిత్వానికి నేనొక్కడినే ప్రతినిధిని అంటే, తెలుగు పరువు కాపాడే బరువు నా మీదే ఉందని అనుకుంటే కొంచెం భయం కూడా వేసింది. ఒక్కో భాష నుంచి ఒక్కొక్క కవిని ఎంపిక చేసి 22 భాషల కవులను– వాటిని హిందీ అనువాదాలు చేసిన వారితో సహా ఒకచోట చేర్చి ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తారు. జనవరి 16న ఇండోర్లో ఈ కార్యక్రమం జరిగింది. నా కవిత 'పిచ్చి నాన్న'ను వాస్తవానికి హిందీలో శాంతసుందరి గారు అనువాదం చేశారు. కానీ, ఆవిడకు రావడం వీలుపడదని తెలియజేయడం తో అది చదవడానికి మరొక హిందీ కవికి ఇచ్చారు. అతని పేరు అంజీవ్ అంజుమ్. మధుర నుంచి వచ్చాడు. 15వ తేదీన బ్రిలియంట్ హోటల్లో ఆకాశవాణి వారు ప్రెస్ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆకాశవాణి ఇండోర్ అధికారులు, ఇతర సిబ్బందితో పాటు ఢిల్లీ నుంచి కూడా ఆకాశవాణి అధికారులు చాలామంది వచ్చారు. ప్రసారభారతి అడిషనల్ డైరెక్టర్ రాజశేఖర్ వ్యాస్ ఆ ప్రెస్ కాన్ఫరెన్సులో పాల్గొని మీడియా అడిగిన ప్రశ్నలకు, వారు వ్యక్తం చేసిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కవుల ఎంపికలో రాజకీయాలు జరుగుతున్నట్టు విమర్శ ఉందని దైనిక్ భాస్కర్ విలేకరి అడిగినప్పుడు– రాజశేఖర్ వ్యాస్ వివరణ ఇచ్చారు. ఇలాంటి విమర్శలకు తావు లేకుండా కవుల ఎంపిక ప్రక్రియను చాలా పక్కాగా నిర్వహించినట్టు చెప్పారు. ప్రాంతీయ భాషల్లో జిల్లాల వారీగా కవితల ఎంపిక జరుగుతుంది. తిరిగి వాటిని రాష్ట్ర కేంద్రానికి పంపుతారు. అక్కడకు చేరిన కవితల్లో సర్వ శ్రేష్ఠమైన ఆరు కవితలను ఎంపిక చేసి, వాటికి సుప్రసిద్ధులైన వారితో హిందీ, ఇంగ్లీషు అనువాదాలు చేయించి ఢిల్లీ కేంద్రానికి పంపుతారు. అక్కడ ఆకాశవాణి అధికారులతో ఏర్పడిన ఎంపిక బృందంతో పాటు దిగ్గజులైన నలుగురు కవుల సమక్షంలో ఆ ఆరు కవితల్లో ఒక కవితను ఎంపిక చేస్తారు. అలా 22 భాషల నుంచి ఒక్కో కవిత ఎంపిక జరుగుతుంది. ఈసారి ఈ ప్రక్రియలో న్యాయ నిర్ణేతలుగా బలదేవ్ వంశీ, దూద్నాథ్ సింగ్, సురేంద్ర దుబే వంటి ప్రముఖ హిందీ కవులు పాల్గొన్నట్టు చెప్పారు. వీరంతా సాహిత్యంలో అత్యున్నత పురస్కారాలందుకున్నవారే. పెద్ద యుద్ధమే చేసి ఇక్కడి దాకా వచ్చినట్టు కవులందరి మొహాల్లో కించిత్తు గర్వ రేఖ మెరిసింది.

ప్రెస్మీట్ తర్వాత కవుల పరిచయం సాగింది. మూలకవులతో పాటు హిందీ అనువాద కవులు కూడా ఈ పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే రోజు సాయంత్రం ఉజ్జయినీ తీసుకు వెళ్ళారు. అక్కడ ప్రఖ్యాత మహాకాళేశ్వర దేవాలయాన్ని కవులు దర్శించారు. కాళిదాసు నడయాడిన మట్టి మీద అడుగు పెట్టినందుకు కవులు భావోద్విగ్నతకు గురయ్యారు. గ్రూపులు గ్రూపులుగా మొత్తం గ్రూపుగా ఫొటోలు తీసుకున్నాక తిరుగు ప్రయాణం కట్టారు. రాత్రి భోజనాలయ్యాక కవులు చాలామంది ఒక గదిలో చేరి తెల్లారి కవి సమ్మేళనానికి రిహార్సల్లాగా ఒక చిన్నపాటి కవి సమ్మేళనం నిర్వహించారు. 16 సాయంత్రం 4.30 గంటలకు అసలు కవి సమ్మేళనం. ఉదయం టిఫిన్లు అయ్యాక మళ్ళీ ఒక గదిలో చేరి కవితా పఠనాలు మొదలు పెట్టారు. విశ్వేశ్వరరావుగారు, డా.రంగయ్య గారు, వల్లభరావు గారు హిందీలో అనువదించిన నా కవితలు కొన్ని తీసుకు వెళ్ళాను. వాటిలో ఫూల్ లో జీ ఫూల్ (పూలండోయ పూలు) అనే కవిత ఒక్కటే చదవగలిగాను. అక్కడ కూడా అందరూ నేనంటే నేనంటూ తొక్కిసలాట. మధ్యాహ్నం భోజనాల తర్వాత కాసేపు విరామంతో సాయంత్రం మెగా ఈవెంట్కి అంతా మెరిసిపోతూ సిద్ధమయ్యారు.



ఆకాశవాణి సర్వభాషా కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు, అనువాదకులు

జనవరి 16 సాయంత్రం అదే హోటల్లో పెద్ద హాల్లో వేదికను అద్భుతంగా అలంకరించారు. మూల కవులను వరసగా అనువాద కవులను మరో వరసగా పెద్ద పరుపులు వేసి కూర్చోబెట్టారు. ఈ జాతీయ స్థాయి కవిసమ్మేళనం 1956 నుంచి కొనసాగుతుందని, ఎన్నో మార్పులు చేర్పులతో ఈ ప్రక్రియ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కార్యక్రమంగా రూపు దిద్దుకుందని ఆలిండియా రేడియో అధికారుల ఉపోద్ఘాతంలో తెలిసింది. 60 ఏళ్లుగా ఒక దేశంలో 22 భాషల కవులను ఒక చోట చేర్చి అనువాదాలతో పాటు కవి సమ్మేళనం నిర్వహించడం, ఆయా కవితలను అన్ని భాషల్లోనూ అనువదింపజేసి దేశంలోని అన్ని రేడియో కేంద్రాల నుంచి ఆయా భాషల్లో ఒకేరోజు (గణతంత్ర దినోత్సవం నాడు) ప్రసారం చేయడం అసాధారణమైన కార్యక్రమంగా ఇది లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో నమోదైందని అధికారులు తెలిపారు. అదీ మేం పాల్గొన్న కవిసమ్మేళనంతోనే ఈ ప్రపంచ రికార్డు ప్రాప్తించిందని చెప్పడంతో కవుల మొహాల్లో ఆనందంతో పాటు ఒకరకమైన భావోద్విగ్నత కూడా కనిపించింది. ముందుగా సంస్క త కవితతో కవిసమ్మేళనం మొదలు పెట్టారు. తర్వాత అకారాది క్రమంతో అస్సాం, బంగ్లా, బోడో భాషల నుంచి హిందీ వరకూ కవితా పఠనాలు సాగాయి. ముందుగా మూలకవి తన భాషలో కవిత చదవడం, ఆ తర్వాత వెంటనే ఆ కవిత హిందీ అనువాదంతో మరో కవి చదవడం... ఇలా చివరి వరకూ సాగింది. ఆడిటోరియం పూర్తిగా కవిత్వ ప్రేమికులైన ప్రేక్షకులతో నిండిపోయింది. మూలకవి తన సొంత భాషలో కవిత చదువుతున్నపుడు హాలు నిశ్శబ్దంగా ఉండేది. అక్కడందరూ హిందీ భాషాప్రాంతం వారు కాబట్టి. అదే కవిత హిందీలో అనువాదం వినిపించినప్పుడు హాలు వాహ్వాలు... క్యా బాత్ హైలతో పాటు చప్పట్లతో మారుమోగింది.

కాశ్మీరు నుంచి కన్యాకుమారి దాకా వచ్చిన కవులు ఎంతో వైవిధ్యమైన కవితలు వినిపించారు. దేశభక్తి, దేశ సమగ్రత, సామాజికమైన అంశాలు, మహిళా కేంద్రకమైన అంశాలతో కవితలు ప్రేక్షకులను అలరించాయి. అస్సాం, నేపాలీ, కొంకణి భాషల నుంచి వచ్చిన యువకవులతో పాటు 70 సంవత్సరాలు పైబడిన సింధీ, బెంగాలీ, హిందీ, ఉర్దూ, కాశ్మీరీ కవులు, కవయిత్రులు కూడా తమ కవితలతో ఆ సాయంత్రాన్ని రసరంజితం చేశారు. అందరి కంటే చిన్నవాడైన 28 సంవత్సరాల నేపాలీ యువకుడు మహేష్ దహల్ ఇప్పటికే నాలుగు పుస్తకాలు ప్రచురించాడు. అతను వినిపించిన 'కాలము.. నేను' కవిత చిన్నదే అయినా అతడి తాత్త్విక గాఢత నన్ను బాగా ఆకర్షించింది. 'కాలం అంత క్రూరమైంది కాదు, అలాగని దయాళువూ కాదు/ కాలాన్ని నేను ప్రేరకుడని అనుకుంటాను' అంటూ మొదలు పెట్టి కాలం తన పాదాల నుంచి మస్తిష్కం దాకా ఎగబాకినప్పుడు ఏమేం మార్పులు జరిగాయో చెప్తూ కాలంలోకి తానూ పరావర్తనం చెందడాన్ని వర్ణించాడు. అస్సాం యువకవి మృదుల్ హాలోయి చిన్నప్పటి జ్ఞాపకాలను తమ అస్సాం పంట పొలాల మీద పరచుకునే అరుణారుణ కాంతితో ధీటుగా వర్ణించాడు. బోడో కవయిత్రి అంజలి, భూమి అంతటి పురాతనమైన స్త్రీ దు:ఖాన్ని వర్ణిస్తే, డోగ్రీ కవయిత్రి ప్రమీలా మన్ హస్ పరువుహత్యల నేపథ్యంలో ఒక చిన్నారి హత్యను బువా రాణి అంటూ కన్నీటిని అక్షరాలుగా పేర్చింది. కేవలం ఒక స్పర్శ అంటూ కన్నడ కవయిత్రి తేజశ్రీ, అహల్య దు:ఖభరిత వేదనను ఆధునిక భావావరణలో చైతన్యవంతంగా ఆవిష్కరించింది. ఉర్దూ గుజరాతీ గజల్స్ వినిపించిన అజహర్ ఇనైతీ, గోస్వామి ప్రేక్షకులను ఒక ఊపు ఊపారు. తమిళ కవయిత్రి తమిళ అరసి, మళయాళీ కవి థామస్ కుట్టి, కన్నడ కవయిత్రి తేజశ్రీ, తెలుగు నుంచి నేను వినిపించిన కవితలను దక్షిణాది నుంచి వచ్చిన కవితలు విశేషంగా ఆకట్టుకున్నాయని అక్కడి వారంతా అంటే చాలా సంతోషం వేసింది. మళయాళీ కవి ప్రొ.థామస్ కుట్టి రింగ్ టోన్ మీద వినిపించిన చిన్ని కవిత పెద్ద స్పందననే పొందింది. తమిళ కవయిత్రి కుర్చీలు అనే కవితను 'కుర్చీలకు కాళ్ళు నాలుగే ఉంటాయి. చేతులు మాత్రం అనేకం' అంటూ మొదలు పెట్టినప్పుడు తప్పట్లు మారుమోగాయి.

పత్రికలు ఈ కవిసమ్మేళనం విశేషాలను అద్భుతంగా కవర్ చేశాయి. నేను వినిపించిన పిచ్చినాన్న కవితలో చివరి వాక్యం 'నాకు కూతురంటే ఒక జన్మలో మనం పొందే రెండో అమ్మ' అనే అక్షరాలను హిందీలో 'బేటీ కా మతలబ్ ఏకీ జనమ్ మే మిల్నేవాలీ దూసరీ మా' అంటూ నయీ దునియా పత్రిక బేనర్ హెడ్డింగ్గా పెట్టి ఈ కార్యక్రమ విశేషాలను కవర్ చేసింది. అందరూ ఉదయాన్నే తిరిగి నాకు ప్రత్యేక అభినందనలు తెలియజేయడం జీవితమంతా గుర్తుండిపోతుంది. తెలుగు కవిత జెండా ఎత్తుగానే ఎగరేశానన్న తృప్తి దక్కింది. జనవరి 23వ తేదీన హైదరాబాద్ రేడియో కేంద్రం వారు తెలుగు మినహా మిగిలిన 21 భాషల కవితలను తెలుగులో శివారెడ్డి, ఎన్.గోపి, కొలకలూరి ఇనాక్, ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ, దర్భశయనం, దేవరాజు మహారాజు, నిఖిలేశ్వర్ వంటి దిగ్గజ కవులతో అనువాదాలు చేయించి కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నన్ను నా ఇండోర్ అనుభవాలను చెప్పి ముందుగా నా కవిత చదవమన్నారు. శివారెడ్డి గారు నా భుజం తట్టి 'జెండా ఎగరేశావయ్యా' అన్నారు. మొత్తానికి సర్వభాషా కవి సమ్మేళనం ఒక అద్భుతమైన ప్రక్రియగా చరిత్రలో నిలిచిపోతుంది.

– డాక్టర్ ప్రసాదమూర్తి
84998 66699

సమాచారం

4న భీమవరంలో జనకవనం

వర్తమాన సామాజిక సమస్యలపై ఫిబ్రవరి 4, ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కొత్త బస్టాండ్ దగ్గర గల క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో రాష్ట్రస్థాయి జనకవనం జరుగుతుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరిగే ఈ జనకవనంలో వివిధ జిల్లాల కవులు, సాహిత్యాభిమానులు పాల్గొంటారు. ఫిబ్రవరిలో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని ప్రజాకవులను ప్రోత్సహించడం కోసం మహాసభల ఆహ్వానసంఘం ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో తెలకపల్లి రవి, విరపు బాలసుబ్రహ్మణ్యం, రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు, లంకా వెంకటేశ్వర్లు, వి.ఉమామహేశ్వరరావు, గిడ్డి సుబ్బారావు, వొరప్రసాద్, శిఖామణి, ప్రసాదమూర్తి, బివివి ప్రసాద్, దాట్ల దేవదానం రాజు, జంధ్యాల రఘుబాబు, కెంగార మోహన్, నేతల ప్రతాప్ కుమార్, నాగాస్త్ర, భగ్వాన్, అద్దేపల్లి ప్రభు, ఎస్ఆర్ పృథ్వి, జోస్యుల కృష్ణబాబు, గనారా, సత్యాజీ తదితర కవులు, సాహిత్యవేత్తలు పాల్గొంటారు. ఈ జనకవనంలో చదివిన కవితలతో సంకలనం కూడా ప్రచురిస్తాం. భోజన వసతి సౌకర్యాలు ఉంటాయి. కవులు తమ పేర్లను చైతన్య ప్రసాద్ – 9849651451, నాగాస్త్ర – 7013939600, గనారా – 9949228298లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవల్సిందిగా కోరుతున్నాం.

– చైతన్య ప్రసాద్
మహాసభల ఆహ్వాన సంఘం తరపున

4న దేవుడు తప్పిపోయాడు ఆవిష్కరణ

ఫిబ్రవరి 4వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో 'దేవుడు తప్పిపోయాడు' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరుగుతుంది. సోమేపల్లి వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగే ఈ సభలో మాజీ మంత్రి డొక్కా వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. డాక్టర్ జి లక్ష్మీ నరసయ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.

– ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

5, 6 తేదీల్లో తరుణీ తరంగాలు

ఫిబ్రవరి 5, 6 తేదీల్లో విజయవాడలోని సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాలలో కళాశాల విద్యార్థినులకు, మహిళలకు తరుణీ తరంగాలు పేరిట సాహిత్య, సాంస్క ృతిక అంశాల్లో ప్రతిభాపోటీలు నిర్వహించబోతున్నాం. కథారచన, కవిత్వ రచన, లఘునాటిక ప్రదర్శన, నృత్య ప్రదర్శన, డిబేట్, చిత్రలేఖనం, ఏకపాత్రాభినయం తదితర విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయి. ఈనెల 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలి. ఏఏ అంశాలపై రాయాలో, గేయాలో గంట ముందు నిర్వాహకులు ప్రకటిస్తారు. కళాశాలల వారీగా విద్యార్థినులు, వ్యక్తిగతంగా మహిళలు పాల్గొనవచ్చు. వివరాలకు 94900 98620, 9392102171 నెంబర్లలో సంప్రదించవచ్చు.

– నిర్వాహక కమిటీ

పొడవే ఫ్యాషన్



లాంగ్ మిడ్డీస్ ఏ వయసులోనంటే ఆ వయసులో వేసుకోలేం. టీనేజీలో వేసుకోవాలని కోరిక ఉన్నా.. కొందరికి తీరని ముచ్చటగానే మిగిలిపోతుంది. అలాంటివారి కోసమే న్యూ లాంగ్‌మిడ్డి, దానిపైన కుర్తీ మోడల్ వచ్చేసింది. ప్రస్తుతం ఈ మోడలే మార్కెట్‌లో హల్‌చల్ చేస్తోంది. ఈ పొడుగు ఫ్యాషన్‌ను యువతులే కాదు, పిల్లల తలులూ ఫాలో అయిపోతూ ముచ్చట తీర్చుకుంటున్నారు. ఇంకెందుకాలస్యం మీరూ ఫాలో అవ్వండి!

మీ కోసం

దోసె చేసేటప్పుడు నానబెట్టిన బియ్యం, పప్పుతో కొంచెం మెంతులు, శనగపప్పు వేస్తే మంచి రంగు, రుచి వస్తాయి.

జీవన సౌరభం

తల వంచి పుస్తకాలు చదివితే.. తలెత్తుకునేలా విజ్ఞానం వస్తుంది.

కార్మికులే కట్టుకున్న ఆసుపత్రి!







వైద్యం అతిపెద్ద వ్యాపారంగా మారిపోయిన విషయం మనందరికీ తెలిసిందే. ఇప్పుడే కాదు మూడున్నర దశాబ్దాల కిందటా మంచి వైద్యం పొందడం అంటే ఓ ఖరీదైన వ్యవహారమే. అందులోనూ పేదవాడికి ఉచితంగా వైద్యం అందించడం అంటే కార్పొరేట్ ఆస్పత్రులకు అసలు సరిపడదు. వారు ఫీజులు తీసుకోకుండా వైద్యం ఎప్పుడూ చేయరు. ఒకవేళ ఎవరైనా అలా ఉచితంగా వైద్యం చేయమని కోరి వస్తే తన్ని తరిమేస్తారు, కానీ కొంత కూడా మానవత్వం చూపించరు. సరిగ్గా ఇలా జరుగుతుంది కనుకనే అక్కడి కార్మికులు అంతా కలిసి 34 ఏళ్ల కిందట ఏకమయ్యారు. తమకు తాముగా సొంతంగా, తమ డబ్బుతో, శ్రమతో ఓ హాస్పిటల్‌ను కట్టించుకున్నారు. అది ఇప్పటికీ ఎంతోమంది కార్మికులకు ఉచితంగా సేవలు అందిస్తోంది. ఆ హాస్పిటల్ పేరు 'షాహీద్' హాస్పిటల్.

అది ప్రస్తుత చత్తీస్‌గడ్‌లోని బలోడ్ జిల్లా దర్లీ రాజహరా ప్రాంతం. 1983వ సంవత్సరం. ఆ ప్రాంతంలో రాజ్‌హరా తదితర మైనింగ్ కంపెనీలు ఉన్నాయి. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న కార్మికులకు అనారోగ్య సమస్యలు వస్తే పరిస్థితి దారుణంగా ఉండేది. వైద్యం చేయించుకోవాలంటే తప్పనిసరిగా కార్పొరేట్ హాస్పిటల్‌కే వెళ్లాల్సిందే. దీంతో చేతిలో డబ్బుల్లేక, వైద్యం సకాలంలో అందకపోవడం వల్ల కార్మికులు, వారి కుటుంబ సభ్యులు మృత్యువాత పడేవారు. అయితే దీన్ని చూసి, కార్మికులు తట్టుకోలేకపోయారు. దీంతో వారందరూ ఏకమై చత్తీస్‌గడ్ మైన్స్ శ్రామిక్ సంఘ్ (సీఎంఎస్ఎస్) అనే సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీనికి శంకర్ గుహ నియోగి అనే కార్మిక నాయకుడు నాయకత్వం వహించాడు.

ఈ క్రమంలోనే ఆ ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులు ఆయన నేతృత్వంలో చందాలు పోగేసుకుని, సొంతంగా 'షాహీద్' పేరిట ఓ హాస్పిటల్‌ను కట్టుకున్నారు. దీనిని 1983 జూన్ 3న లహర్‌సింగ్ అనే వృద్ధ కార్మికుని చేతుల మీదగా ప్రారంభించుకున్నారు. 15 పడకలతో మొదలైన ఈ ఆసుపత్రి కార్మికుల ఆరోగ్యజీవనానికి చక్కటి బాట వేసింది. కార్మికుల కృషికి ఉదారంగా స్పందించిన చాలామంది డాక్టర్లు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలను అందించడం మొదలు పెట్టారు. 1994 నాటికి 60 పడకలకు విస్తరించిన ఈ హాస్పిటల్‌లో ఇప్పుడు 150 పడకలున్నాయి. ఈ ఆసుపత్రి వంద కిలోమీటర్ల పరిధిలోని కార్మికులకు, పేదలకు సేవలు అందిస్తోంది. దానికి కావల్సిన నిధులను దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తుండడంతో ఇప్పుడు ఆ హాస్పిటల్‌లో వైద్యం కార్పొరేట్ హాస్పిటళ్లకే ధీటుగా మారింది. అయితే అది ఫీజులు విషయంలో కాదు.. అధునాతన వైద్య సదుపాయాలు అందించడంలో ముందుంది. ఏదేమైనా కార్మికులే సొంతంగా తమ డబ్బులతో తమ కోసం హాస్పిటల్‌ను నిర్మించుకున్నారంటే వారి సంఘటితశక్తి ఏమిటో తెలుసుకుని నేటితరం దీన్నుంచి స్ఫూర్తి పొందాల్సిందే మరి! ★

ఇండియన్ మార్కెట్‌లోకి యమహా ఏరోక్స్



యమహా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ కేంద్రంగా జరగనున్న '2018 ఇండియన్ ఆటో ఎక్స్‌పో' వేదికగా కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణకు సిద్ధమైంది. ఈ వేదిక మీద 155 సీసీ కెపాసిటీతో 'ఏరోక్స్' అనే స్పోర్టివ్ స్కూటర్‌ను లాంచ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ యమహా 'ఏరోక్స్' 155 స్కూటర్‌ను యమహా 'లైనప్'లో ఉన్న ఎమ్‌టి మోటార్‌సైకిల్‌శ్రేణి డిజైన్ అంశాలతో రూపొందించింది. సౌకర్యవంతమైన, విశాలమైన రైడర్ పిలియన్ సీటు, టెయిల్ సెక్షన్‌లో పదునైన డిజైన్‌లో ఉన్న టెయిల్ ల్యాంప్ వంటివి యమహా 'ఏరోక్స్' 155 స్కూటర్‌కు మంచి స్పోర్టివ్ లుక్ తీసుకొచ్చాయి. ఈ సంస్థ తమ 'ఏరోక్స్' 155 స్కూటర్‌ను తొలుత 2016లో మలేషియాలో ఆవిష్కరించింది. ఆ తరువాత ఇండోనేషియా, వియత్నాం, పిలిప్పీన్స్ దేశాల్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాదిలో ఇండియన్ మార్కెట్ మీద దృష్టి సారించింది. ఎల్ఇడి హెడ్ ల్యాంప్, టెయిల్ ల్యాంప్, 25-లీటర్ల కెపాసిటీ గల అండర్ సీట్ స్టోరేజ్, సీటు కింద ఫ్యూయల్ ట్యాంక్ క్యాప్, 5.8-అంగుళాల పరిమాణం ఉన్న ఎల్‌సిడి డిస్ప్లే, స్మార్ట్ కీ సిస్టమ్, మొబైల్ ఛార్జింగ్ పోర్ట్ వంటివి అతి ముఖ్యమైన ఫీచర్లుగా ఉన్నాయి. సాంకేతికంగా 155.1సీసీ కెపాసిటీ గల ఫ్యూయల్ ఇంజెక్టెడ్, లిక్విడ్ కూల్డ్, సింగల్ సిలిండర్ ఇంజన్ కలదు. ఇది 14.6 బిహెచ్‌పి పవర్, 13.8 ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఇది పూర్తిగా విడుదలైతే, లిక్విడ్ కూలింగ్, ఫ్యూయల్ ఇంజెక్ట్ ఇంజన్‌తో వచ్చే భారతదేశపు తొలి స్కూటర్‌గా నిలవనుంది. ఇందులో అత్యుత్తమ హ్యాండ్లింగ్ కోసం 14-అంగుళాల అల్లాయ్ వీల్స్ ఉన్నాయి. ముందువైపున టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్క్స్, వెనుకవైపున డ్యూయల్ షాక్ అబ్జార్వర్లు, ఫ్రంట్ వీల్‌కు యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్‌తో కూడిన డిస్క్‌బ్రేక్, రియర్ వీల్‌కు డ్రమ్‌బ్రేక్ సెటప్ ఉంది. ధర విషయానికి వస్తే ఇండియన్ మార్కెట్లో లభించే అన్ని స్కూటర్ల ధర కంటే అధికంగా ఉండనుంది. విపణిలో ఉన్న అప్రిలియా ఎస్ఆర్ 150 స్కూటర్లకు ఇది గట్టి పోటీని ఇవ్వనుంది. ★

విజేత

బ్యాంకింగ్ అవేర్‌నెస్ (ఐబిపిఎస్- పిఓ'స్, క్లర్క్స్)

The deepest lake in the world is...

MODEL QUESTIONS

1. The State Bank of India has recently reduced the base rate by ___________, which will benefit customers on the old pricing regime.
(a) 10 basis points (b) 15 basis points
(c) 20 basis points (d) 30 basis points
(e) 25 basis points

2. Name the Senior diplomat who has been appointed foreign secretary of India.
(a) Sameer Bhandari
(b) Vijay Keshav Gokhale
(c) Rupesh Goyal
(d) Unmukt Roshan
(e) None of the given options is true

3. Name the Indian golfer who has recently won the Royal Cup at Pattaya.
(a) Jyoti Randhawa
(b) Anirban Lahiri
(c) Shiv Kapur
(d) Arjun Atwal
(e) Shiv Chawrasia

4. Women and Child Development Minister Maneka Gandhi inaugurated an online portal named ____________ in New Delhi for the empowerment of women.
(a) NARI
(b) Shakti
(c) Suraksha
(d) Jagriti
(e) MAA

5. Name the state that has become first in India to release of the first draft of National Register of Citizens (NRC) containing the first batch of 19 million names of genuine Indian citizens.
(a) Sikkim
(b) Himachal Pradesh
(c) Tripura
(d) Assam (e) Punjab

6. What is/are the new language/languages that have been recently included in the Prime Minister's Official website?
(a) Assamese (b) both (a) and (d)
(c) Gujarati (d) Manipuri
(e) both (a) and (c)

7. Which of the following two countries have recently introduced value-added tax (VAT) for the first time?
(a) Saudi Arabia and United Arab Emirates
(b) Iraq and Azerbaijan
(c) United Arab Emirates and Bahrain
(d) Azerbaijan and Bahrain
(e) Qutar and Kuwait

8. Name the person who has recently assumed the charge as the Managing Director of India Infrastructure Finance Company Ltd (IIFCL).
(a) Sanjeev Jha
(b) Vijay Keshav Gokhale
(c) Pankaj Jain
(d) Rajiv Kumar
(e) Sandeep Kumar

9. Anwar Jalalpuri passed away recently at the age of 71 in Lucknow. He was famous ___________.
(a) Flute Player
(b) Film Director
(c) Singer
(d) Poet
(e) Sitar Player


10. SBI has recently revised down the benchmark prime lending rates from 13.7 percent to _____________.
(a) 15.8 percent
(b) 16.6 percent
(c) 12.5 percent
(d) 14.3 percent
(e) 13.4 percent

11. Which city, founded by Udasi Sikhs Guru Ram Rai, is capital of Uttarakhand?
(a) Almora (b) Dehradun
(c) Haridwar (d) Roorkee
(e) Nanital

12. Which ocean is popularly known as the 'Herring Pond'?
(a) Arctic Ocean
(b) Indian Ocean
(c) Atlantic Ocean
(d) Pacific Ocean
(e) None of the above

13. Idukki Dam in Kerala is built across which river?
(a) Kaveri (b) Vaigai
(c) Pamba (d) Periyar
(e) Ganga

14. Which chariot-shaped temple, built by King Narasimha Deva I of Ganga dynasty in 13th century, is also known as the 'Black Pagoda'?
(a) Sun Temple, Konark
(b) Jagannath Temple, Puri
(c) Lingaraja Temple, Bhubaneswar
(d) Meenakshi Temple, Madurai
(e) Venkateswara Temple, Tirumala



15. 'Raja', 'Rani', 'Rocket' and 'Roarer' falls, collectively known as Jog Falls or Gersoppa Falls, are formed by which river in Karnataka?
(a) Netravati
(b) Dandavathi
(c) Vrishabhavati
(d) Sharavathi
(e) None of the above

16. Which island nation, located in the Pacific ocean, was formerly known as 'Pleasant Island'?
(a) Nauru (b) Taiwan
(c) Tuvalu (d) Vanuatu
(e) None of the above

17. In which Indian state is the Sultanpur National Park located?
(a) Uttarakhand
(b) Haryana
(c) Madhya Pradesh
(d) Rajasthan
(e) Uttar Pradesh

18. What is the capital of the Indian union territory of Dadra and Nagar Haveli?
(a) Kavaratti
(b) Silvassa
(c) Puducherry
(d) Port Blair
(e) None of the above

19. Near which city is the Kakrapar Nuclear Power Station located?
(a) Kota (Rajasthan)
(b) Karwar (Karnataka)
(c) Surat (Gujarat)
(d) Mumbai (Maharashtra)
(e) Kolkata (West Bengal)

20. The multipurpose Sardar Sarovar Project is being built across which river?
(a) Tapti (b) Ganga
(c) Sabarmati (d) Godavari
(e) Narmada

21. The Central Rice Research Station is situated in...
(a) Chennai (b) Bangalore
(c) Cuttack (d) Quilon
(e) None of the above

22. Mount Everest is located in
(a) India (b) Nepal
(c) Tibet (d) China
(e) None of the above

23. The deepest lake in the world is ...
(a) Wular Lake
(b) Victoria Nyanza
(c) Lake Superior
(d) Baikal Lake
(e) None of the above

24. Diamond mines in India are found in....
(a) Madhya Pradesh
(b) Rajasthan
(c) Bihar
(d) Gujrat
(e) Maharashtra

15. The unit currency used in Germany is....
(a) Real (b) Krones
(c) Yen (d) Dollar
(e) Euro

★

answers :

1.d,	2.b,	3.c,	4.a,	5.d,
6.b,	7.a,	8.c,	9.d,	10.e.
11.b,	12.c,	13.d,	14.a,	15.d
16.a,	17.b,	18.b,	19.c,	20.e
21.c,	22.b,	23.d,	24.a,	25.e



Important Bits

1. Grigor Dimitrov has recently won the ATP Finals Title in London, UK. He has defeated _____________.
Answer: David Goffin
2. The 42nd World Congress of the International Committee of Military Medicine (ICMM) organised by the Armed Forces Medical Services (AFMS) under the aegis of the Ministry of Defence (MoD) begun recently in _____________.
Answer: New Delhi
3. Name the Congress leader and former Union Minister who passed away recently after being in coma for 9 years.
Answer: Priya Ranjan Dasmunsi
4. Name the Czech tennis player, a Wimbledon champion in 1998 and 16-time Grand Slam winner in doubles and mixed doubles who passed away recently.
Answer: Jana Novotna
5. Name the Tennis Player who holds the record for the most singles titles in ATP.
Answer: Roger Federer
6. Name the Acclaimed South African Indian-origin AIDS researcher who has been appointed as a UNAIDS Special Ambassador for Adolescents and HIV.
Answer: Prof. Quarraisha Abdool Karim
7. Name the Veteran journalist who was presented with the 'Life Time Achievement Award' by the Indian Mountaineering Foundation (IMF).
Answer: Manik Banerjee
8. The world's biggest toilet pot model was unveiled at "Trump village" recently in on the World Toilet Day. Trump village is in which state?
Answer: Haryana
9. The Ministry of Defence (MoD) has decided to cancel the $500 million deal for Spike ATGM with which country?
Answer: Israel
10. The theme of United Nations Universal Children's Day 2017 is ________________.
Answer: Kids Take Over
11. A two-day conference of all Commanders of Eastern Air Command commenced has recently conducted in North-eastern state. Who is the present Chief of the Air Staff?
Answer: Air Chief Marshal B S Dhanoa
12. Which Bank has launched a new scheme for self-help groups (SHGs) to encourage entrepreneurship, the scheme named Pattabhi Sitaramayya — Self Business Group (PS-SBG)?
Answer: Andhra Bank
13. US President Donald Trump and Russian President Vladimir Putin has agreed to support the UN effort to "peacefully resolve" the nearly seven-year-long Syrian civil war. What is the currency of Syria?
Answer: Pound
14. Name the world's fastest supersonic cruise missile, which created history after it was successfully flight-tested first time from the Indian Air Force's (IAF) frontline fighter aircraft Sukhoi-30MKI against a sea-based target in the Bay of Bengal.
Answer: Brahmos
15. In India, the World Fisheries Day is being celebrated from 21st November, 2014 and it is being celebrated for the fourth consecutive year. The theme of this year (2017) is-
Answer: 2022 ka hai sapna…... kisaan ki aay ho duguna – Sankalp se siddhi

---

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

విజేత

ఆంధ్రప్రదేశ్‌లో నేలలు - స్వభావం



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

భారతదేశం వంటి వ్యవసాయక దేశానికి మృత్తికలు అత్యంత ముఖ్యమైన సంపద. ఒక దేశం యొక్క సౌభాగ్యం ఆ దేశం యొక్క మృత్తికలపై ఆధారపడి ఉంటుంది. మానవునికి కావాల్సిన ఆహారం, వస్త్రాలు వంటి కనీసావసరాలన్నింటికీ మృత్తికలే ఆధారం.

రాళ్లు రప్పలు కలిగి, సేంద్రీయ పదార్థ అవశేషాలు వంటి పదార్థంతో ప్రాణికోటికి అవసరమైన జీవపదార్థ ఉత్పన్నానికి మూలమైన భూ ఉపరితల నేలభాగాన్నే మృత్తికగా పేర్కొనవచ్చు.

శిలలు వాతావరణ మార్పులవల్ల శిథిలమై మృత్తికగా ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్ భూభాగం మిక్కిలి పురాతనమైన భూమి నిర్మాణానికి చెందినది.

సాధారణంగా మృత్తికలు రెండు రకాలుగా ఏర్పడతాయి. భూమిలోని రాళ్లు వాతావరణ ప్రభావం వల్ల శైథిల్యం చెంది, మెత్తని మన్నుగా మారుతుంది. వీటినే స్థానబద్ధ మృత్తికలు అంటారు. ఎర్రనేలలు, నల్లరేగడి నేలలు, జిగురు నేలలు ఈ రకానికి చెందినవి. భూమిపైనున్న రాళ్లు వాతావరణ ప్రభావంవల్ల మెత్తని మన్నుగా మారి, నీటిలో కలిసి కొట్టుకొనిపోయి లేదా గాలి ద్వారా ధూళిరూపంలో కొట్టుకొనిపోయి మరొకచోట మేటవేసి మృత్తికలుగా ఏర్పడతాయి. వీటిని స్థానగమన మృత్తికలు అంటారు. డెల్టా నేలలు, తీరప్రాంత ఇసుక నేలలు ఈ విధంగా ఏర్పడినవే.

ఆంధ్రప్రదేశ్‌లో పైన పేర్కొన్న రెండురకాల మృత్తికలు అనగా వీటికి సంబంధించిన ఎర్రనేలలు, నల్లరేగడి నేలలు, ఒండ్రుమట్టి నేలలు, తీరప్రాంత ఇసుక నేలలు, లాటరైట్ నేలలు విస్తరించి ఉన్నాయి.

నల్లరేగడి నేలలు

అవక్షేప శిలలు, రూపాంతర శిలలు, సున్నపురాళ్ళ, క్రమక్షయం జరగడంవల్ల నల్లరేగడి నేలలు ఏర్పడతాయి. గ్రానైట్, నీస్ వంటి శిలలు శైథిల్యం చెందడంవల్ల ఈ మృత్తికలు ఏర్పడతాయి. గాలిద్వారా కొట్టుకొచ్చి వేరొకచోట ఇవి ఏర్పడవచ్చు. వీటిలో 65 నుంచి 80 శాతం వరకూ బంకమన్ను బండలిమన్ను ఉంటాయి. ఈ మృత్తికలు క్షారస్వభావం కలిగి ఉంటాయి. త్వరగా నీరులోనికి పోదు. ఈ భూములు నీటిని గ్రహించి చాలా వరకూ నిల్వ ఉంచుకునే శక్తి కలిగి ఉంటాయి. ఈ నేలలు బాగా బిగుతుగా ఉండి మొక్కల వేళ్లు భూమిలోపలికి చొచ్చుకుపోవడానికి కష్టతరంగా ఉంటుంది. అయితే ఈ భూములకు నీటిని సంగ్రహించి ,చాలాకాలం వరకూ నిల్వ ఉంచుకునే శక్తికలిగి ఉంటుంది. వేసవికాలంలో తీవ్రంగా బీటలువారి చీలడంవల్ల గాలిలోనికి పోతుంది. అందువల్ల నల్లమృత్తికలు 'తనను తాను దున్నుకొనును' అని అంటుంటారు.

ఈ మృత్తికలు పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలోనూ, కర్నూలు జిల్లా మధ్య ప్రాంతంలో, కడప జిల్లా వాయవ్య ప్రాంతంలో, అనంతపురం తాడిపత్రి మండలంలో నెలకొని ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోని వాయిల్పాడు, చంద్రగిరి మండలాలు, అనంతపురం జిల్లాలోని పశ్చిమప్రాంతం, నెల్లూరు, కర్నూలు, కడప జిల్లాలోని కనిగిరి, గిద్దలూరు, ఆత్మకూరు ప్రాంతాలలోనూ ఈ మృత్తికలు ఉన్నాయి. ఈ భూములలో పత్తిపంట విస్తారంగా పండుతుంది. జొన్న, సజ్జ, కొర్ర, పసుపు, పొగాకు, మిరప వంటి పంటలూ పండుతాయి. నీటిపారుదల సౌలభ్యం ఆధారంగా వరి, చెరకు పంటలు పండుతున్నాయి. ఎర్రనేలల కంటే ఈ భూములు సారవంతమైనవి.



ఎర్రనేలలు

రాష్ట్రంలో ఎక్కువభాగం ఎర్రనేలలతో నిండి ఉంది. గ్రానైట్ రాళ్లు శైథిల్యం చెందడం వల్ల ఎర్రనేలలు ఏర్పడ్డాయి. ఈ భూములలో బంకమన్ను తక్కువగా ఉంటుంది. ఈ నేలలు తేలికగా ఉండి నీటిని గ్రహించే శక్తితో ఉంటాయి. నీరు త్వరగా ఇంకిపోయి లోపలి పొరలకు పోయే అవకాశం ఎక్కువగా ఉండటంవల్ల పైపొరల్లో తేమ లేకుండా పోతుంది. అందుకే ఈ నేలలు త్వరగా తేమను కోల్పోయే గుణం కలిగి ఉంటాయి. నీటిపారుదల సౌలభ్యం లేనిచోట్ల సకాలంలో వర్షాలు కురవకపోతే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుంది. అందువల్ల ఈ నేలలు నీటిని పట్టి ఉంచుకోడానికి నల్లమట్టిని, ఇతర ఎరువులను ఎప్పటికప్పుడు కలుపుతూ ఉండాలి. ఈ నేలల్లో నీటిలో కరిగే లవణాలు 0.25 శాతానికి మించవు. ఈ విధంగా లవణాలు తక్కువగా ఉండటంవల్ల భూములకు నీరు ఎక్కువ పెట్టినా చౌడుబారతాయనే భయం ఉండదు.

ఈ భూములలో ఎక్కువగా ఉలవలు, కందులు, పెసలు మొదలైన పప్పు దినుసులు, వేరుశెనగ, ఆముదాలు వంటి నూనెగింజలు పండుతాయి. నీటిపారుదల వసతులు కల్పించినట్లయితే ఈ భూములు రైతులకు లాభదాయకమైన వ్యవసాయ ఉత్పత్తులను అందజేస్తాయి.

ఒండ్రు నేలలు

ఒండ్రు నేలలు నదులవల్ల కొట్టుకొచ్చి మేట వేసిన మన్నుతో ఏర్పడిన డెల్టా భూములు. ఈ మృత్తిక పార్శ్వరేఖ కృతిలో వండలి, ఇసుకపొర విడిచి పొరగా ఏర్పడుతుంది. గోదావరి నది తీసుకొచ్చే ఒండ్రుమట్టిలో సున్నం, పొటాషియం శాతం ఎక్కువగా ఉంటాయి. ఈ భూములు సారవంతంగా ఉండి, బంకమట్టి ఇసుకతో కలిసి ఉండటంవల్ల నేలలోకి గాలి వెళ్లడం, నీటి గ్రహణశక్తి ఎక్కువగా ఉంటాయి.

మన రాష్ట్రంలో ఒండ్రునేలలు కృష్ణా, గోదావరి, పెన్నా డెల్టాలలో విస్తరించి ఉన్నాయి. రాష్ట్రంలో ఎక్కువగా వరి, చెరకు పండే ప్రాంతాలు ఈ ఒండ్రు మృత్తికలలోనే ఉన్నాయి. ఈ మృత్తికలు శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలలో తక్కువ వెడల్పుగానూ, గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో ఎక్కువ వెడల్పుగానూ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో తగుమాత్రం వెడల్పుతోనూ ఉన్నాయి. వరి, సరుగుడు, కొబ్బరి, మామిడి, జీడిమామిడి మొదలైన పంటలకు ఈ భూములు అత్యంత అనుకూలం. వ్యవసాయ రంగంలో ఒండ్రు నేలలకు సంవత్సరమంతా నీటిపారుదల వసతులే ఉండటం వల్ల ఈ నేలలు అత్యంత ప్రధానమైనవిగా గుర్తింపు పొందాయి.

తీరప్రాంతపు ఇసుకనేలలు

తీరప్రాంతపు ఇసుక నేలలు అక్కడి ఇసుక, ఒండ్రుమట్టితో కలిసి ఏర్పడ్డాయి. ఈ మృత్తికలో ఇసుక ఎక్కువశాతం బంకమట్టి తక్కువశాతం ఉంటుంది. అంతరజలం చాలాపైన ఉండటంవల్ల తుపాన్‌లు, పోటుపాటులు ఈ ప్రదేశాలను నీటితో ముంచివేసే అవకాశం ఎక్కువ. ఈ నేలలు అధిక లవణీయత కలిగి ఉండటంవల్ల చాలావరకూ ఉపయోగం లేకుండా బీడు భూములుగా మారి, అక్కడక్కడ చెట్లూ చేమలుతో ఉంటాయి. కొన్ని ప్రదేశాలు ఆర్థికంగా వీలుగాని చిట్టడవులుగా మారుతున్నాయి. బంకమట్టి ఎక్కువగా ఉన్న కొన్ని ఎత్తయిన ప్రదేశాల్లో మామిడి, జీడిమామిడి, కొబ్బరితోటలను పెంచుతున్నారు.

లాటరైట మృత్తికలు

ఎక్కువ వర్షపాతం, వేడి ఉన్న ప్రాంతాల్లో వాతావరణ ప్రభావం వల్ల ఈ మృత్తికలు ఏర్పడతాయి. ఈ నేలల్లో నైట్రోజన్ ఎక్కువగా ఉంటుంది. క్షారగుణం తక్కువ ఉండి, పాస్ఫరస్ పెంటాక్సైడ్, పొటాష్ కలిగి ఉంటాయి. ఇనుము, అల్యూమినియం ఆక్సైడ్స్ ఎక్కువ.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ మృత్తికల విస్తీర్ణం తక్కువ. ఈ మృత్తికలను రెండు రకాలుగా గుర్తించవచ్చు. మొదటిరకం ఎత్తయిన ప్రదేశాలలో విస్తరించి ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోని సత్యవీడు, పుత్తూరు, వుండలాంలో ఈ రకమైన నేలలు ఏర్పడి ఉన్నాయి. ఇక రెండోరకం లాటరైట్ మృత్తికలు తీర ప్రాంతాలకు దగ్గరగా ఉన్న లోతట్టు ప్రాంతాలలో పెద్దఎత్తున విస్తరించి ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా ఎల్లవరం, పెద్దాపురం మండలాల్లో, నెల్లూరు జిల్లాలోని కావలి, కొవ్వూరు, గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలో తీరానికి దగ్గర ప్రాంతాలలో విస్తరించి ఉన్నాయి.

ఈ నేలలు తోటపంటలకు బాగా అనుకూలం. చింతచెట్లు, మామిడిచెట్లు, జీడిమామిడి చెట్లు ఎక్కువగా పెరుగుతాయి. ★

ఉద్యోగాలు

ఐటీఐ లిమిటెడ్‌లో 20 ఖాళీలు

బెంగళూరులోని ఐటీఐ లిమిటెడ్ 20 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు-ఖాళీలు : చీఫ్ మేనేజర్ (సీఎం), డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం), అడిషనల్ జనరల్ మేనేజర్ (ఏజీఎం), జనరల్ మేనేజర్ (జీఎం)–20.
విభాగాలు : డిఫెన్స్ నెట్‌వర్క్, భారత్ నెట్, ఫైనాన్స్, మార్కెటింగ్, హెచ్ఆర్.
అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి బీఈ/ బీటెక్/ సీఏ/ ఐసీడబ్ల్యూఏ/ ఎంబీఏ/ పీజీ/ పీజీ డిప్లొమా. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం.
వయసు : జీఎంకు 52 ఏళ్లు, ఏజీఎం, డీజీఎం–50 ఏళ్లు, సీఎం–45 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : ఫిబ్రవరి 5, 2018.
హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 9, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.
వెబ్‌సైట్ : www.itiltd-india.com

ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూలో 12పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ) 12 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆర్థిక సాయం పొందుతున్న స్వతంత్ర సంస్థ.
పోస్టు పేరు-ఖాళీలు : స్టెనోగ్రాఫర్ గ్రేడ్ (3)–5, లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)–7.
అర్హతలు : స్టెనోగ్రాఫర్ గ్రేడ్ (3)కి పదోతరగతి/ తత్సమాన విద్యతోపాటు షార్ట్‌హ్యాండ్ (నిమిషానికి 80 పదాలు), టైపింగ్ (నిమిషానికి 40 పదాలు), ఎల్‌డీసీకి పదోతరగతి/ తత్సమాన విద్యతోపాటు టైపింగ్ (నిమిషానికి 30 పదాలు).
వయసు : 2017, జూలై 1 నాటికి స్టెనోగ్రాఫర్ గ్రేడ్ (3)కి 18–30 ఏళ్లు, ఎల్‌డీసీకి 18–25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
దరఖాస్తు ఫీజు : రూ.200, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.
దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 5, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.
వెబ్‌సైట్ : www.nihfw.org

గాయపడ్డ దళిత మహిళకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - పెనమలూరు (విజయవాడ)

అధికార పార్టీ నాయకుల దాడుల్లో తీవ్రంగా గాయపడి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం మత్స్య కార్మిక కుటుంబానికి చెందిన అంకాని పద్మ (49)ని సిపిఎం పెనమలూరు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, మండల నాయకులు టి.నరేష్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ సర్పంచి నిమ్మగడ్డ సీతారాంబాబు ప్రోత్సాహంతో నాగరాజు అనే వ్యక్తి తనపై దాడిచేసి తీవ్రంగా గాయపరచటమే గాక, అనేక ఏళ్లుగా నివాసయేంటున్న తన ఇంటి స్థలాన్ని ఆక్రమించటానికి బెదిరిస్తున్నాడని తెలిపారు. మహిళపై దాడికి పాల్పడిన నిందితుడినితో పాటు దాడికి ప్రోత్సహించిన గ్రామ సర్పంచిపై తగిన చర్యలు తీసుకుని శిక్షించాలన్నారు.



ఆవిష్కరణ

ఫిబ్రవరి 1 నుండి 20 వరకు జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్న సందర్భంగా విజయవాడలో ఆదివారం క్యాలెండర్ అవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రత్యేక హోదా సాధనకు చంద్రబాబు కదిలిరావాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణయ్య

ప్రజాశక్తి - భీమవరం టౌన్ (పశ్చిమగోదావరి)

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికైనా బిజెపిని వీడి అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ప్రత్యేకహోదా సాధనకు కదిలిరావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య కోరారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. బిజెపితో పొత్తు సరైంది కాదని నాలుగేళ్ల క్రితం సిపిఎం చెప్పిందని గుర్తు చేశారు. రాజధాని నిర్మాణానికి రూ.నాలుగు లక్షల కోట్లు అవసరమని చెప్పిన చంద్రబాబు మూడున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ అభివృద్ధి ఏమీ చేశారని ప్రశ్నించారు.

రాజధాని ప్రాంతంలో నాలుగు అడుగులు గడ్డి పెరగడం తప్ప అభివృద్ధి ఏమీ జరగలేదన్నారు. ఒకేచోట ఉండి పాలన చేయాల్సిన అవసరం లేదని వివిధ ప్రాంతాలలో కార్యాలయాలు ఉన్నప్పటికీ టెక్నాలజీని అనుసంధానం చేసుకుని పాలన సాగించాలని సూచించారు. అన్ని రంగాలను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేయాలని చూస్తుండటం సరైన పద్ధతి కాదన్నారు. వచ్చేనెల 10, 11, 12 తేదీల్లో జరిగే సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలను ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మార్చడానికి వేదిక కాబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఎం డెల్టా జిల్లా కార్యదర్శి బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్వి.గోపాలన్ పాల్గొన్నారు.

సీమ ప్రజలను మోసం చేస్తున్న సిఎం

- గుండ్రేవుల రిజర్వాయరుతోనే సీమ సస్యశ్యామలం
- రిజర్వాయరు సాధనకు పాదయాత్ర
- కుంటిసాకులు చెబుతున్న టిడిపి
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో గుండ్రేవుల రిజర్వాయరు చేపడతానని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీనిచ్చి నేడు విస్మరించి సీమ ప్రజలను మోసం చేస్తున్నారని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి విమర్శించారు. గుండ్రేవుల రిజర్వాయరుతోనే రాయలసీమ సస్య శ్యామలం అవుతుందని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలోని కెసి కెనాల్ సమీపంలో తుంగభద్ర జలాలతో గుండ్రేవుల వద్ద రిజర్వాయర్‌ను నిర్మించాలని కోరుతూ ఆదివారం రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో కర్నూలు నుంచి గుండ్రేవుల వరకు పాదయాత్ర చేపట్టారు. స్థానిక కలెక్టరేట్ నుంచి బొజ్జ దశరథ రామిరెడ్డి చేపట్టిన ఈ పాదయాత్రను ఇరిగేషన్ రిటైర్డ్ ఇంజనీర్ సుబ్బరాయుడు ప్రారంభించారు. ఈ పాదయాత్రకు శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో న్యాయవాదులు మద్దతు తెలియజేశారు. రాజ్ విహార్ మీదుగా శ్రీరామ థియేటర్ నుంచి సుందరయ్య సర్కిల్‌కు చేరుకుంది. అక్కడ ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, ఐద్వా, విద్యార్థులు, ఉద్యోగులు, సాగునీటి సంఘాలు మద్దతు తెలియజేసి బళ్లారి చౌరస్తా వరకు పాదయాత్రలో పాల్గొన్నాయి. అంతకుముందు కలెక్టరేట్ ఎదుట బొజ్జ దశరథరామిరెడ్డి పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. గుండ్రేవుల వద్ద తుంగభద్ర నదిపై రిజర్వాయర్‌ను నిర్మిస్తే కర్నూలు, కడప జిల్లా ప్రజలకు సాగు, తాగు నీటి సమస్య తీరుతుందని అన్నారు.

తుంగభద్ర నుంచి నికర జలాలతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేసుకోవచ్చని అనేక కమిషన్‌లు కూడా పేర్కొన్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తుంగభద్ర నుంచి ప్రతి ఏటా దాదాపు 60 నుంచి 70 టిఎంసిలకు పైగా నీరు వృధాగా పోతుందన్నారు. ప్రతి ఏడాది కెసి కెనాల్ కింద పంటలు సాగు చేసుకున్న రైతులు సాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి డిపిఆర్ కూడా తయారు చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కర్నూలులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గుండ్రేవుల ప్రాజెక్టు చేపడతామని ప్రకటన చేసి మూడున్నర సంవత్సరాలవుతున్నప్పటికీ ఊసే లేదని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం అడ్డంకిగా వుందని టిడిపి తప్పుడు ప్రకటన చేస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం గుండ్రేవులకు మద్దతునిస్తున్నప్పటికీ సిఎం చంద్రబాబు స్పందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ఈ ప్రాజెక్టును చేపట్టకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



కర్నూలులో జెండాఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న ఇరిగేషన్ రిటైర్డు ఇంజనీర్ సుబ్బరాయుడు

హక్కుల కోసం ఉద్యమం : చిట్టిబాబు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రతి పౌరుడు హక్కుల కోసం ఉద్యమించాలని రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షులు వేడంగి చిట్టిబాబు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని గాంధీభవన్‌లో జిల్లా పౌరహక్కుల సంఘం మహాసభలు ఆదివారం జరిగాయి. ఈ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం హిందూ మతోన్మాదం, హింస తీవ్రంగా పెరిగిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో పౌరహక్కుల సంఘాల ఆవశ్యత చాలా ఎక్కువగా ఉందన్నారు. అనంతరం పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి నంబూరి శ్రీమన్నారాయణ, తెలంగాణా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నారాయణరావు మాట్లాడారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా అందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో, రాష్ట్రంలో భావప్రకటన హక్కుపై తీవ్ర దాడి జరుగుతుందన్నారు. వీటిని ప్రజాస్వామ్యవాదులంతా ఐక్యంగా ఎదుర్కోనాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ, అరుణోదయ కళామండలి, రైతు, మహిళాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా పోరుబాట పట్టాలి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-కార్పొరేషన్(గుంటూరు)

మున్సిపల్ కార్మికులు ఇతర కార్మికులతో కలిసి ఐక్యంగా ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరుబాట పట్టాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. గుంటూరులో జాషువా విజ్ఞాన కేంద్రంలో నర్సింగరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమ రంగ సమస్యలతో పాటుగా వారు నివాసం ఉండే ప్రాంతాల్లో స్థానిక సమస్యలపైనా ఉద్యమించాలన్నారు. నేడున్న పెట్టుబడీదారీ ప్రభుత్వాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసమే తప్ప ప్రజా బాహుళ్య సమస్యల పరిష్కారం, అభివృద్ధిని పట్టించుకోవని విశదీకరించారు. సమస్యల పరిష్కారం కోసం రాజీలేని ఉద్యమాలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు సమ సమాజం కోసమూ పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సామ్రాజ్యం, కె.ఉమామహేశ్వరరావు, గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, మున్సిపల్ శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎం.శివలక్ష్మీ పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌లో కౌలు రైతులకు అవకాశమివ్వాలి

కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి- గుడివాడ (కృష్ణా)

ఈ-క్రాప్‌లో కౌలు రైతులు, సాగుదారుల పేర్లను నమోదు చేసి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఉత్పత్తులను అమ్ముకొనే అవకాశం కల్పించాలని రైతు, కౌలు రైతు సంఘాల తూర్పు కృష్ణా అధ్యక్షులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, టి.లక్ష్మణస్వామి డిమాండ్ చేశారు. కౌలు రైతు, రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జాతా ఆదివారం కృష్ణా జిల్లా గుడివాడకు చేరుకుంది. ఈ జాతాకు ప్రజా సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ-క్రాప్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, అసలైన సాగుదారుల, కౌలు రైతుల పేర్లను నమోదు చేయకపోవటం వల్ల ధాన్యం అమ్మకాలు చేపట్టే సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేరళ మాదిరిగా ధాన్యానికి క్వింటాకు కనీస మద్దతు ధర రూ.500 లు బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలని కోరారు. సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులకు కేరళ తరహాలో రుణమాఫీ చేయాలని, మద్దతు ధర సరిగా లేకపోవటంతో మిగిలిన పాత మినుమును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం తూర్పు కృష్ణాకార్యదర్శి మాగంటి హరిబాబు, నాయకులు వాకా రామచంద్రరావు, ఆర్‌సిపి రెడ్డి పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. 62
2. ఆస్ట్రేలియాలోని తస్మినియా తీరంలో
3. 7.4 శాతం
4. ఉషా అనంత సుబ్రమణియన్
5. కరోలినా వోజ్నియాకి

దళితులపై దాడులు చేస్తూ దళిత తేజమా?

- నిందితుల్ని ఎందుకు అరెస్టు చేయడం లేదు
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/కలెక్టరేట్ విశాఖ

రాష్ట్రంలో ఒక వైపు దళితులపై దాడులు చేస్తూ మరోవైపు దళిత తేజం పేరిట చంద్రబాబు మోసం చేస్తున్నారని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి విమర్శించారు. విజయవాడ ఎంబివికెలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి వ్యవహారం చూస్తుంటే పిల్లవాడిని కింద గీకుతూ పైకి జోలపాడినట్లుందని ఆయన పేర్కొన్నారు. గరగపర్రు, జెర్రిపోతులపాలెం, నక్కలదిన్నె, గొట్టిపాడు ఇలా అనేక ప్రాంతాల్లో దళితులపై దాడులు, సంఘ బహిష్కరణలు చేస్తూనే ఉన్నారన్నారు. ఈ ఘటనలన్నింటిలో టిడిపి నాయకులే ప్రధాన నిందితులుగా ఉన్నారన్నారు. నిందితుల్ని అరెస్టు చేసి, దళితులకు రక్షణ కల్పించమన్నందుకు దళిత, ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు నాయకుల్ని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. బాధితులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం వారిపైనే కౌంటర్ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. దాడులు జరిగిన ప్రాంతాల్ని మంత్రులు ఎందుకు సందర్శించడంలేదని ప్రశ్నించారు. సబ్‌ప్లాన్ నిధుల్ని ఎందుకు పక్కదారి పట్టిస్తున్నారన్నారు. సబ్‌ప్లాన్ నిధులతో రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని అడిగినందుకు పెదగొట్టిపాడులో టిడిపి ఆధిపత్య కుల పెత్తందార్లు దాడికి పాల్పడ్డారన్నారు. జస్టిస్ పున్నయ్య, కోనేరు రంగారావు సిఫార్సుల్ని ఎందుకు అమలుచేయడంలేదని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. నీరు-చెట్టు పేరుతో దళిత భూముల్ని లాక్కుంటున్నారన్నారు. రాష్ట్రంలో ఈ సంవత్సర కాలంలో ఇప్పటి వరకు దళితులపై 7 వేల దాడులు జరగ్గా, అందులో 5 వేల కేసులు పెండింగ్‌లో ఉండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వీటన్నింటినీ పరిశీలించి దళితులకు న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని కెవిపిఎస్ డిమాండ్ చేస్తోందన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నటరాజ్ మాట్లాడుతూ దాడులకు కారణమైన టిడిపి నాయకులు దళితతేజం పేరుతో పల్లెల్లోకి వెళ్లడం సిగ్గుచేటన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టుల్ని ఎందుకు భర్తీ చేయడంలేదని ప్రశ్నిచారు. అనంతరం కెవిపిఎస్ ప్రచురించిన రాష్ట్ర మహాసభల ప్రత్యేక బులెటిన్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు, మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు జి క్రాంతి కుమార్ ఆవిష్కరించారు.

దళితులకు ఏం చేశారని దళిత తేజం

చంద్రబాబును ప్రశ్నించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాష్ట్రంలో దళితులకు ఏమి చేశారని దళిత తేజం-తెలుగుదేశం కార్యక్రమాన్ని చంద్రబాబు చేపట్టారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. విశాఖ అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఇంత వరకు దళితులకు ఒక్క ఎకరా భూమైనా ఇచ్చారా... ఒక్క ఇల్లు అయినా కట్టించి ఇచ్చారా, ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేశారా అని ప్రశ్నించారు. విశాఖ జిల్లా పెందుర్తి మండలంలోని జెర్రిపోతులపాలెంతో సహా రాష్ట్రంలో పలు చోట్ల దళితులపై దాడులు జరిగితే బాధ్యులైన వారిపై నేటికీ చర్యలు తీసుకోలేదన్నారు. దళిత తేజం పేరుతో పోస్టర్లను ఆవిష్కరిస్తే న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపితో ఎంతకాలం కలిసి ఉంటారని, కేంద్రంలో ఉన్న టిడిపికి చెందిన ఇద్దరు మంత్రులతో తక్షణం రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. జగన్ పార్టీతో సహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో కలిసి కేంద్రంపై పోరాటానికి చంద్రబాబు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు.

బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

- ఎపి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాబూరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చే ఆలోచన మానుకోవాలని, దీనిపై గ్రామస్థాయి నుంచి పోరాటాలు చేయాలని ఎపి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపి డాక్టర్ ఎం.బాబురావు అన్నారు. బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్పునకు నిరసనగా ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజన గర్జనను ఆదివారం చేపట్టారు. తొలుత ఆ సంఘం ఆధ్వర్యాన స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ నుంచి పాతబస్టాండ్ మీదుగా మార్కెట్ యార్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో బాబూరావు మాట్లాడారు. అధికార పార్టీతో పాటు ప్రతిపక్షపార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తాను అధికారంలోకి వస్తే బోయ, వాల్మీకి జాతులను ఎస్టీల్లోకి చేరుస్తామని కడప పాదయాత్రలో ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. అంటే గిరిజనులను అన్యాయం చేయాలని రెండు పార్టీలూ నిర్ణయించుకున్నాయన్నారు. గిరిజన హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయని, దీన్ని గ్రామస్థాయి నుంచి సభలు నిర్వహించి, పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్సయ్య మాట్లాడుతూ జిల్లాలో గిరిజన సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వీటి పరిష్కారానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపి డివిజి శంకరరావు మాట్లాడుతూ రిజర్వేషన్ గిరిజనుల హక్కని, దీన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సభలో సిపిఎం పార్వతీపురం ప్రాంతం కార్యదర్శి రెడ్డిశ్రీరామ్మూర్తి, గిరిజన సంఘం నాయకులు ఎం.రమణ, తిరుపతిరావు, సీతారాం, రామస్వామి, ఎం.సీతారాం, ఎన్.సురేష్, బిడ్డిక తమ్మయ్య అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.



విజయనగరం జిల్లా పార్వతీపురం సభలో మాట్లాడుతున్న డాక్టర్ బాబురావు.

హైకోర్టు ఏర్పాటు చేసే వరకూ ఉద్యమిస్తాం

బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి.నాగలక్ష్మిదేవి

ప్రజాశక్తి - కర్నూల్ అర్బన్

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసే వరకూ ఉద్యమిస్తామని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి.నాగలక్ష్మిదేవి పేర్కొన్నారు. హైకోర్టు ఏర్పాటు చేయాలని స్థానిక శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లోని ధర్నాచౌక్ సమీపంలో న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు కర్నూలు ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి, ఇతర ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలియజేశారు. ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు కర్నూలులో హైకోర్టు చేయాలనే డిమాండ్ సరైనదేనని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. బొజ్జ దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసేంతవరకు ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. ఈ ఆందోళనకు తాము సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని చెప్పారు. దీక్షల్లో న్యాయవాదులు పాల్గొన్నారు.కడపలో న్యాయవాదులు చేపట్టిన రిలేదీక్షలు ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగుతాయని, అప్పటి వరకు న్యాయవాదులు తమ విధులను బహిష్కరిస్తున్నట్లు న్యాయవాదుల జెఏసి ప్రకటించింది.

డార్విన్ పాఠ్యాంశాలు తొలగిస్తామనడం సరికాదు

ప్రజాశక్తి - కొల్లూరు (గుంటూరు జిల్లా)

రాజ్యాంగ లక్ష్యాలకు ప్రభుత్వాలు తిలోదకాలిస్తున్నాయని ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్స్ జెఎసి రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. గుంటూరు జిల్లా కొల్లూరుకు ఆదివారం వచ్చిన ఆయన స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాజ్యాంగ లక్ష్యాలను వదిలేసి మతాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, డార్విన్ పాఠ్యాంశాలను తొలగిస్తామని బిజెపి నాయకులు సత్యపాల్‌సింగ్ పేర్కొనడాన్ని ఖండించారు. రసాయన శాస్త్రంలో పిహెచ్‌డి చేసిన మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. పాఠశాల విద్యను, పరీక్షల చుట్టూ తిప్పే విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. సిపిఎస్‌పై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేసిన ఆయన యుటిఎఫ్, ఎపిజెఎసి తరపున పాత పద్ధతినే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా పిఆర్‌సి ఎరియర్స్ లేవని, వాటిపై కమిటీ వేసి వెంటనే విడుదల చేయాలని, డిఎలు క్రమం తప్పకుండా ఇవ్వాలని కోరారు. ఈనెల 29న రెండు జిల్లాల్లో సిపిఎస్ రద్దు కోసం ధర్నాలు చేస్తామని చెప్పారు. సమావేశంలో మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విజయవాడ సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సంఘటితంగా పోరాడితేనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

సంఘటితంగా పోరాడితే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని సిఐటియు రాష్ట్ర కోశాధికారి ఎవి.నాగేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన ఎపి సెక్యూరిటీ గార్డ్స్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సులో ముఖ్యఅతిథిగా నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. కార్మిక శాఖ జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం సెక్యూరిటీ గార్డులకు నెలకు జీతం రూ.16,978 చెల్లించాలన్నారు. క్యాష్‌మెయింటెనెన్స్ వెహికల్స్ డ్రైవర్స్‌కి, హౌస్ కీపర్స్‌కి నెలకు రూ.11,648 వేతనం చెల్లించాలనే ఉత్తర్వులను యాజమాన్యం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఒక్క కృష్ణా జిల్లాలోనే 10 వేల మంది వరకూ కార్మికులున్నారని, రాష్ట్రవ్యాప్తంగా లక్షకు పైగా ఉన్న వారందరూ బలమైన యూనియన్‌గా ఎదగాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లిస్తూ నెలనెలా పే స్లిప్‌లివ్వాలన్నారు. ఆరోగ్య బీమా, ప్రమాద బీమా సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. విధి నిర్వహణలో మరణిస్తే రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు, ముజఫర్ అహ్మద్, అధ్యక్ష, కార్యదర్శులు, పి.శేఖర్‌బాబు, కె.రమేశ్‌బాబు, సిఐటియు నాయకులు ప్రభుదాసు, కె.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన

ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యానికి వ్యక్తి మృతి

- నగరి ఏరియా ఆస్పత్రి ఎదుట మృతుని బంధువుల ఆందోళన

ప్రజాశక్తి-నగరి(చిత్తూరు)

ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం చిత్తూరు జిల్లా నగరి మండలంలో చోటుచేసుకుంది. మృతుని కుటుంబీకుల వివరాల మేరకు.. చింతలపట్టెడ గ్రామానికి చెందిన పార్థసారథి, యుగంధర్‌లు చికిత్స నిమిత్తం ఈ నెల 4వ తేదిన స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేరారు. వైద్యులు వేసిన సూది వికటించడంతో పార్థసారథికి కణతి ఏర్పడింది. దీంతో పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు తిరుపతిలోని రుయాకు రెఫర్ చేశారు. రుయాలోని వైద్యులు చిన్నపాటి ఆపరేషన్ కూడా చేశారు. రెండు వారాల వరకూ ఎటువంటి మార్పు లేకపోవడంతో కుటుంబీకులు చెన్నైలోని రామచంద్రా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుది శ్వాస విడిచాడు. ఆదివారం కుటుంబీకులు, గ్రామస్తులు మృతదేహంతో ఏరియా ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. వీరికి సిఐటియు జిల్లా నాయకులు కొత్తపల్లి సుబ్రమణ్యం మద్దతు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ మృతదేహాన్ని తీయబోమని ఆస్పత్రి ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. జేసీ-2 చంద్రమౌళి హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.



ఆస్పత్రి ఎదుట మృతదేహాన్ని ఉంచి నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

సంక్షిప్తం

మెట్లపల్లిలో మట్టి లారీలను అడ్డుకున్న ప్రజలు

ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)

గ్రామాన్ని దుమ్ములో ముంచెత్తుతున్న మట్టి లారీలను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మెట్లపల్లిలో ప్రజలు లారీలను అడ్డుకున్నారు. బ్రహ్మయ్య లింగం చెరువు నుంచి మట్టి లోడుతో వస్తున్న లారీలను రోడ్డుపై నిలిపేసి నిరసన తెలిపారు. రోజుకు వందలాది లారీలు వెళ్లడంతో రోడ్లు దెబ్బతినడంతో పాటు దుమ్ము లేచి ఇళ్లను ముంచెత్తుతున్నాయని దీంతో రోగాల బారిన పడుతున్నామని మండిపడ్డారు. మీ ఇష్టానుసారంగా పోతుంటే చూస్తూ ఊరుకోవాలా? అని పెద్దలు నిలదీశారు. లారీల యజమానులొచ్చి లారీలను వేగంగా పోనీయవద్దని, నీరు కొట్టిస్తామని చెప్పి పరిస్థితిని సర్దుబాటు చేశారు.

సహకార ఎన్నికల అథారిటీని నియమించండి

ప్రజాశక్తి - కాకినాడ

97వ రాజ్యాంగ సవరణ ప్రకారం రాష్ట్రంలో సహకార ఎన్నికల అథారిటీని నియమించాలని సహకార శాఖ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టివి.ఫణిపేర్రాజు, కె.భావనారిషి డిమాండ్ చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని సహకార సంఘం భవనంలో ఆంధ్రప్రదేశ్ సహకార సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సులో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సహకార వ్యవస్థ ప్రపంచ వ్యాప్తంగా 150 దేశాల్లో ఉందన్నారు. రాష్ట్రంలో 30వేల సంఘాలు, 2056 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు చిన్న,సన్నకారు రైతులకు వ్యవసాయ రుణాలు అందిస్తున్నాయన్నారు.

బస్సు చార్జీలను తగ్గించిన తమిళనాడు ప్రభుత్వం

చెన్నై : తమిళనాడులో జనవరి 19న చార్జీలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రతి పక్షాలు, ప్రయాణీకులు నిరసన తెలిపిన నేపథ్యంలో చార్జీలను తగ్గిస్తున్నట్లు ఆదివారం ప్రకటించింది. చెన్నై లోని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటిసి) తో సహా ఎనిమిది రాష్ట్ర రవాణా సంస్థల(ఎటిసి)లో తగ్గింపు చార్జీలు సోమవారం ఉదయం నుండి అమల్లోకి వస్తాయని రాష్ట్ర రవాణా డిపార్ట్‌మెంట్ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. మార్పు చేసిన చార్జీల్లో ఎంటిసి కనీస టికెట్ ధర రూ.5 నుండి రూ.4కు తగ్గించింది. గరిష్ట టిక్కెట్ ధర రూ.23 నుండి 22కు తగ్గించింది. ఈ కొత్త ధర 28 స్టేజీల వరకు వర్తిస్తుంది.

జల్లికట్టు

తమిళనాడులోని కోయంబత్తూరులో మొదటిసారిగా పెద్ద ఎత్తున ఆదివారం జలికట్టు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 500 ఎద్దులు, 750 మంది పోటీదార్లు పాల్గొన్నారు.



విడాకులు తీసుకున్నాక ఫొటోలు, వీడియోలు పంపరాదు : సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : విడాకులు పొందిన తర్వాత భార్యగానీ, భర్తగానీ తమ ఫొటోలను, వీడియోలను ఇంటర్నెట్‌లో, సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయకూడదు, ఎక్కడా ఎవరితోనూ వాటిని వాడరాదు అంటూ భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం తాజాగా తీర్పు వెలువరించింది. మహారాష్ట్రకు చెందిన ఓ జంటకు విడాకులు మంజూరుచేస్తూ సుప్రీం పై తీర్పు చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరిస్తూ, మహారాష్ట్రకు చెందిన భార్యభర్తకు విడాకులు మంజూరుచేసింది. రెండు నెలల్లోగా భార్యకు శాశ్వత భరణం కింద రూ.37 లక్షలు చెల్లించాలని భర్తను ఆదేశించింది. భార్యగానీ, భర్తగానీ ఇకపై తమ ఫొటోలను ఎక్కడా, ఏ విధంగానూ ఉపయోగించరాదని, ఇంటర్నెట్, సామాజికమాధ్యమంలో పోస్ట్ చేయరాదని అంటూ ఆదేశాలు జారీచేసింది. విడాకుల పిటీషన్లో ఇరు పక్షాలు ఒకరిపై ఒకరు చేసుకున్న ఆరోపణల విషయంలో నేర అభియోగాల్ని నమోదుచేయటం కుదరదంటూ ధర్మాసనం పేర్కొన్నది. ఆస్తి, ఇతర తగాదాలకు కూడా ఇదే వర్తిస్తుందని కోర్టు పేర్కొన్నది. అలాగే ఒకసారి విడాకులు మంజూరయ్యాక, కేసుకు సంబంధించి ఇరు పక్షాలు ఒకరిపై ఒకరు చేసుకున్న ఆరోపణల్ని కూడా రికార్డుల నుంచి తొలగిస్తామని ధర్మాసనం తెలియజేసింది.

కేంద్రం విధానాలతో రైతులకు ఇక్కట్లు

దుర్భిక్ష ప్రాంతాలను వర్గీకరించడంలో అసమగ్ర విధానం

న్యూఢిల్లీ : కరువు తాకిడి ప్రాంతాలను వర్గీకరించేందుకు కేంద్రం తీసుకువచ్చిన విధానాలు, నిబంధనలతో దుర్భిక్ష ప్రాంతాల్లో పరిస్థితులు మరింత అధ్వాన్నంగా మారుతున్నాయని రైతులు, వ్యవసాయ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. దేశంలో దుర్భిక్ష ప్రాంతాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను మరింత ఖచ్చితంగా అంచనా వేసేందుకు 2016 డిసెంబరులో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కొత్త శాస్త్రీయ సూచికలను, ప్రామాణికాలను రూపొందించి, విడుదల చేసింది. ఆ సూచికల్లో వర్షపాతం, వ్యవసాయం, భూమిలోని తేమ, నీటి పారుదల, రిమోట్ సెన్సింగ్ (పంటల ఆరోగ్యం) వున్నాయి. కంటితో చూసి, పంటల దిగుబడిని పరీక్షించే సాంప్రదాయ పద్ధతులైన అన్నెవారి/పైస్వారి/గిర్‌ద్వారి వంటి వాటిపై ఆధారపడ కుండా శాస్త్రీయమైన ఈ ప్రమాణాలు, సూచికల ఆధారంగా కరువు పరిస్థితులను మరింత ఖచ్చితంగా నిర్ధారించవచ్చని, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా సాయపడుతుందని భావించారు. కానీ అందుకు భిన్నంగా రైతులను మరింత ఇబ్బందులకు గురి చేసేలా ఈ నిబంధనలు తయారయ్యాయి. ముఖ్యంగా కరువు బాధిత ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా తయారైంది. రైతుల ఆత్మహత్యలకు, వరుసగా కరువు కాటకాలు తాకిడికి పేరొందిన మహారాష్ట్రలోని విదర్భ, మరట్వాడా ప్రాంతాల రైతాంగానికి దెబ్బ మీద దెబ్బలా ఈ మాన్యువల్ తయారైంది. కొన్ని చోట్ల వాస్తవంగా కరువు నెలకొన్నా కూడా ఆ పరిస్థితి బయటకు వెల్లడవడం లేదు. మన దేశంలో ఆరు వాతావరణ మండలాలు వున్నాయని, వివిధ వ్యవసాయ, వాతావరణ ప్రాంతాల్లో కరువు లక్షణాలు కూడా మారుతూ వుంటాయని వాటిని పరిగణనలోకి తీసుకోవాల్సి వుంటుందని పూనేకి చెందిన ఎస్‌ఓపిపిఇసిఓఎం (సొసైటీ ఫర్ ప్రమోటింగ్ పార్టిసిపేటివ్ ఎకోసిస్టమ్ మేనేజ్‌మెంట్) సీనియర్‌ఫెలో కె.జె.జాయ్ వ్యాఖ్యానించారు. ఈ కొత్త నిబంధనలు, విధి విధానాలనే అమలు పరిస్తే దేశంలో అనేక కరువు ప్రాంతాల పరిస్థితుల బయటకు వెల్లడి కాకుండానే పోతాయని అన్నారు. ఇప్పటివరకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం ప్రకారం సగటున పదేళ్ళలో వర్షపాతం కొరత వుండి, పంట దిగుబడి 50శాతం కన్నా తక్కువ వుంటే ఆ ఏడాది కరువు సంవత్సరంగా ప్రకటిస్తూ వచ్చింది. ఆ విధానాన్నే లెక్కలోకి తీసుకుంటే మహారాష్ట్రలో 9వేల గ్రామాలు కరువు వాత పడినట్లే. కానీ అధికారికంగా ఈ 9వేల గ్రామాలు కూడా కరువు వాత పడిన గ్రామాల జాబితాలో లేవు. ఎందుకంటే గత అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర కొత్త నిబంధనలకు అనుగుణంగా కొత్త ప్రామాణికాలను అమలు చేసింది. దీంతో వాస్తవంగా ఇక్కడ కరువు నెలకొన్నా అధికారికంగా కరువు లేదని రికార్డుల్లోకి ఎక్కింది. ఇది రైతాంగాన్ని మరింత కుంగదీస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రాలు తమ సొంత పద్ధతుల్లో కరువును అంచనా వేసేవి. వాటికి కేంద్ర సాయం కోరేవి, కానీ తాజా పరిస్థితుల్లో కరువు ప్రాంతానికి కేంద్రం అందించే సాయానికి అర్హత రావాలంటే కేంద్రం విధించిన నాలుగు ప్రధాన సూచికల్లో కనీసం మూడింటిని నిరూపించాల్సి వుంటుంది. దాంతో రైతులు మరింత ఇక్కట్లకు లోనవుతున్నారు.



ప్రధాని విదేశీ పర్యటనలో ప్రతినిధుల పేర్లు వెల్లడించండి

పిఎంఓను ఆదేశించిన చీఫ్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్రమోడి జరిపే విదేశీ పర్యటనల సందర్భంగా ఆయన వెంట వెళ్ళే ప్రతినిధి బృందంలోని సభ్యుల పేర్లు కూడా వెల్లడించాలని చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ (సిఐసి) ఆర్‌కె మాథుర్ ఆదివారం ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఓ)ను ఆదేశించారు. దేశ భద్రత సాకుగా సమాచారాన్ని వెల్లడించలేమన్న పిఎంఓ అభ్యంతరాన్ని మాథుర్ తోసిపుచ్చారు. దీనికి సంబంధించి దాఖలైన రెండు వేరు వేరు కేసులను మాథుర్ విచారణ జరుపుతున్నారు. అందులో భాగంగా భద్రతా సిబ్బంది, ప్రధాన మంత్రి భద్రతా వ్యవహారాలతో సంబంధాలున్న వ్యక్తుల పేర్లను వెల్లడించలేకపోయిన ఫర్వా లేదంటూ మాథుర్ మినహాయింపునిచ్చారు. అయితే భద్రతతో సంబంధం లేని ప్రభుత్వేతర వ్యక్తులు ప్రధాన మంత్రితో పాటు విదేశీ పర్యటనలకు వెళ్లే వారి వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలని మాథుర్ చెప్పారు. ప్రధాన మంత్రి విదేశీ పర్యటనలు జరుపుతున్న సమయంలో ఆయన వెంట వెళ్ళే ప్రతినిధి సభ్యుల వివరాలను సమాచార హక్కు చట్టం కింద కోరుతూ నీరజ్ శర్మ, అయూబ్ అలీ అనే సామాజిక కార్యకర్తలు సిఐసికి దరఖాస్తు చేశారు. దీంతో సిఐసి ఈ కేసులను పరిశీలిస్తున్నారు.

యాసిడ్ దాడి బాధితులకు కేంద్ర ఉద్యోగాలలో రిజర్వేషన్లు

న్యూఢిల్లీ : మానసిక అనారోగ్యం, మేధో వైకల్యం కలిగిన వారితో పాటు యాసిడ్ దాడి బాధితులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు పొందనున్నారు. ఒక అధికారిక ఉత్తర్వు ఆదివారం ఈ విషయాన్ని తెలిపింది. నేరుగా నియామకాలు జరిపే ఉద్యోగాలకు సంబంధించి ఎ,బి,సి గ్రూపులకు ప్రస్తుతం రిజర్వు చేసిన 3 శాతం కన్నా మించి నాలుగు శాతం ఖాళీలను అంగవైకల్యం కలిగిన వారికి కేటాయించనున్నట్లు ఆ ఉత్తర్వులు తెలిపాయి. ఒక వ్యక్తికి నిర్థిష్టమైన అంగవైకల్యం 40 శాతం కన్నా తక్కువ ఉండరాదు. అలా ఉన్న వారికి మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తుందని ఆ ఉత్తర్వులు పేర్కొన్నాయి. అంధత్వం, హ్రస్వ దృష్టి, చెవిటి, మెదడు పక్షవాతం, మరుగుజ్జు, యాసిడ్ దాడి బాధితులు, కండరాల బలహీనత తదితర వైకల్యాలు ఉన్నవారికి ప్రతి నియామకంలోనూ ఒక శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఆదేశిస్తూ సిబ్బంది శిక్షణ విభాగం (డిఓపిటి) ఇటీవల కేంద్ర ప్రభుత్వ శాఖలన్నిటికీ లేఖ రాసింది. అలాగే ఆటిజం, మేధో వైకల్యం, మానసిక అనారోగ్యం తదితరాలతో బాధపడుతున్న వారికి కూడారిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. 2016 నాటి అంగవైకల్యం కలిగిన వ్యక్తుల హక్కుల చట్టం ఆమోదం పొందిన తరువాత యాసిడ్ దాడి బాధితులకు, నేర్చుకోవడంలో లోపం ఉన్న వారికి రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఎంఆర్‌ఐ స్కానింగ్ మిషన్‌లో ఇరుక్కొని వ్యక్తి మృతి

ముంబయి : ఎంఆర్‌ఐ స్కానింగ్ మిషన్‌లో ఇరుక్కొని రాజేష్ అనే వ్యక్తి మృతి చెందిన ఘటన మహారాష్ట్రలోని ముంబయి నాయర్ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. తన బంధువులకు స్కానింగ్ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఆసుపత్రి వార్డ్ బాయ్ ఆక్సిజన్ సిలిండర్ తీసుకురావలని కోరగా ఈ ప్రమాదం జరిగినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. దీనితో వార్డ్‌బాయ్‌ను సస్పెండ్ చేశారు. మెటాలిక్ వస్తువులైన ఆభరణాలు, మెటాలిక్ ఫైబర్స్, దారాలు, జిప్పులు, బటన్, హుక్స్ వంటివి ఎంఆర్‌ఐ గదిలోకి అనుమతించబడవు. అయిన ప్పటికీ వార్డ్‌బాయ్ రాజేష్‌ను ఆక్సిజన్ సిలిండర్ తీసుకురావాలని కోరగా, ఎంఆర్‌ఐ స్కానింగ్ రూమ్‌లోకి తీసుకు వచ్చారని, దీనితో అయస్కాంతం శక్తి ఉన్న ఎంఆర్‌ఐ స్కానింగ్ మిషన్ సిలిండర్‌తో పాటు రాజేష్ లాక్కొందని, బయటకు తీసి ఎమర్జెన్సీ వార్డుకు పంపిన పది నిమిషాల్లోనే మృతి చెందారని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తుకు ఆదేశించామని, నివేదిక తర్వాత చర్యలు తీసుకొంటామని ఆసుపత్రి డీన్ పేర్కొన్నారు. ఆసుపత్రి వార్డ్ బాయ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పకోడి అమ్ముకోవడం ఉపాధి అయితే.... యాచన కూడా ఉపాధే : చిదంబరం

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉపాధి కల్పనలో విఫలమయ్యారని మాజీ కేంద్ర మంత్రి ,, సీనియర్ కాంగ్రెస్ నేత పి. చిదంబరం అన్నారు. ఈ విషయంలో మోడీపై ఆయన మండి పడ్డారు. దీనికి సంబంధించి ఆదివారం పలు ట్వీట్లు చేశారు. పకోడీలు అమ్మోకోవడం ఉపాధి అయితే, యాచన కూడా ఒక విధమైన ఉపాధేనని ట్వీట్ చేశారు. జీవించడం కోసం యాచిస్తున్న పేదలను, అంగవైకల్యం గల వారిని లెక్కించి వారిని కూడా ఉద్యోగులుగా గుర్తించాలని వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. ఇటీవల మోడీ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒక వ్యక్తి పకోడీలు అమ్ముకుని సాయంత్రానికి ఇంటికి రూ.200 తీసుకెళ్తే దానిని ఉపాధి అంటామా? లేదా? అంటూ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై చిదంబరం మండి పడ్డారు. మార్కెట్‌లో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. వాస్తవంగా ఉపాధి కల్పన జరిగితే అది ప్రైవేటు పెట్టుబడులు, ప్రైవేటు వినియోగం, ఎగుమతులు, క్రెడిట్ డిమాండ్ తదితరాలలో ప్రతిబింబిస్తుందని, అటువంటిదేదీ ఇప్పటి వరకు జరగలేదని చిదంబరం అన్నారు. వాస్తవమేమంటే మూడేళ్ళ మోడీ పాలనలో ఉద్యోగాలు లేవు, వృద్ధి లేదు, ఉపాధి ఎలా కల్పించాలో ప్రభుత్వం వద్ద తగిన విధానాలు లేవంటూ చిదంబరం అన్నారు. ముద్ర పథకం కింద ఇస్తున్న రుణం రూ.43 వేలతో ఒక కొత్త ఉద్యోగాన్ని సృష్టించ వచ్చునని మోడీ చెప్పడాన్ని గుర్తు చేస్తూ ఆ రుణంతో కొత్త ఉద్యోగాన్ని సృష్టించిన వారెవరో తనకు చూపాలని చిదంబరం అన్నారు. ముద్ర రుణ పథకంపై పలు సందేహాలు లేవనెత్తారు.



పాల్క్యాండ్ దీవుల చుట్టిన ఐఎస్ఎన్‌వి తరిణీ బృందం

లండన్ : సముద్ర మార్గం గుండా ప్రపంచాన్ని చుట్టి చరిత్ర సృష్టించాలని నిర్ణయించుకున్న భారత మహిళా నావికా దళ సెయిలింగ్ బృందం ఆ దిశగా పయనమవుతున్నారు. ఆదివారానికి బ్రిటన్‌లోని ఫాల్క్యాండ్ దీవుల రాజధాని పోర్ట్ స్టాన్లీని చుట్టివచ్చారు. భారత నావికా దళానికి చెందిన ఆరుగురు మహిళలు సెప్టెంబర్ 10న ఐఎన్ఎస్‌వి తరిణీలో గోవా నుండి తమ ప్రయాణాన్ని ప్రారంభించారు. వారు ఈ ప్రయా ణాన్ని ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఐఎన్ఎస్‌విలో 15వేల నాటికల్ మైల్స్ ప్రయాణించిన ఈ బృందం ఈవారం పోర్ట్ స్టాన్లీ దగ్గరకు చేరుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఈ బృందం కేప్‌హార్న్ చుట్టి వచ్చిన సంగతి తెలిసిందే.

టాటూ ఉంటే ఉద్యోగం ఊడుతుంది

ఢిల్లీ కోర్టు



న్యూఢిల్లీ : వైమానిక దళంలో ఉద్యోగార్థి తన శరీరంపై వేయించుకున్న టాటూ నిబంధనలకు అనుగుణంగా లేకపోతే ఆ ఉద్యోగాన్ని కోల్పోవలసి వస్తుందని ఢిల్లీ కోర్టు తేల్చి చెప్పింది. ఎయిర్‌మెన్‌గా ఎంపికైన ఒక అభ్యర్థి నియామకాన్ని వైమానిక దళం రద్దు చేసింది. దీనికి కారణం ఆ అభ్యర్థి తన ముంజేయిపై టాటూ వేయించుకోవడమే. దీంతో ఆ అభ్యర్థి కోర్టును ఆశ్రయించాడు. ఈ విషయంలో కోర్టు కూడా వైమానిక దళాన్నే సమర్థించింది. గిరిజనులతో సహా తమ ఆచార, సాంప్రదాయల ప్రకారం టాటూ ధరించే వారికి వైమానిక దళం మినహాయింపునిచ్చింది. కొన్ని ప్రత్యేకమైన టాటూలు ఉంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఆ అభ్యర్థి శరీరంపై ఉన్న టాటూ వైమానిక దళం ఇచ్చిన మినహాయింపులకు లోబడి లేదని, ఉద్యో గానికి దరఖాస్తు చేసుకునే సమయంలో టాటూకు సంబంధించిన ఫొటోను జత చేయమని కోరగా అలా చేయలేదని కోర్టు పేర్కొంది. దీంతో అ అభ్యర్థిని ఉద్యోగం నుంచి తొలగించడం సబబే అని జస్టిస్ హిమ కోహ్లి, రేఖ పల్లితో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. ముంజేతులపై లోపలికి చూసే విధంగాను, చెయ్యి వెనక భాగాన అర చేతికి వెనుక వైపున టాటూ కలిగిన గిరిజనుల విషయంలోనూ వైమానిక దళం మినహాయింపునిచ్చింది. ఒక అభ్యర్థిని ఉద్యోగానికి ఆమోదించాలా, వద్దా అనే విషయం ఎంపిక కమిటీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని కోర్టు పేర్కొంది.

నాగాలాండ్ ఎన్నికలను వాయిదా వేయాలన్న కోర్‌కమిటీ

కొహిమా : దీర్ఘకాలిక నాగ తిరుగుబాటు కు త్వరిత పరిష్కారం కోసం ఫిబ్రవరి 27న జరిగే నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలను వాయిదా వేయాలని నాగాలాండ్ ట్రైబల్ హెూహెూస్ సివిల్ ఆర్గనైజేషన్స్ కోర్ కమిటీ (సిసిఎన్‌స్ ఓసి) శనివారం ఎన్నికల కమిషన్ (ఇసి)కు విజ్ఞప్తి చేసింది. నాగాలాండ్ రాజకీయ సమస్య పై శాంతియుత తీర్మానం కోసం రాజకీయ చర్చలు ముందస్తు దశలో ఉన్నందున ఇప్పుడు ఈ ఎన్నికల ప్రక్రియలో తాము దృష్టి పెట్టలేమని కోర్‌కమిటీ చీఫ్ ఓ.పి. రావత్ ఎన్నికల కమీషనర్‌కు లేఖ రాశారు. నాగ సమస్య పరిష్కారానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చాలా కతనిశ్చయంతో ఉన్నట్లు లేఖలో కమిటీ పేర్కొంది. నాగ చర్చల బృందాలతో పాటు భారత ప్రభుత్వ ప్రతినిధి ఆర్.ఎన్. రవి కూడా కష్టపడి పనిచేశారని, వెంటనే చర్చలు ముగిం చడానికి కృషి చేస్తున్నారని కమిటీ పేర్కొంది.



కర్ణాటకలో 150 స్థానాలకు హిందూ మహాసభ పోటీ

బెంగళూరు : కర్ణాటకలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 150 స్థానాలకు పోటీ చేయనున్నట్లు అఖిల భారత హిందూ మహాసభ ప్రకటించింది. మహాసభ తరుపున పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను ఫిబ్రవరి మాసాంతానికి విడుదల చేయనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. సుబ్రహ్మణ్య రాజు మంగుళూరులో శనివారం విలేకరులకు తెలిపారు. అటు సైద్ధాంతికంగాను, ఇటు రాజకీయంగాను బిజెపిని తన మిత్ర పార్టీగా మహాసభ పరిగణించదని ఆయన అన్నారు. దీర్ఘకాలంగా ఉన్న తన హిందూ భావజాలాన్ని బిజెపి వదిలేసిందని ఆయన చెప్పారు. ముఖ్య మంత్రి సిద్ధరామయ్య తిరిగి అధికారంలోకి వచ్చేందుకు మైనార్టీలను బుజ్జగిస్తున్నారని ఆరోపించారు. ఈ విడత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని అన్నారు. ఎస్‌డిపిఐ, పిఎఫ్ఐ కార్యకర్తలపై కేసులను ఉప సంహరించు కున్నంత మాత్రాన కాంగ్రెస్ గెలుస్తుందనుకోలే మని రాజు చెప్పారు. రాష్ట్రంలోని దక్షణ కన్నడ జిల్లాలో ఉన్న 8 స్థానాల్లోనూ మహా సభ పోటీ చేస్తుందన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ఈ తరుణంలో హిందూ మహాసభ ఎన్నికల్లోకి రావడం అనివార్యమైందని ఆయన చెప్పారు. అధికార పార్టీ విధానాలను వ్యతిరేకించడంలో రాష్ట్రంలోని ప్రతిపక్ష బిజెపి ప్రభావవంతమైన పాత్రను పోషించడం లేదని విమర్శించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మెజార్టీగా ఉన్న హిందువులు కాంగ్రెస్‌ను ఓడిస్తారని ఆయన చెప్పారు.

త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు బిజెపి తొలి జాబితా విడుదల

న్యూఢిల్లీ : త్రిపురలో వచ్చే నెల 18న జరగనున్న శాసనసభ ఎన్నికల కోసం బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాను చేసింది. ఆ పార్టీ పోటీ చేయనున్న 51 శాసనసభ స్థానాలకు గాను 44 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. శనివారం న్యూఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అధ్యక్షతన జరిగిన సమావేశంలో అభ్యర్థుల పేర్లను ఖరారు చేశారు. మిగతా ఏడు స్థానాలకు అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామని అమిత్ షా తెలిపారు. గతేడాది పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు మొదటి జాబితాలోనే స్థానం లభించింది. రాష్ట్రంలో ఎస్టీ రిజర్వ్ స్థానాలు 20 ఉండగా 11 స్థానాల్లోనే పార్టీ పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. మిగతా 9 స్థానాలను పొత్తులో భాగంగా ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) పోటీ చేస్తుందని తెలిపారు.

జమ్మూ కాశ్మీర్‌లో బంద్

స్తంభించిన జన జీవనం

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్‌లో ఆదివారం వేర్పాటువాదుల బంద్‌తో జనజీవనం స్తంభించింది. రాష్ట్రంలోని సోఫియన్ జిల్లాలో శనివారం సైన్యం జరిపిన కాల్పుల్లో ఇద్దరు పౌరులు మృతి చెందారు. వీరి మృతికి నిరసిస్తూ వేర్పాటు వాదులు ఆదివారం బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో రాష్ట్రంలో సాధారణ జన జీవనం స్తంభించింది. శ్రీనగర్‌లోని కొన్ని ప్రాంతాలలో అధికారులు ఆంక్షలు విధించారు. దాదాపు 4 జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు రద్దు చేశారు. కాశ్మీర్‌లోని పలు ప్రాంతాలలో దుకాణాలు, వాణిజ్య సంస్థలు మూత పడ్డాయి. ప్రభుత్వ రవాణా రంగానికి చెందిన బస్సులు కూడా నడవలేదని అధికారులు తెలిపారు. నగరంలోని సివిల్ లైన్స్ ప్రాంతంలో రోడ్ల పై ప్రైవేటు వాహనాలు రాకపోకలు సాగించాయి. సోఫియన్ జిల్లాలోని గనొవ్‌పొరా వద్ద రాళ్ళు రువ్వుతున్న కొంతమందిపై భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు యువకులు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. కొంతమంది జవాన్లపై రాళ్ల రువ్విన సంఘటనలో పలువురు జవాన్లు గాయపడ్డారని రక్షణ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. వాహనాలు ధ్వంస మయ్యాయన్నారు. దీంతో సైనికులు స్వీయ రక్షణ కోసం కాల్పులు జరపాల్సివచ్చిందని ఆయన చెప్పారు. నగరంలోని సఫకదల్, ఖన్యార్; రౌహట్టా, రైనవారి, ఎంఆర్ గంజ్ పోలీసు స్టేషన్ల పరిధిలో శాంతి భద్రతలను నియంత్రించేందుకు కొన్ని చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. పుల్వామా, అనంత్ నాగ్, కల్గామ్, సోఫియన్ జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను అధికారులు రద్దు చేశారు.



ప్రత్యేకం

అమెరికాలో ఎటిఎంలతో హ్యాకర్స్ 'జాక్‌పాటింగ్'

వాషింగ్టన్ : ప్రస్తుతం అమెరికాలో ప్రజల ఆర్థిక అవసరాలను తీరుస్తున్న ఎటిఎంలను గెలుపు సాధక యంత్రాలు (విన్నింగ్ స్లాట్ మెషీన్స్) గా మార్చేందుకు హ్యాకర్లు సిద్ధమవుతున్నారు. తద్వారా ఐరోపా, ఆసియా దేశాలలో ఇటీవల బ్యాంకింగ్ రంగంలో చోటు చేసుకున్న 'జాక్‌పాటింగ్' దాడుల వంటివి అమెరికాలో కూడా కొనసాగే అవకాశాలున్నాయన్న సంకేతాలు కన్పిస్తున్నాయని సైబర్ భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణగా ఎటిఎం చోరులు డెబిట్ కార్డుల సమాచారాన్ని తస్కరించేందుకు స్కిమ్మింగ్ పరికరాలను ఉపయోగిస్తుంటారన్న విషయం తెలిసిందే. అయితే తాజాగా తలెత్తుతున్న 'జాక్‌పాటింగ్' అమెరికా ఆర్థిక సంస్థలకు రానున్న కాలంలో అత్యంత అధునాతన సాంకేతిక సవాళ్లను విసిరే ప్రమాదం ముంచుకొస్తోందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవలో వెలుగులోకి వచ్చిన ఒక సైబర్ దాడి అమెరికాలో చోటు చేసుకున్న తొలి 'జాక్‌పాటింగ్' ఉదంతమని డిజిటల్ భద్రతా నిపుణుడు, వాషింగ్టన్ పోస్ట్ మాజీ పాత్రికేయుడు బ్రియాన్ క్రెబ్స్ వెల్లడించారు. ప్రస్తుతానికి ఈ తరహా దాడుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించటం సురక్షితమని ఆయన చెబుతున్నారు. రానున్న కొద్ది రోజుల్లో ఈ 'జాక్‌పాటింగ్' దాడులు జరిగే అవకాశం వున్నట్లు అమెరికా సీక్రెట్ సర్వీస్ ఇటీవల ఆర్థిక సంస్థలను హెచ్చరించిందని క్రెబ్స్ తన వెబ్‌సైట్‌లో వెల్లడించారు. అయితే ఇందుకు సంబంధించిన వివరాలను సీక్రెట్ సర్వీస్ వెల్లడించలేదన్నారు. అమెరికాకు చెందిన ఎటిఎం తయారీ సంస్థ ఎన్‌సిఆర్ కార్పొరేషన్, దాని వినియోగదారులకు పంపిన ఓ హెచ్చరికను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అమెరికాలో సైబర్ దాడుల్లో సంభవించిన నష్టాలకు సంబంధించిన తొలి కేసుగా దీనిని పరిగణించవచ్చని ఈ హెచ్చరికలో పేర్కొన్నారు. ఇటువంటి దాడులు, వీటి దుష్పరిణామాల నుండి తమ ఎటిఎంలను రక్షించుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ హెచ్చరిక ఆర్థిక సంస్థలకు సూచించిందని ఆయన వివరించారు. హ్యాకర్లు ఎటిఎంలను రిమోట్ కంట్రోల్ సాయంతో వైరస్ దాడికి గురి చేయటం లేదా వాటి హార్డ్ డ్రైవ్‌ల సమాచారాన్ని తస్కరించటం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అయితే అమెరికాలో ఇటువంటి దాడులు ఏ విధంగా వుంటున్నాయన్న అంశంపై స్పందించేందుకు సీక్రెట్ సర్వీస్ వర్గాలు అందుబాటులోకి రాలేదు. 2010లో వెలుగులోకి వచ్చిన ఈ ఎటిఎంలపై జాక్‌పాటింగ్ దాడులు తొలుత చిన్నతరహా నేరాల స్థాయిలోనే వున్నప్పటికీ 2016లో ఇవి తారస్థాయికి చేరుకున్నాయి. జపాన్‌లోని ఎటిఎంల నుండి ఒక గ్యాంగ్ మూడు గంటల వ్యవధిలో 1.3 కోట్ల డాలర్ల విలువైన నగదును తస్కరించటం ఇందుకు తాజా ఉదాహరణగా చెప్పవచ్చు. డెబిట్, క్రెడిట్ కార్డులను జారీ చేసే ప్రముఖ సంస్థ వీసా ఈ ఆసియన్ దాడులపై జారీ చేసిన హెచ్చరిక వీటిని మరింత సమగ్రంగా వివరిస్తోంది. ముందుగా హ్యాకర్లు బ్యాంకులకు చెందిన అన్ సెక్యూర్డ్ టెలిఫోన్ వ్యవస్థను తమ ఆధీనంలోకి తీసుకుని, దాని ద్వారా ఎటిఎంలకు రొటీన్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ తరహాలో మాల్‌వేర్ ప్రోగ్రామ్‌ను అప్‌డేట్ చేస్తున్నారని వీసా తన హెచ్చరికలో వివరించింది. ఈ ప్రోగ్రామ్ అప్‌డేట్స్‌ను అందుకున్న ప్రతి ఎటిఎం హ్యాకర్ల ఆధీనంలోకి వెళ్లిపోతుందని వెల్లడించింది. ఈ ఎటిఎంలు నగదు తీసుకోవటానికి మినహా మరెందుకు పనికిరావని తెలిపింది. 2016 చివరి నాటికి జాక్‌పాటింగ్ ఐరోపా వ్యాప్తంగా దాదాపు డజనుకు పైగా దేశాలను చుట్టుముట్టినట్లు మీడియా వెల్లడించింది. రానున్న కొద్దిరోజుల్లో అమెరికన్ బ్యాంకింగ్ వ్యవస్థ కూడా ఈ దాడుల బారిన పడవచ్చని ఎఫ్‌బిఐ హెచ్చరించినట్లు తెలుస్తోంది.



సంక్షిప్తం

ఇక ట్రెండింగ్ న్యూస్‌పై నిఘా

న్యూఢిల్లీ : జిల్లా స్థాయిలో ట్రెండింగ్ వార్తలపైన పరిమితులు విధించేందుకు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలపై ఫీడ్‌బాక్ తీసుకునేందుకు ఒక సోషల్ మీడియా కమ్యూనికేషన్ హబ్‌ను ఏర్పాటుచేయాలని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ యోచిస్తున్నది. ఈ ప్రాజెక్టు కింద జర్నలిస్టులను కాంట్రాక్టు పద్ధతిలో ప్రతి జిల్లాలోనూ నియమిస్తారు. వీరు ప్రభుత్వానికి కళ్ళు, చెవులు లా పని చేయాల్సి ఉంటుంది. క్షేత్ర స్థాయిలో వాస్తవిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అందించాలని ఒక అధికారిక వర్గం తెలిపింది.

నలుగురు పిల్లలు సజీవ సమాధి

ఇద్దరు సోదరులతో సహా నలుగురు పిల్లలు అటవీ అధికారులు తవ్విన గొయ్యిలో పడి సజీవ సమాధి అయ్యారు. ఈ విషాదకర ఘటన రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలో ఆదివారం చోటు చేసుకుంది. జిల్లా అటవీ అధికారి రాజేంద్ర హుడా తెలిపిన వివరాల ప్రకారం.. అటవీ ప్రాంతంలోకి పశువులు, ఇతర జంతువులు పోకుండా ఆరేండ్ల క్రితం చుట్టూ తవ్వించి, ఫెన్సింగ్ వేయించారు. పిల్లలు అక్కడే ఆడుకుంటూ ఉండగా క్రమ క్రమంగా మట్టిమీద పడిపోయింది. అక్కడే ఉన్న కొందరు గమనించి, బయటకు తీసి ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించారు.

దీంతో కుటుంబాలలో ఒక్కసారిగా విషాద ఛాయలు అనుముకున్నాయి. మృతి చెందిన పిల్లలు దగ్గర్లోని మురికివాడలో నివసిస్తున్నారు. ఆ గుంట చుట్టు ఫెన్సింగ్ ఉండగా, వారు దాన్ని దాటి ఎలా ప్రవేశించారో దర్యాప్తు చేస్తున్నామని హుడా తెలిపారు.

సీనియర్ కాంగ్రెస్ నేతలు సలహాదారులుగా ఉండాలి

కోల్‌కతా : సీనియర్ కాంగ్రెస్ నేతలు ప్రస్తుతం సలహాదారులుగా వ్యవహరించాలని, వేధింపుదారులుగా వ్యవహరించొద్దని పార్టీ నేత జైరాం రమేష్ అన్నారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందే యువకులకు పార్టీ పగ్గాలు అందుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందనడానికి గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఒక సంకేతమన్నారు.

కాబూల్‌లో దాడిలో 95కు చేరిన మృతుల సంఖ్య

కాబూల్ : ఆఫ్ఘన్ రాజధాని కాబూల్ నగరంలో శనివారం రాత్రి జరిగిన అంబులెన్స్ బాంబుదాడిలో మరణించిన వారి సంఖ్య ఆదివారం ఉదయానికి 95కు చేరింది. క్షతగాత్రుల్లో మరికొంత మంది పరిస్థితి విషమంగా వుందని ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రతినిధి వహీద్ మజ్రూహ్ చెప్పారు. ఈ దాడిలో మరణించిన వారిలో అధికశాతం మంది సాధారణ పౌరులేనని హోం మంత్రిత్వశాఖ ప్రకటించింది. తాలిబన్‌లు, హక్కానీ నెట్‌వర్క్ మిలిటెంట్లే ఈ దాడికి బాధ్యులని ఆఫ్ఘన్ హోం మంత్రిత్వశాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

అరుదైన కలయిక

టర్కీకి చెందిన ప్రపంచంలోని అతి పొడవైన వ్యక్తి సుల్తాన్ కొసెన్ ప్రపంచంలోనే అత్యంత పొట్టి మహిళ అయిన భారత్‌కు చెందిన జ్యోతి అంగేను ఈజిప్టు నగరం గిజాలో కలుసుకొని ఫోటోలకు ఫోజులిచ్చారు. తమ పర్యాటక రంగ ప్రమోషన్ కోసం ఈజిప్టు ప్రభుత్వ అధికారులు వీరిని పిలిపించారు.




పొడగరి వ్యక్తి.. పొట్టి మహిళ కలిసిన వేళ...!

గిజా(ఈజిప్ట్) : దాదాపు ఎనిమిదడుల తొమ్మిదంగుళాల ఎత్తుతో ప్రపంచంలో అత్యంత పొడగరి మనిషిగా గిన్నిస్ రికార్డులకెక్కిన టర్కీ వ్యక్తి సుల్తాన్ కోసెన్, రెండడుగుల ఆరంగుళాల ఎత్తుతో అత్యంత పొట్టి మహిళగా రికార్డులకెక్కిన నాగపూర్‌కు చెందిన ఆమ్గే అనే మహిళను కలుసుకున్నాడు. వీరిరువురూ ఈజిప్ట్‌లోని నైలు నదీతీరంలో కలుసుకున్నారని స్ట్రెయిట్ టైమ్స్ పత్రిక వివరించింది.దేశంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించటం కోసం ఈజిప్ట్ టూరిజం ప్రమోషన్ బోర్డ్ వీరిరువురిని ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఈ పొడుగు, పొట్టి జంట కలయిక ఫొటోగ్రాఫర్లను, పర్యాటకులను విశేషంగా ఆకర్షించింది.

వీరికి సంబంధించిన చిత్రాలను సోషల్ మీడియాలో అనేక మంది ట్వీట్ చేయటంతో పాటు రిట్వీట్ కూడా చేశారు. 36 ఏళ్ల కోసెన్ ఇంత ఎత్తు పెరగటానికి అతడిలో చోటు చేసుకున్న పిట్యూటరీ జిగాంటిజమ్ అనే లక్షణం కారణమని తెలుస్తోంది. 2009లో అతడు ప్రపంచంలోనే అత్యంత పొడగరిగా రికార్డులకెక్కాడు. ఇప్పుడు చరిత్రలో ఎనిమిదడుగులు, అంతకు మించిన ఎత్తున్న వారిలో ఒకడిగా కొనసాగుతున్నాడు. ఆమ్గే పొట్టితనానికి కారణం ఆమె శరీరంలోని అకొండ్రో ప్లాజియా అనే లక్షణం. 25 ఏళ్ల వయస్సున్న ఆమె ఇప్పటికి నిల్చుంటే రెండేళ్ల చిన్నారి మాదిరిగా కన్పిస్తుంది. ఆమె బిగ్‌బాస్, అమెరికన్ హర్రర్ స్టోరీ వంటి టీవీ షోలలో కూడా కన్పించింది.

'వెనిజులా అంటే మేమే..'

అధ్యక్షుడు మదురో కొత్త ఉద్యమం



కారకాస్ : త్వరలో జరుగనున్న అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో 'వెనిజులా అంటే మేమే (వుయార్ వెనిజులా) అన్న ఉద్యమానికి తెరదీశారు. దీనిని త్వరలోనే రాజకీయ పార్టీగా రిజిస్టర్ చేయనున్నట్లు ఆయన చెప్పారు. తన నేతృత్వంలోని యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనిజులా సమావేశం అనంతరం ఆయన సోషల్ మీడియాలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ రాజకీయ ఉద్యమానికి ప్రస్తుత జాతీయ రాజ్యాంగ అసెంబ్లీ ఛైర్‌పర్సన్ డెల్సీ రోడ్రిగ్జ్ నేతృత్వం వహిస్తారని ఆయన చెప్పారు. దీనితో పాటు వచ్చే వారం ఏర్పాటు చేయనున్న అధ్యక్ష ఎన్నికల ప్రచార కమిటీ వివరాలను కూడా ఆయన వెల్లడించారు. దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ, ప్రతి నగగరంలోనూ ఇటువంటి ప్రచార కమిటీలను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు.

డాన్స్ క్లబ్‌లో కాల్పుల్లో 14 మంది మృతి

సావోపౌలో : ఉత్తర బ్రెజిల్‌లోని ఫోర్టలిజ నగరంలో శనివారం రద్దీగా ఉన్న డ్యాన్స్ క్లబ్‌లో అగంతకులు కాల్పులు జరపడంతో 14 మంది మృతి చెందారని అధికారులు పేర్కొన్నారు. గాయపడిన ఆరుగురిని ఆసుపత్రికి తరలించామని భద్రతా కార్యదర్శి ఆంద్రీ కోస్టా పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక ఉద్దేశం తెలియలేదని, మాదక ద్రవ్యాలకు చెందిన ముఠాల మధ్య జరిగిన గొడవలు ఈ ఘటనకు దారి తీసాయా అనే అంశంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు. సుమారు మూడు కార్లలో అగంతకులు డాన్స్ క్లబ్‌ను చుట్టూ ముట్టారని, భవనం ముందు కాల్పులు జరిపారని ప్రత్యక్షసాక్షి పేర్కొన్నారు.

నిరంతర పోరాటాలు-వాతావరణ మార్పులు

ఆఫ్రికాకు పెను సవాళ్లంటున్న ఐరాస

అడిస్ అబాబా : ఆఫ్రికా దేశాల పేదరికానికి ప్రధానంగా నిరంతర పోరాటాలు, వాతావరణ మార్పులే ప్రధాన కారణమని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అభిప్రాయపడ్డారు. 'ఆఫ్రికాలో పేదరికానికి తెర' (ఎండింగ్ హంగర్ ఇన్ ఆఫ్రికా) అన్న పేరుతో ఆఫ్రికా దేశాల సంఘం (ఆఫ్రికన్ యూనియన్) ఆధ్వర్యంలో ఇక్కడ జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబాటు తనాన్ని నిర్మూలించేందుకు నిరంత పోరాటాలకు తెరదించటంతో పాటు వాతావరణ మార్పులను సమర్ధవంతంగా ఎదుర్కొనే కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాల్సిన అవసరం వుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేదరికం క్రమంగా పెరుగుతోందని, ఇందులో ఆఫ్రికా అగ్రస్థానంలో వుందని అన్నారు. ఆఫ్రికా దేశాల మధ్య కొనసాగుతున్న నిరంతర పోరాటాలతో పాటు వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతో ఇక్కడి వ్యవసాయ రంగం, పశుసంపద ఉత్పాదకత పెనుముప్పును ఎదుర్కొంటున్నాయన్నారు. పేదరికంతో సంభవిస్తున్న ఆకలి చావులు నిరంతర పోరాటాలతో నలుగుతున్న దేశాలలోనే దాదాపు రెట్టింపు స్థాయిలో వున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులు, దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యత, పంటల దిగుబడిలో మార్పులు, వ్యవసాయ పంటలు, పశు ఉత్పత్తుల ధరలు పడిపోవటం వంటి అంశాలు ఇక్కడి వెనుకబాటు తనానికి ప్రధాన కారణమని ఆయన చెప్పారు. ప్రపంచంలో పోషకాహారం లభించని అనేక మంది ప్రజలు ఆఫ్రికాదేశాలలోనే నివశిస్తున్నారని, ఈ దేశాలన్నీ నిరంతర పోరాటంతో అభివృద్ధి నోచుకోని దేశాలేనని ఆయన స్పష్టం చేశారు. ఈ దేశాలలో పేదరికం, ఆకలి నిర్మూలనకు, శాంతి, మానవ హక్కుల పరిరక్షణకు ఐరాసతో చేతులు కలపాలని ఆయన ఆఫ్రికా దేశాల ప్రభుత్వాలు, ఆఫ్రికా యూనియన్‌కు విజ్ఞప్తి చేశారు. ఆఫ్రికాలో శాంతి, మానవ హక్కుల పరిరక్షణ వంటి అంశాలు ఇక్కడ స్థిరమైన అభివృద్ధి సాధనకు, వెనుకబాటు తనంపై పోరుకు కీలక ఆయుధాలని ఆయన స్పష్టం చేశారు. పోరాటాలు, సంక్షోభాలు కొనసాగుతున్న ప్రస్తుత సమయంలో పోషకాహారలోపం, ఆకలితో బాధపడుతున్న



ప్రజలను ఆదుకోవాల్సిన అవసరం వుందని,గౌరవప్రదమైన జీవితం గడిపే విధంగా వారికి అండగా నిలవాలని గుటెరస్ పిలుపునిచ్చారు. ఆహార అభద్రత, నిరంతర పోరాటాల మధ్య బంధాన్ని తెంచేందుకు ధరల స్థిరీకరణ, సామాజిక భద్రత లాంటి ముందు జాగ్రత్త చర్యలు అవసరమని ఆయన చెప్పారు. ఆఫ్రికా ఖండంలో పేదరిక నిర్మూలనకు ప్రాధాన్యతా రంగాలను కూడా ఆయన సూచించారు. మెరుగైన పాలన, అందరికీ సమాన స్థాయిలో సేవలు, సామాజిక భద్రతా చర్యలు, లింగ సమానత్వం, వర్గ ఆధారిత విధానాల వంటివి ఆఫ్రికా ఖండంలో స్థిరమైన శాంతికి, ఆకలి, పేదరిక నిర్మూలనకు దోహదడతాయని ఆయన చెప్పారు. వాతావరణ మార్పులను అడ్డుకునే ప్రక్రియను కూడా పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రోత్సహించాల్సిన అవసరం వుందని, ముఖ్యంగా స్థిరమైన వ్యవసాయం, పశుపోషణ, ఇతర వృత్తుల వారి జీవితాల మెరుగుదలపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గినియా అధ్యక్షుడు, ఆఫ్రికన్ యూనియన్ ప్రస్తుత ఛైర్మన్ అల్ఫా కోండె మాట్లాడుతూ ఆకలి, పేదరికం ఆఫ్రికన్ ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయన్నారు. ఆఫ్రికా ఖండం అభివృద్ధి సాధించాలన్న తమ ఆకాంక్షకు ఇది పూర్తి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. స్థిరమైన అభివృద్ధి సాధనకు, ఆహార భద్రతను పెంపొందిం చేందుకు జంతు వనరులకు, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు, ఆఫ్రికా ఖండంలో శాంతి, సుస్థిరతల సాధనకు పెట్టుబడులు పెట్టాలని ఆయన కోరారు.

చెక్ అధ్యక్షుడిగా మరోసారి జెమన్ ఎన్నిక

ప్రేగ్ : చెక్ రిపబ్లిక్ అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు మిలోస్ జెమన్ మరోసారి ఎన్నికయ్యారు. ఆదివారం నాడు జరిగిన ఎన్నికల్లో తాజాగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన తన ప్రత్యర్థి చెక్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మాజీ అధిపతి జిరి ద్రహోస్‌పై ఘన విజయం సాధించారు. తుది సమాచారం అందే సమయానికి 99 శాతం పోలింగ్ స్టేషన్లలో ఓట్లలెక్కింపు పూర్తి కాగా అధ్యక్షుడు జెమన్‌కు 51.6 శాతం ఓట్లు, ద్రహోస్‌కు 48.4 శాతం ఓట్లు లభించాయి. ఎన్నికల్లో ఓటమిని అంగీకరించిన ద్రహోస్ ఎన్నికల్లో విజయం సాధించిన జెమన్‌ను అభినందించారు. తాను రాజకీయాల్లోనే కొనసాగుతానన్న ద్రహోస్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు. ఇప్పటి వరకూ ఆయన కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా కెరీర్‌ను కొనసాగించారు. 2013లో తొలిసారిగా జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో దేశాధ్యక్షుడిగా ఎన్నికైన మాజీ ప్రధాని జెమన్ వామపక్ష విధానాలతో పాలన కొనసాగించారు.

సవరణలతో పారిస్ ఒప్పందం

సంతకానికి ట్రంప్ సంసిద్ధత? : బ్రిటన్ మీడియా వెల్లడి

లండన్ : 2015 నాటి పారిస్ వాతావరణ మార్పుల ఒప్పందానికి ప్రధాన సవరణలు చేస్తే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దానిపై సంతకం చేసేందుకు అంగీకరించే అవకాశం వుందని బ్రిటన్ మీడియా ఆదివారం నాడు తన వార్తా కథనాలలో వెల్లడించింది. ఈ ఒప్పందం నుండి తమ దేశం వైదొలగుతున్నట్లు ట్రంప్ గత జులైలో చేసిన ప్రకటనను ప్రపంచం మొత్తం ముక్తకంఠంతో ఖండించిన విషయం తెలిసిందే. గత ఒబామా సర్కారు కుదుర్చుకున్న ఈ ఒప్పందం అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు చేటు చేస్తుందంటూ, దీని నుండి తాము వైదొలగుతున్నట్లు ప్రకటించిన ట్రంప్ దీనిపై వెల్లువెత్తిన విమర్శలను పట్టించుకోకుండా తన నిర్ణయానికి కట్టుబడి ఒప్పందం నుండి వైదొలగిన విషయం తెలిసిందే. అయితే దీనికి తాము చేస్తున్న ప్రతిపాదనల మేరకు ప్రధాన సవరణలు చేస్తే దీనిపై సంతకం చేసేందుకు సిద్ధమని ఆయన ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. 'పారిస్ ఒప్పందం తమ దేశానికి ఒక విపత్తు' వంటిదేనని ఆయన ఈ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. దానిలో మార్పులు చేస్తే దానిని బలపర్చేందుకు తాము సిద్ధంగానే వున్నామని, ప్రస్తుత రూపంలో ఈ ఒప్పందం అమెరికాకు 'అన్యాయం' చేసే రీతిలో వుందని ఆయన అన్నారు. వాతావరణాన్ని ఛిద్రం చేస్తున్న కర్బన ఉద్గారాల విడుదలను 2030 నాటికి గణనీయంగా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామంటూ 2015 డిసెంబర్‌లో దాదాపు 197 దేశాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేసిన విషయం తెలిసిందే.

కొలంబియా పోలీస్ స్టేషన్‌పై బాంబు దాడి ఐదుగురి మృతి

బొగోటా : కొలంబియాలోని బరన్‌కిల్లా పోలీస్ స్టేషన్‌పై డ్రగ్ ట్రాఫికర్లు శనివారం రాత్రి జరిపిన బాంబు దాడిలో కనీసం ఐదుగురు పోలీసు అధికారులు మరణించారని, మరో 41 మందికి పైగా గాయపడ్డారని అధికారులు ఆదివారం నాడు వెల్లడించారు. పొరుగునే వున్న ఈక్వెడార్ సరిహద్దులోని ఒక చెక్‌పోస్ట్ వద్ద కారు బాంబు పేలిన కొద్ది గంటలకే ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు దాడుల మధ్య ఎటువంటి సంబంధమూ లేదని అధికారులు చెబుతున్నారు. కొలంబియాలో దాదాపు ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న సాయుధపోరుకు తెరదించాలని అధ్యక్షుడు జువాన్ మాన్యుయెల్ శాంటోస్ పిలుపునిచ్చిన కొద్ది రోజుల్లోనే ఈ రెండు దాడులూ జరగటం గమనార్హం. కొలంబియాలో చెలరేగుతున్న హింసకు ఎక్కువగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులే కారణమన్న ఆరోపణలు తరచు వినిపిస్తున్నాయి. పోలీస్ స్టేషన్‌లో అధికారుల సమావేశం జరుగుతున్న సమయంలో ఈ కారుబాంబు పేలిందని బరన్‌కిల్లా పోలీస్ కమాండర్ మరియానో బొటెరో చెప్పారు. 49 మంది అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారని, అందులో ఐదుగురు అదికారులు మరణించగా మరో 41 మందికి పైగా గాయపడ్డారని పోలీసు వర్గాలు వివరించాయి.

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వాలలో వ్యక్తి పూజ తగదు

వచ్చేటప్పుటు డిక్లరేషన్ ఇచ్చానన్నారు. మాజీ న్యాయమూర్తి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సోము కృష్ణమూర్తి, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, పిబి.సిద్ధార్థాలా కాలేజ్ ప్రిన్సిపల్ దివాకర్, అధిక సంఖ్యలో న్యాయవాదులు, స్థానికులు పాల్గొన్నారు.

అమరావతిలో మౌలిక సదుపాయాలకు రూ.40 వేల కోట్లు

ఒక్కరికీ ఆర్థిక, సాంకేతిక ఫలాలు అందించేందుకు ప్రజా కేంద్రీకృత వ్యూహాన్ని సిద్ధం చేసి ఈ సదస్సులో ప్రదర్శించాలన్నారు. ప్రజా సంతోష సూచిలో అమరావతిని అగ్రస్థానంలో నిలబెడతామన్నారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులకు భవిష్యత్తు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా ఇది నిలుస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు దావోస్‌లో పలువురు అంతర్జాతీయ నిపుణులతో సమావేశమైనట్లు చెప్పారు. ఆధునిక సాంకేతికత వినియోగించుకుంటే అభివృద్ధి, సంక్షేమ పథకాల్ని క్షేత్ర స్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు వీలుంటుందన్నారు. క్లౌడ్ మేనేజ్‌మెంట్ కృత్రిమ మేధ, డేటా ఎనాలసిస్, సైబర్ భద్రత, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ తదితర రంగాల్లో అమరావతి దేశానికే కేంద్రంగా మార్చాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. ఇంధన, పర్యావరణ, ప్రకృతి సేద్యం, ఆహార శుద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఉత్పాదక రంగం, సౌర విద్యుత్తు, విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాలు, ఆర్థిక, వ్యాపార రంగాల్లో అంతర్జాతీయంగా కీలక సంస్థలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టించడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో పురపాలక శాఖ మంత్రి పి,నారాయణ, సిఎం ప్రత్యేక కార్యదర్శి సతీష్‌చంద్ర, ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఎడిసి చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, ఇంధన, పెట్టుబడులు, మౌలికసదుపాయాల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, సీఆర్‌డీఏ స్పెషల్ కమిషనర్ రామ మనోహరరావు తదితరులు పాల్గొన్నారు.

కోవింద్‌కు తొలి సమావేశాలు

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సోమవారం పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారు. రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్ ఎన్నికైన తరువాత జరిగే తొలి బడ్జెట్ సమావేశాలు కావడంతో ఆయన తొలిసారి పార్లమెంట్ ఉభయ సభల ఉమ్మడి సమావేశంలో ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగం తరువాత ఆర్థిక సర్వే సభ ముందుకు వస్తుంది. తొలి విడత బడ్జెట్ సమావేశాలు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు జరుగుతాయి. ఫిబ్రవరి ఒకటిన బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు. కొంత విరామం తర్వాత మార్చి 5 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు రెండో విడత బడ్జెట్ సమావేశాలు కొనసాగనున్నాయి. సమావేశాలనిర్వహణపై శుక్రవారం జరిగిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో నిర్ణయించిన సిఫార్సులను ఇప్పటికే రాష్ట్రపతికి పంపించారు.

మళ్లీ తలాక్!

(మొదటిపేజీ తరువాయి)

బిల్లు ఇంకా లోక్‌సభలోనే ఆమోదం పొందలేదు. వీటితో పాటు ఇప్పటికే దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లును కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టేందుకు యోచిస్తోంది. ఈ బిల్లును ప్రతిపక్షాలు పూర్తి స్థాయిలో వ్యతిరేకిస్తోన్నాయి. సామాన్య మధ్యతరగతి ఖాతాదారులకు నష్టం చేకూరేలా ఈ బిల్లు ఉందని సిపిఎంతో పాటు ఇతర పక్షాలు ప్రకటించాయి. ఈ సమావేశాల్లో మొత్తం 38 బిల్లులను ప్రవేశపెట్టి, ఆమోదించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో మహిళ రిజర్వేషన్ బిల్లు లేదు. మహిళ రిజర్వేషన్ బిల్లు కూడా ఈ సమావేశాల్లోనే పెట్టాలని సిపిఎం నేత పి.కరుణాకరన్ డిమాండ్ చేశారు.

రెండు అఖిలపక్షాలు

పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై ఆదివారం రెండు అఖిల పక్ష సమావేశాలు జరిగాయి. తొలిత పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, కాంగ్రెస్ లోక్‌సభ, రాజ్యసభ నేతలు మల్లికార్జున ఖర్గే, గులాం నబీ ఆజాద్, జ్యోతిరాధిత్య సింధియా, సిపిఎం లోక్‌సభ పక్షనేత పి. కరుణాకరన్, ఎస్పీ నేత ములయం సింగ్ యాదవ్, నరేష్ అగర్వల్, జెడియు నేత నారాయణ్ సింఘా, ఎన్సీపి ఎంపి తర్విక్ అన్వర్, టిఎంసి డెరిక్ ఒ బ్రెన్, సుదీప్ బందోపాధ్యాయ, సిపిఐ నేత డి.రాజా, ఎంపి ఆర్జేడీ నేత జయ ప్రకాశ్ యాదవ్, డిఎంకె నేత కనిమొళి, అన్నాడిఎంకె నేత నవనీత్ క్రిష్ణన్, టిడిపి ఎంపిలు తోట నరసింహం, దేవేందర్ గౌడ్, సిఎం రమేష్, వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి, టిఆర్ఎస్ ఎంపి జితేంద్ర రెడ్డి, కేశవ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ పార్లమెంట్ నిర్వహణకు అన్ని పక్షాలు సహకరించాలని కోరారు. బడ్జెట్ సమావేశాలు చాలా ముఖ్యమైనవి, ప్రతిపక్షాలు ఇచ్చిన సూచనలను ప్రభుత్వం హృదయ పూర్వకంగా తీసుకుంటుందని అన్నారు. ప్రతిపక్షాలు దేశంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలపైన, దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపైన చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. నిరుద్యోగం, ధరలు పెరుగుదల, రైతాంగ సమస్యలు, వినియోగదారుల సమస్యలు వంటి సమస్యలపై ప్రతిపక్షాలు పట్టు పట్టాయి. అనంతరం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ నేతృత్వంలో రెండో అఖిల పక్ష సమావేశం జరిగింది.

విభజన హామీలపై టాస్క్ ఫోర్స్ : తోట నరసింహం,టిడిపి

విభజన హామీలపై టాస్క్ ఫోర్స్‌ని ఏర్పాటు చేయాలని టిడిపి ఎంపి తోట నరసింహం డిమాండ్ చేశారు. అఖిల పక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ "ప్రత్యేక ప్యాకేజికి చట్ట బద్దత కల్పించాలి. బడ్జెట్‌లో ఏపికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలి. విభజన చట్టంలో పేర్కొన్న హామీలు అమలుపరచాలి. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించేందుకు సమయం కేటాయించాలి. పోలవరం నిర్మాణానికి కేంద్రం త్వరితగతిన నిధులు అందించాలి. చట్టంలో పేర్కొన్న మేరకు అసెంబ్లీ నియోజక వర్గాల పెంపుపై ఈ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలి. ఐదేళ్లు మిత్రపక్షంగా కేంద్రానికి టిడిపి అండగా ఉంది. ఈ సమావేశాల్లో కూడా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజా ప్రయోజన బిల్లులన్నింటికీ మద్దతు ఇస్తాం" అని పేర్కొన్నారు.

ప్రత్యేక హోదా ఇవ్వాలి

- విజయసాయి రెడ్డి, వైసిపి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని వైసిపి నేత విజయసాయి రెడ్డి కోరారు. అఖిల పక్ష సమావేశ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్టు ఆయన తెలిపారు. రైల్వేజోన్ విషయంలో జాప్యం తగదని పేర్కొన్నారు. ఏపి పునర్విభజన చట్టంలోని వాగ్దానాలు అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. పోలవరం ప్రాజెక్టు ఖర్చును పూర్తిగా కేంద్రమే భరించాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావాలని కోరినట్టు తెలిపారు. మేము లేవనెత్తిన అంశాలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి నోట్ చేసుకున్నారని, ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందని భావిస్తున్నామని చెప్పారు. ఏపి రెవెన్యూ లోటును కేంద్రం పూర్తిగా పూడ్చలేదని చెప్పారు.

నిరుద్యోగంపై చర్చించాలి

- పి.కరుణాకరన్, సిపిఎం

దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలని సిపిఎం లోక్‌సభ పక్షనేత పి.కరుణాకరన్ డిమాండ్ చేశారు. అఖిల పక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం ఎక్కువైందని, చదుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తోన్న యువత ఎక్కువైయ్యారని అన్నారు. మోడీ 2014 ఎన్నికల్లో ఏడాదికి కోటి ఉద్యోగాలు ప్రకటిస్తామని యువతకిచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యపై ఈ సమావేశాల్లో చర్చించాలని, అందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అఖిల పక్ష సమావేశంలో కోరినట్లు తెలిపారు. దేశంలో రైతాంగం సమస్యలు సుడిగుండంలో కొట్టుమిట్టాడుతుందని, వ్యవసాయ రంగం సంక్షోభ కోరాల్లోకి నెట్టబడిందని అన్నారు. దేశంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలు, వ్యవసాయ సంక్షోభాన్ని నివారించేందుకు పార్లమెంట్‌లో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. న్యాయ వ్యవస్థలో వచ్చిన ప్రకంపనలపై కూడా చర్చించాల్సిన అవసరముందని ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపారు. దళిత, మైనార్టీలపై పెరిగిన దాడులు, కోరిగావ్‌లో దళితులపై జరిగిన దాడి వంటి అంశాలను కూడా అఖిల పక్ష సమావేశంలో లేవనెత్తినట్లు తెలిపారు. జమ్ముకాశ్మీర్, దేశంలో ఇతర ప్రాంతాల్లో శాంతి భద్రతలు క్షీణించాయని, ప్రజలకు రక్షణ కరువైందని అన్నారు. దేశంలో క్షీణించిన శాంతి భద్రతలపై పార్లమెంట్‌లో చర్చించాలని కోరారు.

మూడున్నర నెలల్లో... ఖర్చు రూ.580 కోట్లే!

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక గతేడాది సెప్టెంబర్ వరకు రూ.7200 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కొంత మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుగా భరించగా, కొంత మొత్తాన్ని కేంద్రం విడుదల చేసింది. అయితే జనవరి మధ్య వరకు ఈ ఖర్చు రూ.7779 కోట్లకు చేరుకుంది. అంటే దాదాపు మూడున్నర నెలల్లో ప్రాజెక్టుకు చేసిన ఖర్చు కేవలం 580 కోట్లుగానే ఉందని రికార్డులు చెబుతున్నాయి. అంటే నెలకు రెండొందల కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయారు. ఇంకా ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే కనీసం 45 వేల కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా. కేవలం కాఫర్ డ్యామ్ ఏర్పాటు ద్వారా నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, అది కూడా ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. ఇక పూర్తి అంచనా 58 వేల కోట్ల రూపాయలతో పనులు పూర్తి చేయాలంటే ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందోనని అధికారులు అభిప్రాయపడుతున్నారు.కాగా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇప్పటివరకు 13 వేల కోట్లరూపాయల్ని ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడించారు. గత సెప్టెంబర్ వరకు రూ.12,335 కోట్లు ఖర్చు చేయగా, జనవరి మధ్య నాటికి ఈ మొత్తం ఖర్చు 12,915 కోట్లకు చేరుకున్నట్లు వారు చెబుతున్నారు. మూడున్నర నెలల్లో మొత్తం ఖర్చుకు, జాతీయ హోదా వచ్చాక చేసిన ఖర్చుకు మధ్య తేడా కూడా కనిపిస్తోంది. అయితే దీనిపై అధికారులు వివరాలు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. పోలవరం ద్వారా నీటి విడుదలపై అధికారులు ఆకాశంలో విహరిస్తున్నట్లే కనిపిస్తోంది. తాజా నివేదికలో కూడా జూన్ నాటికి గ్రావిటీ ద్వారా ఆయకట్టుకు నీటిని అందిస్తామని అధికారులు చెబుతున్నారు. అంటే వారు చెబుతున్నదానికి కేవలం ఐదు నెలలే సమయం ఉంది. ఈ మధ్య కాలంలో పనులు ఎలా పూర్తి చేస్తారు, నీరు ఎలా ఇస్తారన్నది అర్థం కావడం లేదని నీటిపారుదల నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

పనుల పురోగతి అంతంతమాత్రమే

ఆర్థిక వ్యయ పరిస్థితి ఇలా ఉంటే పనుల పరిస్థితి కూడా మెరుగుపడడం లేదు. ఆగస్టు చివరి నాటికి మొత్తం పనుల్లో 50 శాతం పూర్తయినట్లు చెబుతున్న అధికారులు జనవరి నాటికి 53 శాతం పూర్తయినట్లు వెల్లడించారు. అంటే మూడున్నర నెలల కాలంలో కేవలం మూడు శాతం మాత్రమే పనులు జరిగినట్లు వారు అధికారికంగా అంగీకరించినట్టయ్యింది. ఇందులో కుడి ప్రధాన కాలువ పనులు అప్పటికీ, ఇప్పటికీ 91 శాతంగానే చూపించిన ప్రభుత్వం ఎడమ ప్రధాన కాలువ పనులను మాత్రం 57 శాతం నుంచి 60 శాతానికి పెరిగినట్లు చూపించారు. హెడ్‌వర్క్స్ కూడా 34 నుంచి 39శాతానికి, స్పిల్‌వే పనులు 72 నుంచి 73 శాతానికి పెరిగినట్లు చూపిస్తున్నారు. దీంతో వీటిల్లో కూడా మూడున్నర నెలల కాలంగా ఆశించిన పురోగతి లేదని స్పష్టమవుతోంది. ఒక్క డయాఫ్రాం పనుల పురోగతి మాత్రం 38 శాతం నుంచి 62 శాతానికి పెరిగినట్లు అధికారులు లెక్కలు చెబుతుండడం గమనార్హం.

సామాన్యులకు 'పద్మ'లు

(మొదటిపేజీ తరువాయి)

చేసిన పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.ప్రస్తుత పద్ధతి ప్రకారం ఏ వ్యక్తినైనా,ఎవరైనా ఆన్‌లైన్‌లో నామినేట్ చేయవచ్చని మోడీ తెలిపారు.

మోడీ ఒక వైపు జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో ప్రధాన మంత్రి కార్యాలయం న్యూస్ పేపర్లలోనూ, టెలివిజన్‌లలోనూ కనిపించని కొంతమంది పేర్లను ట్వీట్ చేసింది. వారు మాధ్యమాల్లో కనిపించక పోయినప్పటికీ పద్మ అవార్డులతో సత్కరించుకోగలిగిన పనులు చేశారని పేర్కొంది. ఈ ఏడాది పద్మ అవార్డుల గురించి చదివిన ప్రజలందరూ గర్వంగా భావిస్తారని మోడీ అన్నారు.

టిటిడిలో 'మతోన్మాదం'

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

ముస్లిం వనిత బీబీనాంచారిని వివాహమాడి పరమతసహనానికి శ్రీకారం చుట్టిన సెక్యులర్ దేవుడు తిరుమల శ్రీవారుగా చరిత్ర చెబుతోంది. అయితే అలాంటి చోట సంఘ్‌పరివారం మతోన్మాదాన్ని రెచ్చగొడుతోంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)లో హైందవేతర ఉద్యోగులు ఉన్నారంటూ రాద్ధాంతం చేసింది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఒత్తిళ్లకు తలొగ్గిన ఉన్నతాధికారులు దశాబ్దాల తరబడి శ్రీవారికి సేవలందించిన 45 మంది ఉద్యోగులకు టెర్మినేషన్ నోటీసులు ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అధికారుల తీరును టిటిడి ఉద్యోగ, కార్మిక సంఘాలతో పాటు ట్రేడ్ యూనియన్లూ తీవ్రంగా తప్పుబట్టింది. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని మరో అయోధ్యలా మార్చొద్దంటూ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే రిటైర్డ్ జిల్లా జడ్జి గురప్ప అధ్యక్షులుగా, టిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ గౌరవాధ్యక్షులు కందారపు మురళి కన్వీనర్‌గా టిటిడి ఉద్యోగుల పరిరక్షణ వేదిక ఏర్పాటైంది. ఏళ్లతరబడి సేవ చేసిన ఉద్యోగులను కేవలం మతం పేరుతో తొలగించాలనుకోవడం రాజ్యాంగ విరుద్ధమని గర్జించింది. కేంద్ర సర్వీసుల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులు చట్టాన్ని కార్మిక చట్టాలను ఉల్లంఘించి ఏకపక్షంగా వ్యవహరించడంపై ఉద్యమానికి సిద్ధమని ఆదివారం ప్రకటించింది. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా టిటిడి వ్యవహరిస్తున్న తీరును మానవతా, లౌకిక వాదులు తీవ్రంగా ఖండిస్తుండటం గమనార్హం. తిరుమల శ్రీవారి ఆలయ అభివృద్ధి, కైంకర్య సేవల్లోనూ అనాదిగా ముస్లిం, మైనార్టీలకూ భాగస్వామ్యముందని చరిత్ర ఆధారాలతో సహా స్పష్టం చేస్తోంది. నేటికీ తిరుమల శ్రీవారి ఆలయంలో ముస్లిం వనిత బీబీనాంచారి విగ్రహానికి పూజలు జరుగుతూనే ఉన్నాయి. ఆమెను శ్రీనివాసుని భార్యగానే పరిగణిస్తున్నారు. అలాగే శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ' బ్యాక్ సవారీ' ముస్లిం మత ఆచార ప్రకారమే సాగుతోంది. స్వామి వారికి నైవేద్యం సమర్పించే ' మన్రో గంగాళం' బ్రిటీష్ వారి కాలంలో కడప కలెక్టర్‌గా ఉన్న మన్రో అనే క్రైస్తవ భక్తుడు సమర్పించినదే. ఆర్జితసేవల్లో అత్యంత ముఖ్యమైన ' అష్టదళ పాదపద్మారాధన' లో వినియోగిస్తున్న 108 బంగారు కలువ పూలు ఓ ముస్లిం భక్తుడు సమర్పించిదేనని స్వయానా టిటిడి మాజీ ఈవో పివిఆర్‌కె ప్రసాద్ ప్రకటించిన విషయం విదితమే. టిటిడి కేలండర్లలో కనిపించే గోవిందుని ' నిలువెత్తు విగ్రహ నమూనా'ను తయారు చేసిందీ, స్వామి వారి ఆనంద నిలయానికి బంగారు లేపనాన్ని పూసిందీ, తిరుపతి లోని గోవిందరాజస్వామి ఆలయ గోపుర కళశాలను తయారు చేసి అమర్చిందీ ముస్లిం, మైనార్టీలేనని ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికీ తిరుమల శనివారాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీవారికి ఉపవాసాలు ఉంటూ తమ ఇలవేల్పుగా కొలుస్తున్న ముస్లిం సోదరులు తిరుపతి నగరంలో వందల సంఖ్యలో ఉన్నారని టిటిడినే గుర్తించింది. ఇలా అనాదిగా శ్రీవారి ఆలయ కైంకర్యాలు, అభివృద్ధిలో భాగస్వామ్యులైన ముస్లిం, మైనార్టీలు భాగస్వామ్యమయ్యారు. ఇలానే శ్రీనివాసుని పట్ల అంకితభావంతో దశాబ్దాలకు ముందే టిటిడిలో చేరిన 45 మంది ఉద్యోగులను సంఘ్‌పరివారం ఒత్తిళ్లతో టిటిడి తొలగించేందుకు పూనుకోవడం గమనార్హం.

ఉద్యోగులను తొలగించడం రాజ్యాంగ విరుద్ధం : టిటిడి ఉద్యోగుల రక్షణ వేదిక

పరమత సహనాన్ని పాటించిన శ్రీవారి చెంతనే హైందవేతరులు అంటూ 45 మంది ఉద్యోగుల్ని తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని టిటిడి ఉద్యోగుల పరిరక్షణ వేదిక అధ్యక్షులు, రిటైర్డ్ జడ్జి పెనుమూరు గురప్ప, కన్వీనర్ కందారపు మురళిలు స్పష్టం చేస్తున్నారు. ధర్మక్షేత్రంలో న్యాయం కోసం ఉద్యోగుల తరపున ఉద్యమిస్తామని వెల్లడించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఒత్తిళ్లకు తలొగ్గి ఉన్నతాధికారులు ఉద్యోగుల్ని తొలగించేందుకు పూనుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. లౌకిక, మానవతావాదులు, ప్రజాసంఘాలతో కలిసి టిటిడి ఉద్యోగులకు అండగా ఉంటామని ప్రకటించారు.

తర్వాత చిత్రం సుకుమార్‌తోనా!



చిరంజీవి

చిరంజీవి వచ్చే నెల నుంచి 'సైరా నరసింహారెడ్డి' చిత్రం షూటింగ్‌లో పాల్గొననున్నాడు. డిసెంబర్‌లో మొదటి షెడ్యూల్ పూర్తి చేశారు. ఫిబ్రవరి నుంచి రెండో షెడ్యూల్ మొదలు కానుంది. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ చరణ్ నిర్మిస్తున్నాడు. ఈ సినిమా తర్వాత ఏ దర్శకుడితో సినిమా చేస్తాడన్న దానిపై ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో ఓ వార్త హల్‌చల్ చేస్తుంది. 152వ సినిమా సుకుమార్ దర్శకత్వంలో ఉండబోతుందన్నది ఈ రూమర్ సారాంశం. కథ? నేపథ్యం ఏమిటి? అన్నది ఇంకా తెలియదు కానీ ఓ మంచి కాన్సెప్ట్‌తో విభిన్నంగా ఉండే కథను చిరంజీవికి సుకుమార్ చెప్పాడని సమాచారం. ఈ కథ వినడానికే చిరంజీవి 'రంగస్థలం' సెట్‌కు వెళ్లాడని తెలిసింది. ఈ కాంబినేషన్‌లో సినిమా ఉంటుందా? లేదా? అన్నది అధికారికంగా చెబితే తెలుస్తుంది. సుకుమార్ ప్రస్తుతం రామ్ చరణ్ హీరోగా 'రంగస్థలం' చేస్తున్నాడు. సమంత కథానాయిక. ఇది పూర్తయ్యాక చిరుతో చేసే సినిమా సెట్స్‌పైకి వెళ్ల వచ్చు అని సమాచారం.

వినాయక్ మెసేజ్ చేస్తే చాలు ...

ఎక్కడికి రమ్మంటే అక్కడకొచ్చేస్తా

'ఇంటిలిజెంట్' తొలి గీతం ఆవిష్కరణలో ప్రభాస్



లావణ్య త్రిపాఠి, సాయి ధరమ్ తేజ్, ప్రభాస్, వి.వి. వినాయక్, సి. కళ్యాణ్

సాయి ధరమ్ తేజ్, వినాయక్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఇంటిలిజెంట్' చిత్రం ప్రచారానికి అన్ని అవకాశాలనూ ఉపయోగించుకుంటున్నారు. దీనిలో భాగంగానే ఈ చిత్రం టీజర్‌ను శనివారం బాలకృష్ణ చేతుల మీదగా టీజర్‌ను విడుదల చేశారు. ఇప్పుడు ఈ చిత్రం ఓ గీతాన్ని ప్రభాస్ చేత ఆవిష్కరింపజేశారు. లావణ్య త్రిపాఠి కథానాయికగా చేస్తున్న ఈ సినిమా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతోంది. సి.కల్యాణ్ నిర్మాత. ఈ చిత్రంలో లెట్స్ డు...పల్లవితో సాగే మొదటి గీతాన్ని ప్రభాస్ ఆదివారం సాయంత్రం విడుదల చేశారు.

ప్రభాస్ మాట్లాడుతూ 'సాంగ్ లాంచ్ చెయ్యాలని వినాయక్ మొహమాటపడుతూ పలిచారు. ఆయన ఒక మెసేజ్ చేస్తే చాలు ఏ ఫంక్షన్‌కైనా, ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చేస్తా. నా లైఫ్‌లో 'యోగి' సినిమాకి చేసినంత ఎంజాయ్ ఏ సినిమాకీ చెయ్యలేదు. రాజమౌళితో చెప్పాను. వినాయక్ బాగా సుఖపెట్టేస్తారు అని. ఆయన సుఖ పెట్టకూడదు. మేం ఇంకా చాలా కష్టపడాలి. తేజ్ 'సాహో' షూటింగ్‌కి వచ్చాడు. వినాయక్‌తో చేయడం చాలా లక్కీ అని చెప్పాను. ఈ సినిమాలో నా మోస్ట్ ఫేవరేట్ 'చమకు చమకు ఛాం' సాంగ్. చిరంజీవి పాటల్లో ది బెస్ట్ సాంగ్ అది. ఆ సాంగ్ చిరంజీవి సూపర్బ్‌గా చేశారు. తేజు ఎలా చేశాడో అని ఆతృతగా ఎదురు చూస్తున్నాను. వినాయక్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌తో వస్తున్నారు' అని తెలిపారు.

వి.వి.వినాయక్ మాట్లాడుతూ 'ప్రభాస్ అంటే స్నేహానికి నిలువెత్తు రూపం. హార్ట్‌ఫుల్‌గా ఫ్రెండ్స్ ఉంటే చాలు అనుకునే మనిషి. ఇలాంటి మనిషి సినిమా ఇండస్ట్రీలో ఉండటం చాలా అరుదు. నేను ఎప్పుడూ ఎవర్నీ ఏమీ అడగను. ఎవర్ని ఏ ఫంక్షన్‌కీ పిలవను. సరదాగా ప్రభాస్‌కి ఫోన్ చేసి సాంగ్ రిలీజ్ చెయ్యాలి వస్తావా? అన్నాను. ఏయ్ డార్లింగ్ ఎక్కడికి రమ్మంటావ్ చెప్పు. అక్కడికి వస్తా అని చెప్పాడు. నాకు చాలా ఆనందం కలిగింది. ప్రభాస్ ఎక్కువమందిని కలవడు. ఉన్నవారితో చాలా ఆత్మీయంగా ఉంటాడు. చిన్న చిన్న విషయాలకు కూడా ఆనందపడుతుంటాడు. అదే ఆనందాన్ని మాకు పంచి ఇవ్వడానికి వచ్చాడు' అని తెలిపారు.

ఎందుకో ఏమో!



నందు, నోయల్

మహేశ్వర క్రియేషన్స్ పతాకంపై నందు, నోయల్, పునర్నవి హీరో హీరోయిన్లుగా 'ఎందుకో ఏమో' చిత్రం రూపొందుతోంది. కోటి వద్దినేని దర్శకత్వం వహిస్తున్నారు. మాలతి వద్దినేని నిర్మాత. ఈ చిత్రం టీజర్ ఆదివారం వి.వి.వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వి.వి.వినాయక్ మాట్లాడుతూ ' ఈ టైటిల్ లాగే టీజర్ కూడా చాలా ట్రెండీగా, ఇంట్రస్టింగ్‌గా ఉంది. ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్న కోటికి మంచి పేరు, నిర్మాతకు లాభాలు రావాలి' అని ఆకాంక్షించారు. దర్శకుడు కోటి వద్దినేని మాట్లాడుతూ 'ఇదొక ట్రయాంగిల్ లవ్ స్టోరీ. మా నిర్మాత ఎక్కడా రాజీ పడకుండా, పూర్తి స్వేచ్ఛనివ్వడంతో అనుకున్నట్టుగా సినిమా తీయగలిగాం. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన సెన్సార్ పనులు జరుగుతున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలో ఆడియో విడుదల చేసి, అదే నెలలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అనిచెప్పారు.

అటు 'భాగమతి' ఇటు 'పద్మావత్'



'పద్మావత్'లో దీపికా పదుకొనే

మహిళా ప్రాధాన్య చిత్రాలు రావడమే అరుదు. బలమైన కథాకథనాలు లేకపోతే మరోసారి అటువంటి ప్రయోగం చేయడానికి సాహసం చేయరు. అటువంటివి తాజాగా విడుదలైన వాటిని లెక్కపెడదామన్నా...ఒకటో రెండో ఉంటాయి అంతే. ఓ పక్క హీరోయిన్ పాత్రల్లో అలరిస్తూనే, మరోపక్క లేడీ ఓరియెంటెడ్ క్యారెక్టర్స్‌లో మెప్పిస్తున్నారు అనుష్క, దీపికా పదుకొనే. దక్షిణాదిలో ప్రముఖంగా రాణిస్తున్నది ఒకరైతే...బాలీవుడ్‌లో తనకంటే ప్రత్యేక క్రేజ్‌ను సంపాదించుకున్నది మరొకరు. కొన్ని పాత్రలు వీళ్లే చేయగలరు అన్నట్టు చేసేస్తారు వీరిద్దరూ. వీరి కోసమే సినిమాలు కథలు రాసే దర్శకులు ఉండడమంటే మాటలు కాదు. ఆ తరహాలో రాసిన కథాచిత్రాలే ప్రస్తుతం థియేటర్లలో అలరిస్తున్నాయి. ఒకటి వంద కోట్ల మార్కును దాటేసింది. మరొకటి సానుకూల స్పందనతో దూసుకుపోతుంది.

అనుష్కను ఊహించుకునే దర్శకుడు అశోక్ రెండేళ్ల క్రితం 'భాగమతి' కథను రాసుకున్నాడు. ఆమెకు డేట్స్ ఖాళీ లేకపోయినా అనుష్క అవకాశం ఇచ్చే వరకూ నిరీక్షించి చేశాడు ఈ చిత్రం. మొదటి నుంచీ ఈ సినిమాలో కథ వాస్తవం కాదు..అది ఒక ఊహ మాత్రమే ...కల్పిత కథ అని దర్శకుడు చెబుతూ ఉన్నాడు. కానీ ఎన్ని చెప్పినా టీజర్‌ను బట్టి ఇది హారర్ చిత్రమని ప్రేక్షకులు భావించారు. దీంతో అంచనాలకు అనుగుణంగా లేదని కాస్తా నిరాశ చెందారు. కానీ వాస్తవాలు గ్రహించి ఇప్పుడు కాస్తా సానుకూల దృక్పథంతో దూసుకుపోతుంది. గణతంత్ర దినోత్సవం నాడు విడుదలైన ఈ సినిమాకు బాగానే కలెక్షన్లు వస్తున్నాయని దర్శకుడు అశోక్ పేర్కొన్నారు. పెద్ద హీరోల సినిమాలకు దీటుగా 'భాగమతి' వసూళ్లను రాబడుతోందని స్పష్టం చేశారు. రెండు రోజుల తర్వాత ఈ ప్రకటన చేశారు. అంతేకాదు తొలిరోజు కన్నా థియేటర్లు పెరిగినట్లు వెల్లడించారు. ఓవర్‌సీస్‌లోనూ మంచి వసూళ్లను రాబడుతోంది. ప్రీమియర్ షోలు, శుక్ర, శనివారాలు కలిపి 542వేల డాలర్లు రాబట్టింది. ప్రీమియర్ షోలు, శుక్రవారం 279వేల డాలర్లు, శనివారం 263వేల డాలర్ల కలెక్షన్లు వచ్చాయి. మొత్తం 542వేల డాలర్లు (రూ.3.52కోట్లు)వచ్చినట్లు సినీ విశ్లేషకులు పేర్కొన్నారు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మించారు. తమన్ సంగీతం అందించారు.



'భాగమతి'లో అనుష్క

మూడు రోజుల్లో వంద కోట్లు

సినిమా షూటింగ్ ప్రారంభం రోజు నుంచి విడుదలయ్యే వరకూ 'పద్మావత్', దీపికా పదుకొనే, భన్సాలీ ఈ పేర్లు వినని రోజు లేదు. రాజ్‌పుత్ కర్ణిసేన అనవసరమైన రాద్ధాంతాన్ని సృష్టించి చిత్రయూనిట్‌ను అనేక ఇబ్బందులకు గురి చేసింది. అయినా భన్సాలీ ఎక్కడా తగ్గకుండా అనేక దాడులను ఎదుర్కొంటూ... పోరాటం చేసి ఎట్టకేలకు ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాడు 'పద్మావత్'ను. దీపికా పదుకొనే కోసమే ఈ కథను తయారు చేసి ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరెక్కించారు భన్సాలీ. షాహిద్ కపూర్, రణవీర్‌సింగ్‌ల నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దుమ్ము రేపుతోంది. మూడు రోజుల్లో వందకోట్ల సినిమాల క్లబ్‌లో చేరబోతుంది. నిన్నటికింకా వివరాలు రాలేదు కానీ వచ్చి ఉంటే ఆ మార్కును దాటేసి ఉండేది. ఈ విషయాన్ని సినీ విశ్లేషకుడు తరుణ్ ఆదర్శ్ ట్విటర్‌లో వెల్లడించారు. "పద్మావత్' మెరుపులు కొనసాగుతున్నాయి. శుక్ర, శనివారాలు సెలవులు కావడంతో సినిమా కలెక్షన్లకు మరింత ఊతం ఇచ్చింది. ఆదివారంతో సులభంగా రూ.100కోట్ల మార్కుకు చేరుతుంది. కొన్ని ప్రీమియర్ షోలు, బుధవారం కలెక్షన్లు రూ.5కోట్లు వచ్చింది. గురువారం రూ.19కోట్లు, శుక్రవారం రూ.32కోట్లు, శనివారం రూ.27 కోట్లు ....మొత్తంగా బాక్సాఫీస్ వద్ద ఇప్పటివరకూ రూ.83కోట్లు రాబట్టింది. ఆదివారం సులభంగా రూ.100కోట్ల క్లబ్‌లోకి చేరుతుంది' అని తరుణ్ పేర్కొన్నారు.

నెల్లూరి పెద్దారెడ్డి

సతీష్ రెడ్డి, మౌర్యాని, ముంతాజ్ హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై వీజే రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోంది. సీహెచ్ రఘునాథ రెడ్డి నిర్మాత. ప్రభాస్ శీను, అంబటి శీను, సమ్మెట గాంధీ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. గురురాజ్ సంగీతాన్ని అందించిన ఆడియోను కార్యక్రమం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో విడుదల చేశారు. సీనియర్ దర్శకులు సాగర్, రేలంగి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆడియో బిగ్ సీడీని ఆవిష్కరించిన అనంతరం దర్శకులు వీజే రెడ్డి మాట్లాడారు. పల్లె వాతావరణంలో ఆహ్లాదకరమైన కథా కథనాలతో ఈ చిత్రం సాగుతుంటుంది. నెల్లూరు నుంచి ఖమ్మం జిల్లా సీతారాంపురం అనే గ్రామానికి వలస వచ్చిన పెద్దారెడ్డి అనే వ్యక్తి కథ ఇది. అలా అతన్ని అంతా నెల్లూరి పెద్దారెడ్డి అని పిలుస్తుంటారు. ఆ గ్రామంలోని వాళ్లంతా నెల్లూరి పెద్దారెడ్డిని గౌరవిస్తుంటారు. నలుగురికి మంచి చేసే పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయమిస్తాడు. ఈ క్రమంలో అతనికి అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. వాటి పర్యవసానంగా కథ ఎలాంటి మలుపులు తిరిగింది అనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం' అని చెప్పారు.



మౌర్యాని, సతీష్ రెడ్డి

ఈ సారి గ్రామీణ నేపథ్యం



నారా రోహిత్

రొటీన్‌కు భిన్నంగా వైవిధ్యమైన కథ–కథనాలను ఎంచుకుంటూ కథానాయకుడిగా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సొంతం చేసుకొన్న హీరో నారా రోహిత్. ఈ.ఎం.వి.ఈ స్టూడియోస్ సంస్థలో మరో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ చిత్రంతో ఎస్.డి.చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. వైవిధ్యమైన కథతో విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి నుంచి మొదలవ్వనుంది. వడ్డేవల్లి సత్యనారాయణ సమర్పణలో రూపొందనున్న ఈ చిత్రంలో నారా రోహిత్ క్యారెక్టరైజేషన్, గెటప్ చాలా టిపికల్‌గా ఉండబోతున్నాయి. ఈ చిత్రానికి సంగీతం : సాయికార్తీక్, సమర్పణ : వడ్డేవల్లి సత్యనారాయణ, నిర్మాణం: ఈ.ఎం.వి.ఈ స్టూడియోస్.

కుటుంబ కథా చిత్రం



శ్రీకాంత్, సుహాసిని, హేమలత, సుమన్

వీరభద్ర క్రియేషన్స్ పతాకంపై నూతన నటీనటులు శ్రీకాంత్, హేమలత (బుజ్జి) హీరో హీరోయిన్లగా 'నిన్నే చూస్తు' చిత్రం తెరకెక్కుతోంది. నాటితరం హీరోయిన్ సుహాసిని, సుమన్, భాను చందర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. వి.ఎస్. ఫణీంద్ర దర్శకత్వం. హేమలతా రెడ్డి నిర్మిస్తున్నారు. రెండోవ షెడ్యూల్ ప్రారంభం అయింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతోంది. నిర్మాత హేమలతా రెడ్డి మాట్లాడుతూ 'మా వీరభద్ర క్రియేషన్స్ బ్యానర్‌లో 'నిన్నే చూస్తు' రెండో చిత్రం. మంచి కుటుంబ కథా చిత్రం. మా చిత్రంలో సుహాసిని నటించటం మా అదృష్టంగా భావిస్తున్నాం. వారు నటించిన సన్నివేశాలు చాలా బాగా వచ్చాయి. చిత్రీకరణ పూర్తి చేసి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని చెప్పారు.

దీర్ఘ ఆయుస్మాన్ భవ

కార్తీక్‌రాజు, మిస్తి చక్రవర్తి జంటగా రూపొందుతోన్న సినిమా 'దీర్ఘ ఆయుష్మాన్ భవ'. వింగ్స్ మూవీ మేకర్స్ బేనర్‌పై జి.ప్రతిమ నిర్మిస్తున్నారు. సోషియో ఫాంటసీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి పూర్ణానంద్.ఎం దర్శకుడు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను పూరీ జగన్నాథ్ ఆవిష్కరించారు. పూరీ మాట్లాడుతూ 'కార్తీక్ రాజ్ నాకు చాలా కాలంగా తెలుసు. ఒక డిఫరెంట్ ఫిలిమ్‌తో ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు. టైటిల్, పోస్టర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. ఈ సినిమాతో కార్తీక్ రాజ్ హీరోగా మంచి గుర్తింపు లభించాలని ఆశిస్తున్నాను" అని అన్నారు. కార్తీక్ రాజు మాట్లాడుతూ 'హీరోగా నా గత చిత్రాల కంటే వైవిధ్యంగా ఉండే సినిమా ఇది. పూర్ణానంద్ ఓ గమ్మత్తైన ప్రేమకథగా రూపొందిస్తున్నారు' అని చెప్పారు. కైకాల సత్యనారాయణ చాలాకాలం తర్వాత యముడిగా కనిపించనున్నారు. ఆయన పాత్ర సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. గ్రాఫిక్స్ వర్క్ జరుగుతోంది. మార్చ్ లో సినిమాను విడుదల చేస్తాం' అని దర్శకుడు తెలిపారు.



పూరీ జగన్నాథ్‌తో 'దీర్ఘ ఆయుష్మాన్ భవ' యూనిట్

బావకి వయసు తగ్గుతూ వస్తుంది

'టచ్ చేసి చూడు' ప్రీ రిలీజ్ వేడుకలో వి.వి. వినాయక్

రవితేజ, రాశీ ఖన్నా, సీరత్ కపూర్ హీరో హీరోయిన్లుగా చేసిన చిత్రం 'టచ్ చేసి చూడు'. బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి) , వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మించారు. విక్రమ్ సిరికొండ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఫిబ్రవరి 2న విడుదల కానున్న ఈచిత్రం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి.వి.వినాయక్ ఆడియో సీడీలను విడుదల చేశారు.

'నిర్మాతలు బుజ్జి, వల్లభనేని వంశీతో నాకు మంచి అనుబంధం ఉంది. ఈ సినిమా డైరెక్టర్ విక్రమ్ నాతో కలిసి పనిచేశాడు. సినిమాలో రెండు రీళ్లు చూశాను. సినిమాను విక్రమ్ ఎంతో అద్భుతంగా తీశాడు. చోటన్న, గౌతంరాజు సహా కంగ్రాట్స్. బావ(రవితేజ)కి పుట్టినరోజు వయసు తగ్గుతూ వస్తుంది. విక్రమార్కుడు సినిమా చూసి ఎలా ఫీలయ్యామో, ఈ సినిమా చూసినప్పుడు కూడా అలాగే ఫీల్ అవుతాం. రవి చాలా ఎనర్జితో, టఫ్‌గా చేశాడు' అని వి.వినాయక్ తెలిపారు.

రవితేజ మాట్లాడుతూ 'జామ్ 8 వండర్‌ఫుల్ మ్యూజిక్‌ను అందించారు. రామ్ లక్ష్మణ్, వెంకట్, రవివర్మ, అన్బు అరివు, పీటర్ హెయిన్స్ అందరూ మంచి యాక్షన్స్ సీన్స్ కంపోజ్ చేశారు. రాశీ ఖన్నా, సీరత్ కపూర్ ఎంత అందంగా ఉంటారో, అంతే అందమైన నడవడిక ఉన్నవారు. ఈ సినిమా పెద్ద సక్సెస్‌ను సాధించి నా నిర్మాతలు బుజ్జి, వల్లభనేనిలకు బాగా డబ్బులు రావాలి' అని చెప్పారు.



రవితేజ, సీరత్ కపూర్, రాశీ ఖన్నా

రూపాయి



ఉద్యోగం, వ్యాపారం, ఉపాధిరంగాల్లో వచ్చే ఆదాయం ఆధారంగానే చేసే ఖర్చులు ఆధారపడి ఉంటాయి. ఆదాయానికి మించి ఖర్చులు చేయడం అంటే ఏరికోరి ఆర్థిక నష్టాలను కొనితెచ్చుకోవడమే. మనం ఆర్జించే ఆదాయానికి తగ్గట్టుగా ఎలా అయితే వ్యయాలు చేస్తుంటామో?! భవిష్యత్తుకోసం చేసే పొదుపు కూడా అలానే ప్రణాళికాబద్ధంగా ఉండాలి. ఆదాయానికి మించి పొదుపు చేయడం అంటే.. లాభంకంటే నష్టమే ఎక్కువ. అలాగే మనం వివిధ పథకాల్లో పెట్టుబడుల రూపంలో పొదుపు చేసే మొత్తానికీ పన్నులు చెల్లించాల్సిన పరిస్థితులూ ఉంటాయి. అందుకే, పన్ను మినహాయింపునిచ్చే పొదుపు పథకాల గురించి ముందుగానే ఒక అవగాహనకు రావాలి. ఆర్జించే ఆదాయానికి తగ్గట్టుగా ఎలాంటి పొదపు పథకాల్లో పెట్టుబడి పెట్టాలి? ఆదాయం, ఖర్చుల్ని సమన్వయం చేసుకుంటూ.. ఎలాంటి ఆర్థిక ప్రణాళికతో ముందుకుసాగాలి.. అనే విషయాలను ఈ వారం 'రూపాయి' కథనంలో తెలుసుకుందాం!!

ఆదాయం..వ్యయం.. పొదుపు

పొదుపు చేయడం అంటే.. 'మన డబ్బుల్ని బ్యాంకుల్లో దాచుకోవడమే కదా?! అలా దాచుకున్న డబ్బుకు బ్యాంకులు కొంత వడ్డీ చెల్లిస్తుంది' అని చాలామంది భావిస్తారు. అలా బ్యాంకుల్లో దాచుకున్నవి.. మనం కష్టపడి సంపాదించుకున్న డబ్బులే అయినా.. వాటిని పొదుపు పథకాల్లో ఉంచేటప్పుడు.. నిర్ణీత మొత్తంగా పెట్టుబడులు పెట్టేటప్పుడు చట్టరీత్యా పన్నులూ చెల్లించాల్సి ఉంటుంది. ఎందుకంటే.. ఆదాయాన్నిబట్టి ప్రతి ఒక్కరూ ఆదాయచట్టంలోని నియమ, నిబంధనలకు లోబడి వార్షికపన్నులు చెల్లించాలి. ఎంత ఆదాయం ఉంటే పన్నులు చెల్లించాలి? ఎంత చెల్లించాలి? అనేది మనం ఆర్జించే ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. ఆదాయం, ఖర్చులు, పన్నులు.. ఈ మూడు విషయాలపై అవగాహన ఉంటేనే.. పొదుపు పథకాలు లాభదాయకమవుతాయి.



ఆదాయం.. వ్యయం

మనలో ప్రతి ఒక్కరిలో ఆదాయం అనే విషయంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. ఉద్యోగార్థులు, స్వయం ఉపాధి, వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్నవారి వార్షిక ఆదాయలన్నీ ఒకేలా ఉండవు. అలాగే పొదుపు పథకాలన్నీ ఆదాయవర్గాల వారందరికీ అనుకూలంగా ఉండవు. అందుకే, సంపాదనకు తగ్గట్టే పొదుపు ప్రణాళిక ఉండాలంటారు ఆర్థిక నిపుణులు. వార్షిక ఆదాయాన్నిబట్టి పొదుపు చేయడం అన్నివిధాల ప్రయోజనకరం. అంతకుమించి శ్రేయస్కరం.

కేస్‌స్టడీ

రమేష్ పాతికేళ్ళ కుర్రాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో నెలకు డెబ్బై వేల రూపాయలకు పైగా సంపాదన. ఖర్చులూ సంపాదనకు తగ్గట్టే ఉన్నాయి.

రాఘవరావు ప్రభుత్వ ఉద్యోగి. ఇంకా పదేళ్ళుమాత్రమే సర్వీసు ఉంది. నెలవారీ ఖర్చులు, లోన్ చెల్లింపులు పోను సుమారుగా పదివేల రూపాయలు మిగులుతోంది. కిరణ్ స్వయం ఉపాధి మార్గాల ద్వారా నెలకు ఐదారు వేల రూపాయలు మిగుల్చుకోగలుగుతున్నాడు.

ఇలా వార్షిక ఆదాయం లెక్కిస్తే వీరందరి ఆదాయాల్లో, మిగులు, ఖర్చుల్లో చాలా వ్యత్యాసం ఉంది. కానీ ఒక్కొక్కరిగా తీసుకున్నప్పుడు పొదుపు పథకాల్లోనూ పెట్టుబడి పెట్టే పద్ధతుల్లోనూ వ్యత్యాసం కనపడుతుంది. ఎందుకంటే ఎవరి ఆదాయం వారిది. ఎవరి ఖర్చులు వారివి. ఒకరితో ఒకరి ఆదాయాన్ని పోల్చుకున్నప్పుడు హెచ్చుతగ్గులు ఉంటాయి. అందుకే మనం ఆర్జించే ఆదాయాన్నిబట్టి, ఖర్చులు, ఆదాయపు పన్ను చెల్లింపులు, మినహాయింపులు ఆధారంగా మిగిలే ఆదాయానికి తగ్గట్టుగానే పొదుపు పథకాల్లో పెట్టుబడి పెట్టాలి. అందుకుతగ్గ పథకాలనే ఎంచుకోవాలి. ఇందులో ఆదాయంతోపాటు, ఏ వయసులో పొదుపు ప్రారంభించాము అన్నదీ ముఖ్యమే.



రూ.5 లక్షల లోపు ఆదాయం

ఈ ఆదాయ పరిమితిలో ఉన్నవారు ఇంటి అద్దె సరిగా లెక్కిస్తున్నారా? లేదా?

చూసుకోవాలి. పీఎఫ్, బీమా పాలసీలకు చెల్లిస్తున్న మొత్తాన్ని కలుపుతున్నారా? లేదా? అనే విషయాలను తనిఖీ చేసుకోవాలి. ఈ ఆదాయ పరిధిలో ఉన్నవారు గరిష్ఠంగా రూ.10 వేల వరకూ పన్ను ఆదా చేసుకోగలరు. సమయం, ఆర్థిక లక్ష్యాలను బట్టి పథకాలను ఎంపిక చేసుకోవాలి. బీమా పాలసీని తీసుకోవాలి అనుకుంటే, తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ ఇచ్చే టర్మ్ పాలసీలను ఎంచుకోవాలి. యాజమాన్యం ఆరోగ్య బీమా అందిస్తున్నప్పటికీ ప్రత్యేకంగా మీరూ ఒక పాలసీని తీసుకోవడం వల్ల అదనపు రక్షతోపాటు సెక్షన్ 80డీ ప్రకారం మినహాయింపూ వర్తిస్తుంది.

రూ.10 లక్షల పరిధి అయితే?

ఏడాదికి ఆరు నుంచి పది లక్షల రూపాయల ఆదాయ పరిధిలో ఉన్నవారు గరిష్ఠంగా 20 వేల వరకూ పన్ను ఆదా చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి, అందుబాటులో ఉన్న అన్ని పన్ను మినహాయింపు సెక్షన్లను వాడుకోవడం మంచిది. సెక్షన్ 80 సీ పరిధిలో గరిష్ఠంగా రూ.లక్షను పీఎఫ్, గృహరుణం అసలు, పిల్లల ఫీజులే భర్తీ చేస్తాయి. గృహరుణం వడ్డీకి లక్షాయాభై వేల రూపాయల వరకు మినహాయింపు వస్తుంది. అధిక ప్రీమియం ఉండే పాలసీలకన్నా టర్మ్ పాలసీ మేలు.

పది లక్షల పైన ఆదాయం ఉంటే

ఈ కేటగిరిలో ఉన్నవారు.. సెక్షన్ 80సీలో రూ.లక్ష మేరకు మదుపు చేయడం ద్వారా ఈ ఆదాయ పరిధిలో ఉన్నవారు గరిష్ఠంగా రూ.30 వేల వరకూ పన్ను మినహాయింపు పొందవచ్చు. ఆరోగ్య బీమా, ఆర్‌జీఈఎస్ఎస్‌తోపాటు, వీరికి ఉన్న ఏకైక పన్ను ఆదా సాధనం గృహరుణం మాత్రమే. ఇప్పటికీ రుణం తీసుకోకపోతే, ఇంటికోసం అప్పు తీసుకోవడం ద్వారా పన్ను భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు. అలాగే ఈ ఆదాయ పరిధిలో ఉన్నవారు పన్ను ఆదా కోసం పథకాలను ఎంచుకోవాలనుకుంటే ఈఎల్ఎస్–ఎస్, పీపీఎఫ్‌లు మేలు. ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మదుపు చేసినప్పుడు వచ్చే వడ్డీకి వర్తించే ఆదాయపు పన్ను శ్లాబులను బట్టి పన్ను చెల్లించాలి. అంటే, రూ.10 లక్షల ఆదాయం దాటిన వారికి గరిష్ఠంగా 30 శాతం పన్ను వర్తిస్తుంది. ఉదాహరణకు మీరు 9 శాతం వడ్డీ వచ్చే విధంగా ఐదేళ్ల ఎఫ్‌డీ (ఫిక్స్‌డ్ డిపాజిట్) చేశారనుకుందాం. అప్పుడు వచ్చిన వడ్డీ నుంచి పన్నులు, ఇతర సుంకాలు తీసివేస్తే వాస్తవంగా మిగిలేది 6.30 శాతమే. కాబట్టి, పెట్టుబడికీ, రాబడికీ పన్ను మినహాయింపు వర్తించే పథకాలవైపు మొగ్గు చూపాలి. ఆరోగ్య బీమా పాలసీలను తీసుకోవడమూ మర్చిపోకూడదు.

ఉద్యోగం, ఉపాధి, వృత్తి, వ్యాపారం ఇలా సంపాదన మార్గాలు ఏ రూపంలో ఉన్నాగానీ ఆదాయపు పన్ను చెల్లింపులు, మినహాయింపులు అనేవి బ్యాంకింగ్ రంగాల్లో పొదుపు చేసేటప్పుడు ప్రధానంగా వర్తించే అంశాలు. అందుకు తగ్గ పొదుపు పథకాలేంటో ముందుగా తెలుసుకోవడం ముఖ్యం. అలా చేయడంవల్ల పొదుపువల్ల కలిగే లాభంతోపాటు.. పెరిగే సంపాదనలో పన్ను మినహాయింపులూ దక్కుతాయి.

- వి. చైతన్య

ఆన్‌లైన్లో.. ఉచితంగా సిబిల్ రిపోర్ట్



తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం రుణ గ్రహీత బాధ్యత. పాత రుణాలను తీర్చారా? ఏమైనా బాకీలు ఉన్నాయా? అని తెలుసుకున్నాకే బ్యాంకులు కొత్త అప్పులను, క్రెడిట్ కార్డులను ఇస్తుంటాయి. దీనికోసం అవి సిబిల్ నివేదిక మీద ఆధారపడతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, కొత్త రుణాలను తీసుకోవాలంటే.. మీ రుణ చరిత్ర నివేదిక, క్రెడిట్ స్కోరే కీలకం. సిబిల్ స్కోరు వ్యక్తిగతంగానూ తీసుకునే వీలుంది. అయితే, ఇప్పటిదాకా దీనికోసం కొంత రుసుము (రూ.500) చెల్లించాల్సిన పరిస్థితి ఉండేది. అయితే ఇక మీదట ఉచితంగానే వ్యక్తిగత సిబిల్ నివేదిక గురించి తెలుసుకోవచ్చు.

రుణగ్రహీతలు తాము తీసుకున్న అప్పులను సరిగ్గా చెల్లిస్తున్నామా? లేదా? అనేది తెలుసుకునేందుకు వీలుగా ఏడాదికో ఉచిత సిబిల్ నివేదిక అందించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ఇలా ఉచితంగా నివేదిక అందించడం వెనుక ప్రధానలక్ష్యం.. ఎప్పటికప్పుడు రుణ ఖాతాలకు సంబంధించి తాజా సమాచారం అందివ్వడం. దీనివల్ల రుణ, కార్డు బిల్లుల చెల్లింపులకు సంబంధించి అనవసర వివాదాలు తప్పుతాయనే భావనతోనే ఇలా అందించనున్నారు. కొత్తగా రుణాలకు దరఖాస్తు చేసేవారు www.cibil.com నుంచి తమ రుణ చరిత్ర (క్రెడిట్ హిస్టరీ) నివేదిక పొందొచ్చు. అయితే ఉచిత సేవలకోసం ఈ ఏడాది చివరిదాకా వేచి చూడాల్సిందే.



'రూపాయి'కి మీరూ రాయండి!



బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమాపథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయాలపై మీరూ మీ అనుభవాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006



పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్ కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లికథలు వేసిన నాటకాలు ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు, మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాలగురించి చిన్నారి పేజీలో పంచుకోండి. వాటిని మీపేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యంపోకండి. నిజమే. అందుకే మీలోదాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం...

పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.


చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

చిన్నారి



రంగులు దిద్దండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని చుక్కలను కలిపి రంగులు నింపండి!

పొడుపు కథ

నింగంతా నిండి ఉంటాయి,
ధన, ఋణ విద్యుదావేశాలవి,
ఢీ కొంటే మెరుపు, ఉరుము లొస్తాయి,
చల్లగాలికి కరిగి వర్షిస్తాయి..?

జవాబు : మేఘాలు

జోక్ :

టీచర్ : ఒరేయ్ బంటీ నీకు మీ అమ్మ పది రూపాయలు ఇచ్చి అందులో సగం నీ చెల్లికి ఇవ్వమంటే ఎంతిస్తావు?

బంటి : రెండు రూపాయలు ఇస్తా టీచర్..

టీచర్ : ఏరా నీకు లెక్కలు రావా?

బంటి : నాక్కాదు నా చెల్లికి రావు

వ్యవసాయ పనిముట్లు

పిల్లలూ..! వ్యవసాయం చేయడానికి రైతులు కొన్ని పనిముట్లను వాడతారు. వాటిని ఏఏ పనులకు వాడతారు? వాటి పేర్లు ఏమిటో తెలుసుకుందామా?!



కొడవలి: వరికోతకు, ఇతర పంటలను కోయడానికి ఉపయోగిస్తారు. అలాగే పశువులకు గడ్డి కోయడానికి వాడతారు. ఇది చిన్న కత్తిలాగా ఉన్నా వంపువైపు సన్నని రంపపు పళ్ళు ఉంటాయి. దానిని కక్కు అని కూడా అంటారు. కాలానుగుణంగా ఆ కక్కు అరిగిపోతుంటే మాటి మాటికి దానికి కక్కు వేస్తారు. కొంతకాలం తర్వాత అది చిన్నదైపోతుంది. ఆ చిన్నదైన కొడవలిని లిక్కి అంటారు.

కత్తి: కత్తులు చాలా రకాలు. చిన్న కత్తిని చిన్న కొమ్మలు కొట్టడానికి, చెరుకు కొట్టడానికి వాడతారు. పెద్ద కత్తిని పెద్ద కొమ్మలు కొట్టడానికి ఉపయోగిస్తారు.



పార

కొంకి: ఇది చిన్న కత్తికన్నా తేలికగా ఉంటుంది. దానికన్నా ఎక్కువ వంపు కలిగి, పిడి బదులు గొట్టం ఉంటుంది. అందులో పొడవాటి వెదురుకర్రను దూర్చుతారు. దీన్ని గొర్రెల కాపరులు, మేకల కాపరులు వెంట తీసుకెళ్ళి, కొమ్మలను కోసి వారి జీవాలకు మేత వేస్తారు. దీనికి పదునెక్కువ. ఇది తేలికైన ఆయుధం.

గొడ్డలి: చిన్న గొడ్డలి, పెద్ద గొడ్డలి రెండు రకాలు. చిన్న దాన్ని చిన్న పనులకు, పెద్ద దాన్ని పెద్ద కొమ్మలను, చెట్లను నరకడానికి ఉపయోగిస్తారు. గొడ్డళ్ళకు పదును ఎక్కువగా ఉండదు.

గడ్డపార: మట్టిని తవ్వడానికి, పొలాల్లో రాళ్ళను పెకలించడానికి ఉపయోగిస్తారు. దీనిని గడ్డపలుగు అనీ అంటారు. జొన్న, సజ్జ చేలలో కంకులపై వాలె పక్షులను, పిట్టలను తోలటానికి మంచె వేసుకుంటారు కదా! అలాగే పందిళ్ల వేస్తారు. వాటిని గడ్డపారతో తవ్వే ఏర్పాటు చేసుకుంటారు.



దబ్బణం: ఇది సూది లాంటి పరికరం. దీంతో ధాన్యం బస్తాల మూతిని కుట్టడానికి ఉపయోగిస్తారు.

ముల్లు గర్ర: ఇది సన్నని వెదురు కర్ర. కర్ర కొసగా చెక్కి ఉంటుంది. దీన్ని దుక్కి దున్నేటప్పుడు ఎద్దులను అదిలించడానికి వాడతారు.

కాడిమాను: కాడి కొయ్యతో చేసినది. దీన్ని ఎద్దుల మెడపై వేసి బండికి నాగలి వంటి పనిముట్లు కట్టి, ఎద్దులతో పని చేయించడానికి ఉపయోగిస్తారు. ఎద్దులతో ఏ పని చేయించాలన్నా ఎద్దుల మెడపై కాడి మాను పెట్టాల్సిందే. కాడిమాను పైకి లేపగానే ఎద్దులు తలలు వంచి దాని కిందికి దూరి మెడలపై ఉంచుకుంటాయి.



నిచ్చెన

నిచ్చెన: పందిరి పైనున్న గడ్డిని తీయడానికి, చిన్న చెట్లను ఎక్కడానికి నిచ్చెనను ఉపయోగిస్తారు.

పార: తవ్వినా మట్టిని తట్టలకెత్తడానికి, పొలాల్లో నాటు వేసేటప్పుడు గట్లు వేయడానికి, చెరుకు, మిర్చి తోటలకు నీరు కట్టడానికి పార చాలా అవసరం. ★

జోరు తగ్గని ఫెదరర్

• ఆరోసారి ఆస్ట్రేలియా ఓపెన్ కైవసం • కెరీర్‌లో 20వ గ్రాండ్‌స్లామ్



మెల్‌బోర్న్ : స్విస్ యోధుడు రోజర్ ఫెదరర్ తనలో సత్తా ఇంకా తగ్గలేదని మరోసారి నిరూపించాడు. ఆదివారం జరిగిన ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్‌లో మారిన్ సిలిక్‌పై విజయం సాధించాడు. ఢిఫెండింగ్ చాంపియన్ హోదాలో టోర్నిలోకి దిగిన ఫెదరర్ ఈ ఏడాది కూడా టైటిల్ విజేతగా నిలిచాడు. ఆస్ట్రేలియా ఓపెన్ సాధించడం ఫెదరర్‌కు ఇది ఆరోసారి. ఈ విజయంతో మొత్తంగా కెరీర్‌లో ఇప్పటి వరకూ 20 గ్రాండ్ స్లామ్ టైటిల్స్‌ను ఫెదరర్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్‌లో 6-2, 6-7(5), 6-3, 3-6, 6-1 స్కోరుతో ఫెదరర్ విజయం సాధించాడు. మూడు గంటల మూడు నిమిషాలతో పాటు సాగిన ఫైనల్‌లో చివరికి సిలిక్‌ను ఫెదరర్ కంగుతినిపించాడు. క్రొషియాకు చెందిన సిలిక్‌తో ఇప్పటి వరకూ తొమిదిసార్లు ముఖాముఖీ తలపడ్డ ఫెదరర్ ఎనిమిది మ్యాచ్‌ల్లో విజయం సాధించాడు. ఆదివారం విజయంతో ఆస్ట్రేలియా ఓపెన్‌ను ఆరుసార్లు సాధించిన మూడో ఆటగాడిగా ఫెదరర్ నిలిచాడు. రాయ్ ఎమెర్సన్, నోవాక్ జకోవిచ్‌లు కూడా ఆస్ట్రేలియా ఓపెన్‌ను ఆరుసార్లు గెలుచుకున్నారు. కాగా, 36 ఏళ్ల 173 రోజుల వయస్సు గల ఫెదరర్ ఈ విజయంతో అధుని క యు గంలో గ్రాం డ్ శ్లామ్ టైటిల్ సాధిం చిన రెండో అత్యంత వయస్సు క్రీడా కారుడిగా నిలిచాడు. ఇంతకుముందు 1972 లో కెన్ రోజ్‌వాల్ 37 ఏళ్ల వయస్సులో ఆస్ట్రేలి యా ఓపెన్ సాధించాడు.కాగా, ఈ విజయంతో 30 ఏళ్లు దాటిన తరువాత నాలుగు గ్రాండ్ స్లామ్ సాధించిన రాడ్ లివర్స్ రికార్డును కూడా ఫెదరర్ సమం చేశాడు. ఫెదరర్ ఇప్పటి వరకూ వింబు ల్డన్ ఓపెన్ ఎనిమిది సార్లు (2003, 2004,2005, 2006, 2007, 2009, 2012, 2017), ఆస్ట్రేలియా ఓపెన్‌ను ఆరుసార్లు (2004, 2006, 2007, 2010, 2017, 2018), యుఎస్ ఓపెన్‌ను ఐదుసార్లు (2004,2005, 2006, 2007,2008),ఫ్రెంచ్ ఓపెన్‌ను ఒక్కసారి (2009) సాధించాడు.



రన్నరప్‌గా బోపన్న జోడీ

ఆస్ట్రేలియా ఓపెన్‌లో మిక్సడ్ డబుల్స్ విభాగంలో భారత్‌కు చెందిన రోహన్ బోపన్న జోడీ రెండోస్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో తిమై బబోస్ (హంగేరీ)-బోపన్న జోడీపై 2-6, 6-4 (11-9) స్కోరుతో గాబ్రియల్ డబ్రోవ్సికి (కెనడా)- మటే పావిక్ (క్రొషియా) జోడీ విజయం సాధించి టైటిల్‌ను గెలుచుకుంది.

జయదేవ్ రూ11.50 కోట్లు

అత్యధిక ధర పలికిన భారత క్రికెటర్

ముగిసిన ఐపిఎల్ వేలం



బెంగళూరు : ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)-11 సీజన్‌కు సంబంధించి రెండో రోజు వేలంలో పెను సంచలనం నమోదైంది. సౌరాష్ట్ర పేసర్ జయదేవ్ ఉనద్కత్ రూ. 11.50 కోట్ల రికార్డు ధర దక్కించుకున్నాడు. దీంతో ఈ వేలం కార్యక్రమంలో అత్యధిక ధర పలికిన భారత క్రికెటర్‌గా నిలిచాడు. గతేడాది ఐపీఎల్లో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ కు ప్రాతినిథ్యం వహించి బౌలింగ్‌లో సత్తాచాటిన ఉనద్కత్‌కు ఈసారి అత్యధిక మొత్తాన్ని చెల్లించి రాజస్థాన్ రాయల్స్ సొంతం చేసుకుంది. ఉనద్కత్ కోసం పలు ఫ్రాంచైజీలు తీవ్రంగా పోటీ పడినప్పటికీ చివరకు రాజస్థాన్ రాయల్స్ అతన్ని దక్కించుకుంది. అతని కనీస ధర రూ. 1.50 కోట్లు ఉండగా, అంతకు 10 రెట్లు అధికంగా అమ్ముడుపోవడం విశేషం. ఈ వేలంలో తొలి రోజు ఇంగ్లాండ్‌కు చెందిన బెన్ స్టోక్స్(రూ. 12.5 కోట్లు) అత్యధిక ధర పలికిన ఆటగాడు కాగా, ఆ తర్వాత స్థానంలో ఉనద్కత్ నిలిచాడు. అలాగే భారత్ నుంచి అత్యధిక ధర పలికిన ఆటగాడిగా ఉనద్కత్ నిలిచాడు.

రెండో రోజు వేలం రాహుల్ చాహర్‌తో ప్రారంభమైంది. రాజస్థాన్‌కు చెందిన ఈ స్పిన్ మాంత్రికుడిని ముంబయి ఇండియన్స్ రూ.1.90కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. అతడి ప్రారంభ ధర రూ.20లక్షలు కాగా.. అధిక ధరకు అమ్ముడుపోయాడు. గత సీజన్‌లో రాహుల్ రైజింగ్ పూణె సూపర్‌జెయింట్(ఆర్‌పీఎస్) తరపున ఆడిన మూడు మ్యాచ్‌ల్లో 2 వికెట్లు తీశాడు. గతేడాది వేలంలో రాహుల్ రూ.10లక్షలు పలికాడు.

షబాజ్ నదీమ్ ఎక్కువ ధర పలికాడు. ఢిల్లీ డేర్‌డెవిల్స్ రూ.3.2కోట్ల వెచ్చింది అతడిని సొంతం చేసుకుంది. గతేడాది కూడా నదీమ్‌ను డేర్‌డెవిల్స్ కొనుగోలు చేసింది. అతని ప్రదర్శనను ద ష్టిలో ఉంచుకొని మళ్లీ అతడిని కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపింది. ఇక గతేడాది ముంబయి ఇండియన్స్ తరపున ఆడిన 29ఏళ్ల గౌతమ్ క ష్ణప్ప మంచి ధర పలికాడు. రూ.6.2కోట్లు వెచ్చించి రాజస్థాన్ రాయల్స్ అతడిని కొనుగోలు చేసింది. రైజింగ్ పూణె తరపున రవిచంద్రన్ అశ్విన్‌తో పాటు ఆడిన మురుగన్ అశ్విన్‌ను ఈ ఏడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ రూ.2.2కోట్లకు సొంతం చేసుకుంది. అతడి ఆరంభ ధర రూ.20లక్షలు. మరో ఆటగాడు ఎవిన్ లూయిస్‌ను ముంబయి ఇండియన్స్ రూ.3.2కోట్లకు కొనుగోలు చేసింది. ముంబయి ఓపెనర్ సౌరభ్ తివారిని రూ.80లక్షలకు ముంబయి ఇండియన్స్ సొంతం చేసుకుంది.

హైదరాబాద్ పేసర్ మొహ్మద్ సిరాజ్‌కు కూడా మంచి ధర పలికింది. అతని కనీస ధర రూ. కోటి ఉండగా, రూ. 2.60 కోట్లకు ఆర్సీబీ దక్కించుకుంది.

ఆస్ట్రేలియాకు చెందిన ఆండ్రూ టౌను రూ. 7. 2 కోట్లు చెల్లించి కోల్‌కత్తా నైట్ రైడర్స్ సొంతం చేసుకుంది.

ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన 16 ఏళ్ల స్పిన్నర్ ముజీబ్ జద్రాన్‌ను కోల్‌కతా రూ 4 కోట్లకు కొనుగోలు చేసింది.

పంజాబ్‌కు గేల్

టీ20 స్పెషలిస్టు, యూనివర్స్ బాస్, వెస్టిండీస్ విధ్వంసక వీరుడు క్రిస్‌గేల్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ కొనుగోలు చేసింది. మూడోసారి వేలంలోకి వచ్చిన అతడిని కనీస ధర రూ.2 కోట్లకు కొనుగోలు చేసింది. తొలిరోజు జరిగిన ఐపీఎల్ వేలంలో గేల్‌ను ఎవ్వరూ కొనుగోలు చేయలేదు. రెండోరోజు మొదటి సెషన్‌లో అతడిని వేలానికి ఉంచినప్పుడు సైతం ఫ్రాంచైజీలు అనాసక్తినే ప్రదర్శించాయి. చివరికి మూడో సారి క్రిస్‌గేల్ పేరును వేలందారు చెప్పినప్పుడు కింగ్స్ ఎలెవన్ పంజాబ్ కొనుగోలు చేసింది.

నేపాల్ ఆరంగ్రేటం

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కాంట్రాక్టు దక్కించుకున్న నేపాల్ తొలి క్రికెటర్‌గా యువ ఆటగాడు సందీప్ లామిచానె రికార్డు దక్కించుకున్నాడు. రెండో రోజు ఆటగాళ్ల వేలంలో కనీస ధర రూ.20 లక్షలకు అతడిని ఢిల్లీ డేర్‌డెవిల్స్ దక్కించుకుంది. 17 ఏళ్ల ఈ లెగ్ స్పిన్నర్ 2016 అండర్-19 ప్రపంచకప్‌లో తన సంచలన బౌలింగ్‌తో నేపాల్‌ను ఎనిమిదో స్థానంలో నిలిపాడు. ఆరు ఇన్నింగ్సుల్లో 17 సగటుతో 4.67 ఎకానమీతో 14 వికెట్లు తీశాడు. టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన రెండో ఆటగాడిగా నిలిచాడు. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో ఏకంగా హ్యాట్రిక్ సాధించి రాత్రికి రాత్రే సంచలనంగా మారాడు. అండర్-19 ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ ఘనత సాధించిన ఐదో ఆటగాడిగా నిలిచాడు.

తండ్రి భారతీయ రైల్వేలో పనిచేసినప్పుడు సందీప్ రెండుమూడేళ్లు భారత్‌లో గడిపాడు. సచిన్ టెండూల్కర్, ద్రవిడ్‌లు తనకు ఆదర్శమని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా స్పిన్ దిగ్గజం షేన్‌వార్న్ అంటే అతడికి ఎంతో ఇష్టం.


సందీప్ లామిచానె

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

గుంటూరులో నిర్వహిస్తున్న మారెళ్ల కైలాష్‌నాథ్‌రెడ్డి మెమోరియల్ ద్వితీయ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు మూడోరోజూ ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆదివారం తొలి మ్యాచ్ పురుషుల విభాగం నుండి కర్నాటక పోస్టల్, సర్వీసెస్ ఢిల్లీ జట్ల మధ్య రసవత్తరంగా నడిచింది. మొదటి రెండు సెట్లు కర్నాటక గెలవగా మూడో సెట్ సర్వీసెస్ నిలబెట్టుకుంది. చివరి సెట్‌లో కర్నాటకే గెలిచి మ్యాచ్‌ని ముగించింది. పోటాపోటీ మ్యాచ్‌లో 25-22, 25-18, 19-25, 25-19 పాయింట్లతో కర్నాటక విజేతగా నిలిచింది. మహిళల విభాగంలో రెండో మ్యాచ్ జెస్పియన్ చెన్నై, స్పోర్ట్స్ హాస్టల్ మైసూర్ మధ్య జరిగింది. సీనియర్స్ అయిన జేపియర్స్ చెన్నై జట్టు తమ అనుభవంతో వరుస సెట్లతో స్పోర్ట్స్ హాస్టల్ జట్టుపై 25-17, 25-18, 25-17 పాయింట్లతో అలవోకగా విజయం సాధించారు. అనంతరం మహిళల కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు, కేరళ పోలీస్ జట్లు, పురుషుల విభాగం నుండి ఆంధ్రప్రదేశ్, సిఆర్‌పిఎఫ్ జట్లు తలపబడ్డాయి. ఈ పోటీలను తిలకించేందుకు ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, గుంటూరు తూర్పు వైసిపి ఎమ్మెల్యే ముస్తఫా, నిర్వాహకులు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి, అరికపూడి రమణరావు వచ్చారు. ఆదివారం సెలవు కావడంతో క్రీడలు నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ సేడియంలో గ్యాలరీ ప్రేక్షకులతో కిటకిటలాడింది. వందల మంది స్టేడియం వెలుపల ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్స్‌పై పోటీలను చూశారు.

కోహ్లిసేనపై ప్రశంసలు

న్యూఢిల్లీ : దక్షిణాఫ్రికాతో మూడో టెస్టులో విజయం సాధించిన భారత క్రికెట్ జట్టుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. రెండు వరుస ఓటముల తరువాత ఎంతో కష్టమైన పిచ్‌పై అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్న టీమిండియాకు అభినందనలు వెల్లువెత్తున్నాయి. అన్ని ఒత్తిళ్లను, విమర్శలను తిప్పికొడుతూ అద్వితీయ పోరాటంతో, బౌలర్ల విజ ంభణతో చిరస్మరణీయ విజయం సాధించిన కోహ్లీ సేనకు మాజీ, ప్రస్తుత క్రికెటర్లు అభినందనలు తెలియజేశారు. జోహానెస్‌బర్గ్‌లో జరిగిన మూడో టెస్టులో భారత్ 63 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మాస్టర్ బ్లాస్టర్ సచిన్, గౌతం గంభీర్, సురేశ్ రైనాతో పాటు పలువురు టీమిండియాకు అభినందనలు తెలిపారు.

ఫైనల్లో సైనా ఓటమి



జకార్తా : ఇండోనేషియా మాస్టర్స్ టోర్నమెంట్‌లో భారత షట్లర్ సైనా నెహ్వాల్ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ టోర్నిలో మహిళ సింగిల్స్ విభాగంలో ఆదివారం జరిగిన తుదిపోరులో సైనాపై ప్రపంచ నంబర్‌వన్, చైనీస్ తైపీ క్రీడాకారిణి తై జు యింగ్ విజయం సాధించింది. మోకాలి గాయం కారణంగా సుమారు ఏడాది కాలం ఆటకు దూరంగా ఉన్న సైనా ఈ టోర్నిలో ఫైనల్‌కు చేరుకుని ఆశలు రేకెత్తించింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో పివి సింధూపైనా విజయం సాధించింది. అయితే ఆదివారం ఫైనల్‌లో మాత్రం ఆ స్థాయి ఆటతీరును ప్రదర్శించలేకపోయింది. కేవలం 27 నిమిషాల్లో మ్యాచ్ ముగిసింది. 21-9, 21-13 స్కోరుతో సునాయసంగా వరస సెట్లలో తై జు విజయం సాధించింది. సైనాపై తై జుకి ఇది వరసగా ఏడో విజయం కావడం విశేషం. ఇద్దరి మధ్య ఇప్పటి వరకూ జరిగిన ముఖాముఖీ పోరులో సైనా ఐదుసార్లు విజయం సాధించగా, తై జు తొమ్మిది సార్లు విజయం సాధించింది. కాగా, ఈ విజయం తో ఇండోనేషియా మాస్టర్స్ టోర్ని గెలుచుకున్న తొలి చైనీస్ తైపీ క్రీడాకారిణిగా తై జు నిలిచింది. కాగా, రజత పతకం సాధించడంపై సైనా సంతోషం వ్యక్తం చేసింది. కోచ్ గోపిచంద్‌తో పాటు తనకు మద్దతుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపింది. గత ఏడాది జనవరిలో మలేషియా మాస్టర్స్ గ్రాండ్ ప్రిలో టైటిల్ సాధించిన తరువాత మళ్లీ ఫైనల్స్‌కు చేరుకోవడం సైనాకు ఇదే మొదటిసారి.

సౌత్ జోన్ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో

క్రీడాకారులకు పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులతో జిల్లా అక్వాటిక్ సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి -విజయవాడ స్పోర్ట్స్

ఈ నెల 26 నుండి 28వ తేదీ వరకు చెన్నైలో జరిగిన 30వ సౌత్ జోన్ జాతీయ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో కృష్ణా జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారని జిల్లా అక్వాటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్ తెలిపారు. ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రూప్-1 విభాగంలో లోహిత్ బంగారు పతకం, ఎం.వసూ రామ్ కాంస్య పతకం, యువరాజ్‌కు కాంస్య పతకం, అర్జున్‌రెడ్డి వెండి పతకాలు సాధించారని తెలిపారు. గ్రూప్-2లో మనేష్‌కు కాంస్య పతకం, గ్రూప్-4లో ఎం.సరత్‌కు కాంస్య పతకం, సంపత్ కుమార్ యాదవ్‌కు కాంస్య పతకాలు లభించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా అక్వాటిక్ సంఘం చైర్మన్ జి.గురుప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.బాల మురళీ కృష్ణ, ఇంటర్నేషనల్ స్విమ్మర్స్ తులసీ చైతన్య, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

టీ20 సిరీస్‌కు టీమిండియా ఎంపిక



రైనాకు చోటు

ముంబయి : దక్షిణాఫ్రికాతో వచ్చే నెలలో జరుగనున్న టీ20 సిరీస్‌కు భారత్ క్రికెట్ జట్టును ఆదివారం ప్రకటించారు. చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలో సమావేశమైన సెలక్షన్ కమిటీ టీ20 జట్టును వెల్లడించింది. 16 మందితో కూడిన ఈ బృందంలో సురేష్ రైనాకు స్థానం దక్కింది. చివరిసారిగా 2017 ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20ల్లో అతను పాల్గొన్నాడు. రైనాకు అదే చివరి అంతర్జాతీయ మ్యాచ్. ఇంతకాలం ఫిట్‌నెస్ లేని కారణంగా రైనా జట్టుకు దూరంగా ఉన్నాడు. ఇటీవల రైనా 'యో యో' పరీక్ష పాలయ్యాడు. ఇటీవలే ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నమెంట్ లోనూ రైనా ఆకట్టుకున్నాడు. రైనాతో పాటు, అక్షర్‌పటేల్, జయ్‌దేవ్ ఉనద్క త్‌లకు స్థానం కల్పిం చారు. ఫిబ్రవరి 18, 21, 24 తేదీల్లో దక్షిణాఫ్రికాతో టీ20ల్లో భారత్ తలపడనుంది. అలాగే ఈ టీ20 సిరీస్‌కు ముందు వన్డే సిరీస్‌లో భారత్ పాల్గొంటుంది. ఆరు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఫిబ్రవరి 1న ప్రారంభమై 16న ముగిస్తుంది. కాగా, ఈ దక్షిణాఫ్రికా పర్యటన లో ఇటీవలే ముగిసిన టెస్టు సిరీస్‌లో 2-1తో ఆతిధ్య జట్టు విజయం సాధించింది. అయితే చివరి టెస్టులో 63 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది. ఈ విజయం భారత్ శిబిరంలో ఉత్సాహం నింపింది. భారత టీ 20 జట్టు : విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ (వైస్ కెప్టెన్), శిఖర్ ధావన్, కెఎల్ రాహుల్, సురేశ్ రైనా, ఎంఎస్ ధోని (వికెట్ కీపర్), దినేష్ కార్తీక్, హార్థిక్ పాండే, అక్షర్ పటేల్, యుజ్వేందర్ చాహల్, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా, జయదేవ్ ఉనద్కత్, శార్థుల్ ధాకూర్.

ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి


నిమ్మగడ్డ లక్ష్మీనారాయణ, గణపతి మృతదేహాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (పశ్చిమగోదావరి)

ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ సంఘటన పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయగూడెం మండలం దండిపూడి సమీపంలోని దట్టమైన అటవీప్రాంతం పోగొండ రిజర్వాయర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జంగారెడ్డిగూడేనికి చెందిన నిమ్మగడ్డ లక్ష్మీనారాయణ(28), అడపా గణపతి(26) మరో ఐదుగురు స్నేహితులు కలిసి దేవరగుండం వద్ద స్నానం చేసేందుకు దిగారు. తొలుత నిమ్మగడ్డ లక్ష్మీనారాయణ కర్ర సహాయంతో లోతును కొలుచుకుంటూ కొంచెం ముందుకు వెళ్లాడు. అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. ఈ క్రమంలో అతన్ని కాపాడేందుకు గణపతి, మరో స్నేహితుడు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గణపతి కూడా మునిగిపోయాడు. మరో స్నేహితుడు ప్రాణాలతో బయటపడ్డాడు. వారిద్దరూ మునిగిపోయారు. దీంతో మిగిలిన స్నేహితులు దగ్గరలో ఉన్న గ్రామానికి వెళ్లి జరిగిన సంఘటనను గ్రామస్తులకు తెలిపారు. నీట మునిగిన వారిని కాపాడేందుకు మంగయ్యపాలెం గ్రామానికి చెందిన తెల్లం రమేష్ గాలించారు. కాసేపటికే ఇద్దరి మృతదేహాలు పైకి తేలడంతో వాటికి వెలికి తీశారు. అనంతరం పోలీసులకు సమాచారం తెలపడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతికి కారణమైన దేవరగుండంను ఆయన పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతున్నట్లు తెలిపారు. అడపా గణపతి వెల్డింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య ఉంది. లక్ష్మీనారాయణ వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య, నాలుగు నెలల పాప ఉంది.

11న ఎపి గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఎన్నికల్ని ఫిబ్రవరి 11న నిర్వహించేందుకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎన్నికల అధికారి, ఎపిఎన్జీవో అసోసియేషన్ నాయకులు ఎ విద్యాసాగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంఘంలో 13 మంది కార్యవర్గ సభ్యుల్ని ఎన్నుకునేందుకు తిరుపతిలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా విజయవాడలో ఫిబ్రవరి 3, 4 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషన్ పత్రాల్ని స్వీకరిస్తారన్నారు. నామినేషన్ పత్రాల్ని పరిశీలించాక అర్హుల జాబితాను ప్రకటిస్తారన్నారు. ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు నిర్ణయించినట్లు తెలిపారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేస్తారన్నారు.

ఏజెన్సీలో ఫీడర్ అంబులెన్సులు

పైలట్ ప్రాజెక్టుగా 122 వాహనాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏజెన్సీ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ అంతంత మాత్రంగానే ఉంటుంది. ఈ కారణంగానే కొన్ని సందర్భాల్లో ఆరోగ్య కేంద్రాలకు వచ్చేలోగా ప్రసవాలు సంభవించడం, మాతా శిశు మరణాలు వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. చంద్రన్న సంచార చికిత్స, 108 వాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొండ ప్రాంతాల్లో, కొన్ని ఇరుకుగా ఉన్న ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నాయి. దీంతో చేసేదిలేక వైద్యసేవల కోసం డోలీ కట్టుకుని స్థానికులే ఆరోగ్య కేంద్రాలకు తీసుకొచ్చే పరిస్థితి ఉంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరలో ఫీడర్ అంబులెన్సుల్ని ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తోంది. సాధారణ అంబులెన్సులు వెళ్లలేని ప్రాంతాలకు ఫీడర్ అంబులెన్సులు వెళ్లి రోగిని కొండ ప్రాంతం నుంచి ఆరోగ్య కేంద్రానికి తీసుకొస్తాయని వైద్యఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. 108 అంబులెన్స్‌లో ఉండే సౌకర్యాలనే అందుబాటులో ఉంచుతూ, రోగిని ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చేందుకు ఫీడర్ అంబులెన్స్ వాహనాల్ని ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. ఈ వాహనాలకు కూడా జిపిఎస్ విధానం ఉంటుంది. పైలట్ ప్రాజెక్టుగా అన్ని ఐటిడిఎ ప్రాంతాల్లో మొత్తం 122 వాహనాల్ని అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అన్ని ఏజెన్సీల్లో 43 అంబులెన్సులు పనిచేస్తున్నాయి. వాటి స్థానంలో ఈ ఫీడర్ అంబులెన్సుల్ని తీసుకురానున్నారు. ప్రయివేటు సంస్థకు వీటి బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది.

ఇంకా ఖరారు కాని వాహనాల డిజైన్లు

నలభై రోజుల్లో ఫీడర్ అంబులెన్సు సేవల్ని అందిస్తామని వైద్యఆరోగ్య శాఖాధికారులు ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ప్రస్తావించారు. అయితే ఇప్పటికీ ఆ వాహనాల డిజైన్లు ఖరారు కాలేదు. ఇప్పటికే రెండు రకాల డిజైన్లు పరిశీలించామని, కొత్తగా పైలట్‌కు వెనుక భాగాన రోగిని కూర్చోబెట్టుకునేలా డిజైన్‌ను రూపొందించినట్లు వివరించారు. దాదాపు ఈ డిజైన్‌ను ఖరారు చేసే అవకాశముందని అధికారులు భావిస్తున్నా రు. ఆయా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ వాహనాల్ని అందు బాటులో ఉంచుతామని,108 కాల్‌సెంటర్ ద్వారానే సేవలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు.



పూర్తి బాధ్యత ప్రయివేటు సంస్థదే

వైద్యఆరోగ్య శాఖలో దాదాపు అన్ని సేవలూ ప్రయివేటు భాగస్వామ్యంతోనే అమలవుతున్నాయి. 108 అంబులెన్సుల విషయంలో కూడా మందులు, వాహనాల్ని ప్రభుత్వమే అందిస్తున్నా వాటి నిర్వహణ బాధ్యత మాత్రం భారత్ వికాస్ గ్రూప్ (బివిజి) కు అప్పగించింది. ఫీడర్ అంబులెన్స్‌ల విషయంలో వాహనాల డిజైన్‌తోపాటు, నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాల బాధ్యత కూడా ప్రయివేటు సంస్థకే అప్పగించింది. అయితే ఆ సంస్థ పేరును మాత్రం వైద్యఆరోగ్య శాఖ బయట పెట్టడంలేదు. అలాగే ఆ సేవలకుగాను సదరు సంస్థకు ప్రభుత్వం ఎంత చెల్లిస్తుందో తెలిపేందుకు కూడా వెనుకాడుతోంది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68